www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కువైట్ ప్రమాద మృతుల్లో..
ముగ్గురు ఆంధ్రులు

2

మాతృభూమి నుంచి వస్తూనే
మృత్యువు ఒడిలోకి శ్రీకాకుళం వాసి
ఇద్దరు తూర్పుగోదావరి జిల్లా వాసుల మృతి
కిందికి దూకిన ముగ్గురు రాష్ట్ర వాసులు క్షేమం
మృతదేహాల తరలింపునకు వాయుసేన
విమానం.. పర్యవేక్షిస్తున్న కేంద్ర మంత్రి

శుక్రవారం | 14-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 59

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 12.04 తదుపరి నవమి; నక్షత్రం: ఉత్తర ఫల్గుణి; వర్జ్యం: మ. 1.15-3.04; దుర్ముహూర్తం: ఉ. 8.20-9.13, మ.12.41-1.33; అమృతఘడియలు: రా. 12.06-1.54; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

5 సంతకాల సంబరం

ఏపీలో తొలిరోజునే ఐదు కీలక హామీల అమలు

సీఎంగా బాధ్యతలు స్వీకరించిన బాబు
మెగా డీఎస్సీపైనే తొలి సంతకం
16,347 టీచర్ పోస్టుల భర్తీకి నిర్ణయం
'ల్యాండ్ టైటిల్' రద్దుపై రెండో సంతకం
'పేదల పింఛను రూ.4 వేల'పై మూడోది
నాలుగో సంతకం స్కిల్ సెన్సెస్‌పై
అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై ఐదోది



మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల అమలుపై 'తొలి సంతకాల'తో ఏపీలో చంద్రబాబు పాలన ప్రారంభమైంది. సంక్షేమం, ఉపాధి, ఉద్యోగం, వ్యవసాయం, నైపుణ్యం... ఈ ఐదు రంగాలకు సంబంధించిన ఫైళ్లపై ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు సంతకాలు పెట్టారు. బుధవారం ఏపీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన... గురువారం వేద పండితుల ఆశీర్వచనాల మధ్య సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. సతీమణి భువనేశ్వరితో కలిసి తన చాంబర్‌లో అడుగుపెట్టారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఐదు కీలక హామీల అమలుపై నిర్ణయం తీసుకున్నారు. 16,347 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసేలా 'మెగా డీఎస్సీ'ని ప్రకటిస్తూ... ఆ ఫైలుపైనే చంద్రబాబు తొలి సంతకం చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఒకేసారి ఇంత భారీ సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టడం ఇదే తొలిసారి. కాగా ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా 6,100 పోస్టులతో

మిగతా 12వ పేజీలో...

దేశంలో బొగ్గు ఉత్పత్తిని పెంచుతాం



ఖనిజాలను వెలికి తీసేందుకు కృషి చేస్తా
ప్రధాని మోదీనమ్మకాన్ని నిలబెట్టుకుంటా
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
ఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో బాధ్యతల స్వీకరణ
కేంద్రం హోంశాఖ సహాయ మంత్రిగా
బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్

14



మహిళా శక్తి క్యాంటీన్లు

13

రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా
150 క్యాంటీన్ల ఏర్పాటు లక్ష్యం
కలెక్టరేట్లు, ఆలయాలు, బస్టాండ్లు, పర్యాటక ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో..
మహిళాసంఘాల బలోపేతానికే
సీఎస్ శాంతికుమారి వెల్లడి

తెలుగు పుస్తకాలు వెనక్కి!

13

'ముందుమాట'పై వివాదం
నేపథ్యంలో విద్యాశాఖ నిర్ణయం
ఆ పేజీ మరోవైపున
వందేమాతరం, జాతీయ గీతం
దాన్ని తొలగిస్తే ఇబ్బందే..!

యడియూరప్పకు నాన్‌బెయిలబుల్ వారెంట్

2

పోక్సో కేసులో జారీ
చేసిన బెంగళూరు కోర్టు
సీఐడీ అరెస్టు చేసే అవకాశం

డిగ్రీలో 40-45% మార్కులున్నా..

ఉపాధ్యాయ పోస్టులకు అర్హులే!

12

ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు

కోన్ ఐస్‌క్రీమ్‌లో చేతివేలి ముక్క!

2

తింటుంటే నాలుకకు తగిలిన వైనం
ఓ వైద్యుడికి జుగుప్సాకరమైన
అనుభవం.. ముంబైలో ఘటన
ఐస్‌క్రీమ్ కంపెనీపై కేసు నమోదు
పరీక్షల కోసం ల్యాబ్‌కు అవశేషం

రుణమాఫీకి

రూ.25 వేల కోట్లు!

పీఎం-కిసాన్ మార్గదర్శకాలనే పాటిస్తే కావాల్సిన మొత్తం

పంట రుణాలు తీసుకున్న 47 లక్షలమందికీ మాఫీ చేయాలంటే 35 వేల కోట్లు
పీఎం-కిసాన్ మార్గదర్శకాల అమలుతో అర్హులకు న్యాయం
సర్కారుపై ఆర్థిక భారం భారీగా తగ్గే అవకాశం ఉందని అంచనా

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రుణ మాఫీ పథకం అమలుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం- కిసాన్) మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుంటే ఎలా ఉంటుంది? అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. రుణమాఫీకి అవే మార్గదర్శకాలను పాటిస్తే ప్రభుత్వంపై ఆర్థిక భారం భారీగా తగ్గే అవకాశం ఉంది! రాష్ట్రంలో పంట రుణాలు తీసుకున్న మొత్తం 47 లక్షల మందికీ రూ.2 లక్షల దాకా రుణమాఫీ చేయాల్సి వస్తే.. రూ.35 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని అధికారుల అంచనా. అదే పీఎం-కిసాన్ మార్గదర్శకాలను అమలు చేస్తే రూ.25 వేల కోట్లతో రుణమాఫీ పథకం పూర్తవుతుందనే అంచనాతో



రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో.. ఆ నిబంధనలతో అసలైన రైతులకు మేలు జరుగుతుందా? ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి రైతుకూ మేలు జరగాలంటే ఎలాంటి విధి విధానాలు ఉండాలి? అనే అంశంపై కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం- కిసాన్ పథకం మార్గదర్శకాలు కాస్త కఠినంగానే ఉన్నాయి. ఈ పథకం కింద మోదీ సర్కారు.. 5 ఎకరాల లోపు విస్తీర్ణం ఉండి, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఏడాదికి రూ.6 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తోంది. అధిక ఆదాయాన్ని పొందుతూ

మిగతా 13వ పేజీలో...

గొర్రెల స్కాంపై ఈడీ కన్ను

మనీ లాండరింగ్ కోణంలో విచారణకు సిద్ధం
నేడు టీజీఎస్‌జీడీసీఎఫ్ఎల్‌కు అధికారులు.. విచారణ
కీలక సూత్రధారులు లక్ష్మారెడ్డి, మొహిదొద్దీన్‌పై ఆరా!

13



మెదక్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

కేసీఆర్‌పై ఈడీ కేసు!

హరీశ్, వెంకట్రామిరెడ్డికి ముసళ్ల పండుగే
విజయోత్సవ ర్యాలీలో ఎంపీ రఘునందన్‌రావు

13

ప్రజా ప్రతినిధులకూ నోటీసులు

అఫిడవిట్ల ఆధారంగానే
కమిషన్ తదుపరి నిర్ణయాలు
అప్పటి నీటి పారుదల శాఖ
మంత్రి కేసీఆర్ అల్లుడు కదా!..
అని జస్టిస్ పీసీ ఘోష్ వ్యాఖ్య
నీటి నిల్వ కారణంగానే
బ్యారేజీల వైఫల్యం
నిపుణుల కమిటీ స్పష్టీకరణ

13

'నీట్' గ్రేస్ మార్కులు రద్దు చేశాం

2

ఆ 1563 మంది మళ్లీ పరీక్ష రాయొచ్చు.. 23న పరీక్ష.. 30న ఫలితాలు
మళ్లీ పరీక్ష రాయడానికి ఇష్టపడనివారు అసలు మార్కులతో కౌన్సెలింగ్‌కెళ్లొచ్చు
సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం.. కౌన్సెలింగ్ నిలిపివేతకు కోర్టు నిరాకరణ
గ్రేస్ మార్కుల ఉపసంహరణతో 67 నుంచి 61కి తగ్గిన టాప్‌ర్యాంకర్ల సంఖ్య

కోన్ ఐస్‌క్రీమ్‌లో చేతివేలు!



- తింటుంటే నాలుక్కింద గోరుతో కూడిన అర అంగుళం పొడువు ముక్క
- ఓ యువ వైద్యుడికి జుగుప్సాకరమైన అనుభవం.. ముంబైలో ఘటన

ముంబై, జూన్ 13: భోజనం చేశాక తీరిగ్గా కూర్చుని చల్లటి ఐస్‌క్రీమ్‌ను ఆస్వాదిస్తున్న ఆయన నాలుకకు ఏదో గట్టిగా తగిలింది! అది పళ్ల కింద నలగలేదు.. అంటే డ్రైఫ్రూట్ కాదు. అనుమానమొచ్చి చేత్తో బయటకు తీసి చూసి కంగుతిన్నాడు! అది.. మనిషి చేతి వేలు! ముంబైలోని పశ్చిమ మలాద్ ప్రాంతంలోని ఓర్లెమ్ బెండన్ సెర్రావో అనే 26 ఏళ్ల వైద్యుడికి ఇలా ఒళ్లు గగుర్పొడిచే జుగుప్సాకరమైన, భయానక అనుభవం ఎదురైంది. సెర్రావో బుధవారం ఓ ఆన్‌లైన్ డెలివరీ యాప్‌లో 'యమ్మో' అనే కంపెనీ నుంచి బటర్ స్కాచ్ ఫ్లేవర్ కోన్ ఐస్‌క్రీమ్ ఆర్డర్ పెట్టారు. డెలివరీ బాయ్ తెచ్చిచ్చాక లంచ్ తర్వాత ఆ ఐస్‌క్రీమ్‌ను ఆయన తినడం మొదలు పెట్టారు. నాలుక కింద ఏదో గట్టిగా తగలడంతో దాన్ని బయటకు తీసి చూశారు. అర అంగుళం పొడవు, గోరుతో కూడిన ఓ ముక్క కనిపించింది. స్వయంగా వైద్యుడు కావడంతో అది మనిషి చేతి వేలు అని సెర్రావో నిర్ధారించుకున్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారొచ్చి.. ఆ చేతివేలును పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ ఐస్‌క్రీమ్ తయారు చేసిన 'యమ్మో ఐస్‌క్రీమ్ కంపెనీ'పై కేసు నమోదు చేశారు.

జూలై మూడో వారంలో కేంద్ర బడ్జెట్!

- జూన్ 22న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం
- ఈ నెల 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక

న్యూఢిల్లీ, జూన్ 13 : 2024-25 ఏడాదికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ జూలై మూడో వారంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ ఆ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. 2024-25 బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. కచ్చితమైన ప్రణాళిక, సమగ్ర విశ్లేషణతో బడ్జెట్‌ను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. దేశ ఆర్థిక ప్రాధాన్యాలు, నిర్దేశించుకున్న లక్ష్యాలు, సవాళ్లకు అనుగుణంగా బడ్జెట్ ఉండాలని సూచించారు. దీంతో కేంద్ర బడ్జెట్ జూలై మూడో వారంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోపక్క, 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం న్యూఢిల్లీ వేదికగా జూన్ 22న జరగనుంది. ఈ మేరకు జీఎస్టీ కౌన్సిల్ ఎక్స్‌లో గురువారం ఓ పోస్టు పెట్టింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ఇతర ప్రతినిధులు పాల్గొంటారు. 52వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం గతేడాది అక్టోబరులో జరిగింది. కాగా, లోక్‌సభ నూతన స్పీకర్ ఎన్నిక జూన్ 26న జరగనుంది. జూన్ 24న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూలై 3 వరకు కొనసాగే అవకాశముంది.

లోకం తీరు



ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపండి

- పూర్తి బలంతో ఉగ్రవాదులను అణచివేయండి
- జమ్మూకశ్మీర్ పరిస్థితిపై సమీక్షలో మోదీ ఆదేశం



ఇటలీకి వెళ్లేముందు మోదీ అభివాదం

న్యూఢిల్లీ, జూన్ 13: జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ సమీక్ష నిర్వహించారు. అక్కడ వరుసగా ఉగ్రదాడులు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఆయన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాల మోహరింపు, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా మాట్లాడినట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని మోదీ ఆదేశించినట్లు వెల్లడించాయి. పూర్తిస్థాయి సామర్థ్యాలను వినియోగించుకొని ఉగ్రవాదులను అణచివేయాలని పేర్కొన్నట్లు తెలిపాయి. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా ప్రధాని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. స్థానిక యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను సిన్హా ప్రధానికి వివరించారు. కాగా, రియాసీలో జరిగిన ఉగ్రదాడికి సంబంధించి 50 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇక చైనా, పాక్ సంయుక్త ప్రకటనలో జమ్మూకశ్మీర్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల భారత్ గురువారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

జీ 7 అతిథులకు ఇటలీ ప్రధాని 'నమస్తే'!

రోమ్, జూన్ 13: మన సంస్కృతీ సంప్రదాయాల్లో భాగమైన 'నమస్కారం'.. ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపైనా కనిపిస్తోంది. జీ7 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న ఇటలీ ప్రధాని జార్జియా మెలోని.. సమావేశాల్లో పాల్గొనటానికి వస్తున్న దేశాధినేతలను 'నమస్తే'తో ఆహ్వానించటం విశేషం. జర్మనీ చాన్స్‌లర్ ఓలఫ్ స్కోల్జ్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్‌కు నమస్కారం పెట్టి సదస్సుకు సాదరంగా ఆహ్వానిస్తున్న మెలోని ఫొటోలు, వీడియోలు పలువురిని ఆకర్షిస్తున్నాయి. జీ7 సదస్సులో పాల్గొనటానికి ప్రధాని మోదీ గురువారం ఇటలీకి వెళ్లారు.

అజయ్ తవాడే.. ఓ 'క్రిమినల్' డాక్టర్

- పుణె కారు ప్రమాదం కేసులోనే కాదు..
  అతనిపై ఇంకా అనేక ఆరోపణలు

పుణె, జూన్ 13: పుణె కారు ప్రమాదం కేసులో దిగ్భ్రాంతికర విషయాలు ఇంకా వెలుగులోకి వస్తున్నాయి. మే 19న పుణెకు చెందిన 17 ఏళ్ల కుర్రాడు మద్యం మత్తులో అతి నిర్లక్ష్యంగా కారును నడిపి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను బలిగొన్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో కుర్రాడి రక్త నమూనాల స్థానంలో అతడి తల్లి రక్త నమూనాలను ఉంచి కేసును తప్పుదోవ పట్టించేందుకు చూశాడు ససూన్ ఆస్పత్రి ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ అజయ్ తవాడే. క్రైం బ్రాంచ్ పోలీసులు విచారణలో ఇతడి నేర నేపథ్యం బయటపడుతోంది. డాక్టర్ అజయ్ గతంలోనూ పలు కేసుల్లో రక్త నమూనాల మార్పిడికి పాల్పడినట్లు తేలింది. ఇందుకోసం పశ్చిమ మహారాష్ట్రలోని 4జిల్లాల్లో బ్రోకర్లు, డాక్టర్లతో అతడు ముఠా ఏర్పాటు చేశాడు. ధనిక కుటుంబాలకు చెందిన ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వీరు రంగంలోకి దిగుతారు. వారి రక్త నమూనాలను మార్చేస్తారు. రెండేళ్ల నుంచి వీరు ఇలా చేస్తున్నారు. కొన్ని ఉదంతాల్లో రూ.5లక్షల వరకు వసూలు చేశారు. డాక్టర్ అజయ్‌కు డ్రగ్స్, కిడ్నీ మార్పిడి కేసుల్లోనూ ప్రమేయం ఉన్నట్లుగా గతంలో ఆరోపణలు వచ్చాయి.

ఖుర్బానీ ఇచ్చిన జంతువుల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టకండి

- ముస్లింలకు జామియత్ ఉలేమా- ఈ- హింద్ సూచన

న్యూఢిల్లీ, జూన్ 13: ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రముఖ ముస్లిం సంస్థ జామియత్ ఉలేమా-ఈ-హింద్ కొన్ని నియమ నిబంధనలను జారీ చేసింది. ఖుర్బానీ (బలి) ఇచ్చిన జంతువుల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టొద్దని ముస్లింలకు సూచించింది. ఖురాన్‌లో నిషేధించిన జంతువులను ఖుర్బానీ ఇవ్వకూడదని స్పష్టంచేసింది. దేశంలో సున్నిత పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కొన్ని మతాల, కులాల వారు పవిత్రంగా భావించే జంతువులను ఖుర్బానీ ఇవ్వకూడదని పేర్కొంది. ఖుర్బానీ ఇచ్చాక జంతువుల అవశేషాలను ఎంపిక చేసిన ప్రాంతాల్లో పూడ్చి పెట్టాలని, వాటిని రహదారుల వెంట, బహిరంగ ప్రదేశాల్లో పడేయరాదని పేర్కొంది. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని విన్నవించింది.

ఆధార్-రేషన్ లింక్ గడువు సెప్టెంబరు 30 వరకు

న్యూఢిల్లీ, జూన్ 13: ఆధార్, రేషన్ కార్డుల అనుసంధానానికి గడువు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ నెల 30వరకు ఉన్న గడువును సెప్టెంబరు 30 వరకు పొడిగిస్తూ ఆహార, పౌరసరఫరాల విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక దేశం-ఒక రేషన్ కార్డు అన్న విధానంలో భాగంగా ఆధార్ అనుసంధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఆయా రాష్ట్రాల ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) పోర్టల్ ద్వారా ఈ అనుసంధానం చేసుకోవచ్చు.

భద్రతా సలహాదారుగా మళ్లీ అజిత్ దోభాల్



న్యూఢిల్లీ, జూన్ 13: జాతీయ భద్రతా సలహాదారుగా అజిత్ దోభాల్ వరుసగా మూడోసారి నియమితులయ్యారు. దీనికి సంబంధించి కేంద్రం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ఐపీఎస్ అధికారి అయిన దోభాల్‌ను మోదీ ప్రభుత్వం తొలిసారి 2014లో ఆ పదవిలో నియమించింది. 2019లో తిరిగి నియమితులైన ఆయన పదవీకాలం ఇటీవల పూర్తి కావడంతో కేంద్రం ఆయన్నే కొనసాగించాలని నిర్ణయించింది.

హత్యానేరం ఒప్పుకునేందుకు నటుడు దర్శన్ రూ.30 లక్షల డీల్

బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నటుడు దర్శన్‌పై నమోదైన హత్యకేసు విచారణలో పలు విషయాలు బహిర్గతమవుతున్నాయి. బహచిత్రదుర్గ నివాసి రేణుకాస్వామిని హత్య చేసి, ఆ నేరాన్ని ఒప్పుకునేందుకు నలుగురు యువకులకు రూ.30లక్షలు ఇచ్చేలా డీల్ కుదిరినట్లు పోలీసుల విచారణలో తేలింది. దర్శన్‌ను కేసు నుంచి తప్పించేందుకు ఈ వ్యూహం పన్నినట్లు పోలీసులు గుర్తించారు. బెంగళూరులో హత్య చేసి, చిక్కమగళూరు జిల్లా చార్మాడిఘాట్‌లోగానీ, తమిళనాడులోని అటవీప్రాంతంలోగానీ మృతదేహాన్ని పడేయాలని కుట్ర పన్నారు. మృతదేహాన్ని తరలించేందుకు భయపడి బెంగళూరు సుమనహళ్లి సమీపంలోని ఓ కాలువలో పడేశారు. హత్యకేసులో నిందితుల సంఖ్య 17కి చేరింది. ఓ మహిళ సహా నలుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. దర్శన్ అభిమానుల సంఘం చిత్రదుర్గ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర.. నలుగురు యువకులకు రూ.30 లక్షలు చెల్లించి, డీల్ కుదిర్చేందుకు యత్నించినట్లు పోలీసులు గుర్తించారు. కాగా హత్యకేసులో నటుడు దర్శన్ అరెస్టుకావడంపై జేడీఎస్ యువనేత నిఖిల్ స్పందించారు. చట్టం ముందు అందరూ ఒక్కటేనన్నారు.

'నీట్' గ్రేస్ మార్కులు రద్దు చేశాం

1,563 మంది మళ్లీ పరీక్ష రాయొచ్చు.. 23న పరీక్ష.. 30న ఫలితాలు

- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం
- కౌన్సెలింగ్ నిలిపివేతకు సుప్రీం కోర్టు నిరాకరణ




న్యూఢిల్లీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై వెల్లువెత్తుతున్న విమర్శల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షా కేంద్రాల వద్ద సమయాన్ని కోల్పోయిన 1563 మంది అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను ఉపసంహరించుకున్నట్టు సుప్రీంకోర్టుకు తెలిపింది. వారందరికీ జూన్ 23న మరోసారి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొంది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన వెకేషన్ బెంచ్.. కేంద్రం నిర్ణయాన్ని సముచిత నిర్ణయంగా అభివర్ణించింది. జూలై 6 నుంచి ప్రారంభం కానున్న నీట్-యూజీ కౌన్సెలింగ్‌ను నిలిపివేయడానికి నిరాకరించిన కోర్టు.. వైద్యకళాశాలల్లో అభ్యర్థుల అడ్మిషన్లు నీట్ వ్యవహారంపై దాఖలైన కేసుల ఫలితంపై ఆధారపడి ఉంటాయని స్పష్టం చేసింది. కేంద్రం, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కాను అగర్వాల్.. జూన్ 23న నిర్వహించే పరీక్షకు సంబంధించి నోటిఫికేషన్‌ను గురువారమే విడుదల చేయనున్నట్టు ధర్మాసనానికి వెల్లడించారు. ఈ వ్యవహారంపై నియమించిన కమిటీ సిఫారసుల మేరకు.. 1563 మంది అభ్యర్థులకు కలిపిన గ్రేస్‌మార్కులను రద్దు చేసినట్టు పేర్కొన్నారు. వారందరికీ వారి అసలు మార్కుల వివరాలను పంపుతామని.. మళ్లీ పరీక్ష రాయడానికి ఇష్టపడనివారు, తమకు వచ్చిన అసలు మార్కులతోనే కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చని స్పష్టం చేశారు. జూన్ 23న వీరికి నిర్వహించే పరీక్ష ఫలితాలను 30న ప్రకటిస్తామని వెల్లడించారు. దీనివల్ల.. ఎంబీబీఎస్, బీడీఎస్ ఇతర కోర్సుల్లో ప్రవేశానికి జూలై 6న నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండదని పేర్కొన్నారు. ఇక.. నీట్‌లో అవకతవకలపై కోర్టును ఆశ్రయించిన 'ఫిజిక్స్‌వాలా' సంస్థ తరఫున ప్రముఖ న్యాయవాది జె.సాయిదీపక్ వాదనలు వినిపించారు. మళ్లీ నిర్వహించే పరీక్షను 1563 మంది అభ్యర్థులకు మాత్రమే పరిమితం చేయకుండా.. అదే కారణంతో నష్టపోయి, కోర్టుకు రాలేకపోయినవారందరికీ ఆ అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కానీ.. కోర్టు ఆయన అభ్యర్థనను తిరస్కరించి, తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. కాగా.. గ్రేస్ మార్కులను ఉపసంహరిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో నీట్ టాపర్ల సంఖ్య 67 నుంచి 61కి తగ్గింది. గ్రేస్ మార్కులు పొందినవారిలో ఆరుగురు ఈ టాపర్ల జాబితాలో ఉన్నారు. వారికి అదనంగా కలిపిన మార్కులు తీసేయడంతో టాపర్ల జాబితాలో వారికి చోటు లేకుండా పోయింది. 1523 మందిలో ఎంతమంది మళ్లీ పరీక్ష రాస్తారో తెలిశాకనే సవరించిన టాపర్ల జాబితాను విడుదల చేస్తామని ఎన్టీయే అధికారి ఒకరు తెలిపారు.

బాధ్యతారాహిత్యమే..: కాంగ్రెస్

నీట్ నిర్వహణలో అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కాంగ్రెస్‌పార్టీ గురువారం మరోసారి డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ప్రజల్లో ఉన్న ఆగ్రహం పార్లమెంటులో కూడా ప్రతిధ్వనిస్తుందని హెచ్చరించింది. ఈ వ్యవహారంలో బీజేపీ తీరు బాధ్యతారహితంగా ఉందని మండిపడ్డ కాంగ్రెస్.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్‌ను తొలగించాలని డిమాండ్ చేసింది. పేపర్‌లీకులు, రిగ్గింగుల ద్వారా మోదీ సర్కారు గడిచిన పదేళ్లలో కోట్లాది మంది యువత భవిష్యత్తును నాశనం చేసిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. "ఈ వ్యవహారంలో కేంద్రం తన బాధ్యతను ఎన్టీయే భుజాలపైకి నెట్టేసి తప్పించుకోజాలదు. నీట్ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి. లేదంటే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిష్పక్షపాత విచారణ జరిపించాలని కాంగ్రెస్ కోరుతోంది. దోషులకు కఠిన శిక్ష విధించాలి. ఏడాది కాలాన్ని కోల్పోయిన లక్షలాది మంది విద్యార్థులకు పరిహారం ఇవ్వాలి" అని ఖర్గే ట్వీట్ చేశారు. ఇక.. గ్రేస్ మార్కుల ఉపసంహరణ నిర్ణయం సరేగానీ.. అసలు, వాటిని తొలుత ఎందుకు కలిపారో వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయిందా? లేదా? తెలపాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను, ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాను ఆయన ప్రశ్నించారు. 2019 నుంచి గత ఏడాది దాకా ఏ సంవత్సరంలోనూ నీట్‌లో ముగ్గురికి మించి టాపర్లు లేరని.. అలాంటిది ఈ ఏడాది 67 మంది టాపర్లు ఎలా వచ్చారని ఆయన నిలదీశారు. విపక్షాలు చేస్తున్న విమర్శలను కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ తోసిపుచ్చారు. పేపర్ లీక్ అయిందనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని ఆయన స్పష్టం చేశారు. 1563 మందికి గ్రేస్ మార్కులు కూడా అల్లాటప్పాగా ఇవ్వలేదని.. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఫార్ములా ఆధారంగా ఇచ్చినవేనని ఆయన వెల్లడించారు.

యడియూరప్పకు నాన్‌బెయిలబుల్ వారెంట్

- పోక్సో కేసులో జారీ చేసిన కోర్టు
- సీఐడీ అరెస్టు చేసే అవకాశం



బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు యడియూరప్పపై బెంగళూరు కోర్టు నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉంది. సాయం కోసం కుమార్తె(17)తో కలిసి తాను ఈఏడాది ఫిబ్రవరి 2న యడియూరప్ప ఇంటికి వెళ్లగా తన కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో సదాశివనగర్ పోలీసులు మార్చి 14న ఆయనపై పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం డీజీపీ అలోక్ మోహన్ ఈ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించారు. కాగా, బాధిత బాలిక తల్లి గతనెలలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ కేసులో చార్జిషీట్‌ను ఈనెల 15వ తేదీలోగా దాఖలు చేయాల్సి ఉన్నందున సీఐడీ అధికారులు యడియూరప్పకు నోటీసులు జారీ చేయగా, ఈనెల 17న విచారణకు హాజరవుతానని యడియూరప్ప సమాచారం పంపారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడైన యడియూరప్ప ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. కేసును విచారిస్తున్న ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి రమేశ్ గురువారం యడియూరప్పపై నాన్‌బెయిలబుల్ వా రెంట్ జారీ చేశారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం యడియూరప్ప హైకోర్టును ఆశ్రయించారు. కాగా, పోక్సో కేసులో అవసరమైతే యడియూరప్ప ను సీఐడీ విభాగం అరెస్టు చేసే అవకాశం ఉందని హోంమంత్రి పరమేశ్వర్ గురువారం చెప్పారు.

కువైట్ ప్రమాదంలో ముగ్గురు ఆంధ్రుల దుర్మరణం

మాతృభూమి నుంచి వస్తూనే మృత్యువు ఒడిలోకి శ్రీకాకుళం వాసి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



ప్రమాదం నుంచి తప్పించుకున్న గంగయ్య

కువైట్‌లోని మంగఫ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు దుర్మరణంపాలయ్యారు. తెలంగాణకు చెందిన మరో ముగ్గురు అగ్నికీలలు, దట్టమైన పొగను తప్పించుకునేందుకు భవనం పైనుంచి దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో 50 మంది మృతిచెందగా.. వారిలో సింహభాగం(45 మంది) భారతీయులు, ముగ్గురు ఫిలిప్పైన్స్ జాతీయులు ఉన్నట్లు కువైట్ అధికారులు ప్రకటించారు.

సెలవులు ముగించుకుని..

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జంకిభద్రకు చెందిన తామడ లోకనాథం(31) ఆరేళ్లుగా ఎన్‌బీటీసీ సంస్థలో రోలింగ్ ఆపరేటర్ హెల్పర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవలే భారత్ వెళ్లారు. సెలవులు ముగించుకుని, మంగళవారం అర్ధరాత్రి దాటాక కువైట్ చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా తన క్యాంప్‌నకు చేరుకుని, ప్రయాణ బడలికతో ఆదమరిచి నిద్రించారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో.. నిద్రలోనే మృత్యువు ఒడిలోకి జారుకున్నారు. నిబంధనల ప్రకారం ఆయన క్యాంప్‌నకు తిరిగి రాగానే.. ఆ వివరాలను ఎంట్రీ చేయించుకోవాలి. అలా చేయకపోవడం వల్ల క్యాంప్ లిస్టులో అతని పేరును చేర్చలేదు. దాంతో మరణ ధ్రువీకరణలో ఆలస్యమేర్పడింది. ఇదే క్యాంప్‌లో మరో ఐదుగురు తెలుగువారు ఆశ్రయం పొందేవారు. వారిలో తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన ఈశ్వర్ మీసాల(45), పెరవలి మండలం ఖండవల్లికి చెందిన మొల్లేటి సత్యనారాయణ(45) కూడా చనిపోయినట్లు కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించింది. వీరిద్దరూ హైవే స్టోర్‌లో డెలివరీ బాయ్స్‌గా పనిచేసేవారని తెలిసింది.

భవనం పైనుంచి దూకి..

మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం, కొమ్మగూడెం గ్రామానికి చెందిన కె.గంగయ్యతో పాటు.. తెలంగాణకు చెందిన మరో ఇద్దరు కూడా ప్రమాదం జరిగిన భవనంలోనే ఉన్నారు. తెల్లవారుజామున ప్రమాదం జరగ్గానే వీరు తప్పించుకునే ప్రయత్నం చేశారు. మెట్లపైన కూడా మాడిపోయిన స్థితిలో మృతదేహాలు కనిపించడం.. దట్టమైన పొగ అలుముకుంటుండడంతో.. భవనం పైనుంచి దూకేశారు. కేబుల్ వైర్ల సాయంతో రెండో అంతస్తు నుంచి దూకినట్లు గంగయ్య 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

డీఎన్ఏ పరీక్షలు..

ఈ ఘటనలో మొత్తం 50 మంది మృతిచెందగా.. మృతదేహాలు గుర్తించలేని విధంగా తయారయ్యాయని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో శ్రీహరి అనే కేరళీయుడు మృతిచెందగా.. కువైట్‌లోనే పని చేసే అతని తండ్రి ప్రదీప్ తన కుమారుడి మృతదేహాన్ని గుర్తించడంలో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. చివరకు తన కొడుకు ఒంటిపై ఉండే టాటూ ద్వారా గుర్తించగలిగారు. శరీరమంతా మసిబారిపోయి, ముఖం ఉబ్బి ఉందని, టాటూ లేకుంటే.. గుర్తించడం కష్టమయ్యేదని ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. విగతా మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. ఆ తర్వాతే స్వదేశాలకు మృతదేహాల తరలింపు ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. కాగా.. మృతుల్లో చాలా మంది పార్ట్‌టైమ్ డెలివరీ బాయ్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా ప్రభుత్వం వద్ద వీరి వివరాలు పెద్దగా ఉండవు. దీంతో.. మృతదేహాల గుర్తింపులో ఆలస్యమేర్పడినట్లు సమాచారం. మృతుల్లో 45 మంది భారతీయులు, ముగ్గురు ఫిలిప్పైన్స్ వాసులు ఉన్నట్లు అధికారులు చెబుతుండగా.. మరో ముగ్గురి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. భారతీయుల్లో కేరళకు చెందినవారు 23 మంది, తమిళులు 8 మంది ఉన్నారు. మిగతా వారిలో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ నుంచి ముగ్గురేసి, ఒడిసా నుంచి ఇద్దరు, హరియాణా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్ణాటక, బిహార్ రాష్ట్రాలకు చెందిన ఒక్కో బాధితుడు ఉన్నారని భారత విదేశాంగ శాఖ గురువారం రాత్రి విడుదల చేసిన ప్రకటన స్పష్టం చే స్తోంది. భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి కృతి వర్ధన్ సింగ్ గురువారం ఉదయమే కువైట్ చేరుకున్నారు. వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడి, ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను భారత్‌కు తరలించేందుకు కేంద్రం వాయుసేనకు చెందిన విమానాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. మరోవైపు కువైట్ రాజు షేక్ మిషాల్ అహ్మద్ అల్-సబా కూడా మృతదేహాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కేరళీయులకు 14 లక్షల చొప్పున పరిహారం

కువైట్ అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు కేంద్రం రూ.2లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే.! తాజాగా గురువారం కేరళ సీఎం పినరయి విజయన్ రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఇస్తామని మలయాళీ వ్యాపారవేత్త యూసుఫ్ అలీ, రూ. 2 లక్షల చొప్పున అందజేస్తామని మరో వ్యాపారవేత్త రవి పిళ్లై వెల్లడించారు.

దారుణం జరిగిపోయింది: ఇబ్రహీం



ఇబ్రహీం (ప్రత్యక్ష సాక్షి)

కువైట్‌లోని ఓ చమురు సంస్థలో సీనియర్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న హైదరాబాద్ సనత్‌నగర్‌కి చెందిన మహమ్మద్ ఇబ్రహీం ఇమాన్ బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘటనను గురించి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. "ప్రమాదం జరిగిన క్యాంపు భవనం పక్క బ్లాక్‌లోనే మేము నివసిస్తున్నాం. తెల్లవారుజామున 4 గంటల సమయంలో పెద్దఎత్తున ఆర్తనాదాలు.. హాహాకారాలు వినిపించాయి. కిటికీలోంచి బయటకు చూస్తే.. దట్టమైన పొగ, మంటలు కనిపించాయి. సేఫ్టీ ఆఫీసర్ కావడం వల్ల అవసరమైన సహాయం చేయాలనే ఉద్దేశంతో ప్రమాదస్థలి వద్దకు పరుగులు తీశాను. చూస్తుండగానే.. మూడో అంతస్తు నుంచి ఒకరి తర్వాత ఒకరు.. ఇలా ఐదారుగురు కిందకు దూకుతూ కనిపించారు. వారిలో ఒకరు నా కళ్ల ముందే మరణించారు" అని ఆయన వివరించారు.

మృతులు వీరే

ఎన్నికల ఫలితాలు చూసి..



శ్రీకాకుళం, జూన్ 13(ఆంధ్రజ్యోతి)/సోంపేట: శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకిభద్రకు చెందిన తామాడ లోకనాథం నిరుపేద కుటుంబానికి చెందినవారు. ఇటీవలే తమ ఊళ్లోని గ్రామదేవత సంబరాల కోసం కువైట్ నుంచి వచ్చారు. ఎన్నికల ఫలితాలను చూసి.. అందరితో సరదాగా గడిపి.. మంగళవారం కువైట్ బయలుదేరారు. అర్ధరాత్రి దాటాక కువైట్‌లోని తమ క్యాంపునకు చేరుకుని, నిద్రకు ఉపక్రమించారు. అగ్నిప్రమాదంతో నిద్రలోనే తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. లోకనాథం మృతితో జింకిభద్రలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమను ఆదుకుంటాడనుకున్న కొడుకు ఇకలేడని తెలుసుకుని, లోకనాథం తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. మృతదేహాన్ని వెనక్కి రప్పించేలా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవ తీసుకుంటున్నట్లు తెలిసింది.

నాలుగు రోజుల్లో వస్తాడనుకుంటే..



పెరవలి, జూన్ 13: మీసాల ఈశ్వర్ పదేళ్లుగా కువైట్‌లోని హైవే సూపర్‌మార్కెట్‌లో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవలే కుమార్తెకు వివాహం నిశ్చయమవ్వగా.. విమానం టికెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో కువైట్ నుంచి రావడాన్ని మరో నాలుగు రోజులకు వాయిదా వేసుకున్నారు. నాలుగు రోజుల్లో వస్తాడనుకున్న ఈశ్వర్.. విగత జీవిగా వస్తుండడంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కుటుంబాన్ని పోషించేందుకు వెళ్లి..



మొల్లేటి సత్యనారాయణ తన కుటుంబాన్ని పోషించేందుకు పదేళ్లుగా కువైట్‌లో పని చేస్తున్నారు. ఈయనకు భార్య, విద్యాభ్యాసం చేస్తున్న ఓ కుమారుడు, వ్యవసాయ పనులు చేసుకునే తల్లిదండ్రులున్నారు. బుధవారం నాటి అగ్నిప్రమాదంలో సత్యనారాయణ తీవ్ర గాయాలపాలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందారు. కుటుంబ సభ్యులకు ఇంకా విషయం తెలియదని ఖండవల్లి గ్రామస్తులు తెలిపారు.

బీజేపీకి తగ్గిన 3% దళిత ఓట్లు

న్యూఢిల్లీ, జూన్ 13: దళితులు జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలవైపు మొగ్గు చూపినట్టు ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఫలితాలపై సీఎస్‌డీఎస్ సర్వే సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం దళితులు బీజేపీకన్నా ఇతర పార్టీలను ఆదరించారు. బీజేపీకి దళితుల ఓట్లు 3 శాతం మేర తగ్గాయి. అదే కాంగ్రెస్‌కయితే ఒక శాతం తగ్గుదల ఉంది. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీకి దళిత ఓట్లు ఏకంగా 8% పెరగడం గమనార్హం.

మొబైల్, లాండ్‌లైన్ నంబర్లకు చార్జీలు

ట్రాయ్ నూతన ప్రతిపాదన

న్యూఢిల్లీ, జూన్ 13: మొబైల్, లాండ్‌లైన్ నంబర్లకు త్వరలోనే చార్జీలు చెల్లించాల్సి రావొచ్చు. ఈ నంబర్లకు చార్జీలను ప్రవేశపెట్టే దిశగా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నూతన ప్రతిపాదన చేసింది. ఫోన్ నంబర్లను విలువైన వనరుగా భావిస్తున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. ఇటీవల విడుదల చేసిన ఒక చర్చాపత్రంలో ఈ ప్రతిపాదనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ మేరకు ఈ నంబర్లకు సంబంధించి మొబైల్ ఆపరేటర్ల నుంచి చార్జీలు వసూలు చేయనున్నారు. అప్పుడు ఆయా కంపెనీలు ఆ మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, సింగపూర్, బెల్జియం, ఫిన్లాండ్, బ్రిటన్, గ్రీస్, హాంకాంగ్, బల్గేరియా, కువైట్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, పోలాండ్, నైజీరియా, దక్షిణాఫ్రికా, డెన్మార్క్ తదితర దేశాలు ఫోన్ నంబర్లకు చార్జీలు విధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లోనూ నంబరింగ్ వనరులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇలాంటి చర్యలను అనుసరించాలని ట్రాయ్ భావిస్తున్నట్టుగా తెలుస్తోంది.

మందలించ లేదు.. సలహాలు ఇచ్చారు

- అమిత్ షాతో సంభాషణపై తమిళిసై వివరణ

చెన్నై, జూన్ 13: ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం జరిగిన సందర్భంగా వేదికపై ఆసీనులైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తనను మందిలించారంటూ జరుగుతున్న ప్రచారంపై తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై వివరణ ఇచ్చారు. ఆయన తననేమీ మందలించలేదని, పార్టీ కోసం పనిచేయాలంటూ సూచనలు ఇచ్చారని స్పష్టం చేశారు. వేదికపై ఆమెతో అమిత్ షా మాట్లాడిన తీరు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆమెతో ఆగ్రహంగా మాట్లాడారని, మందలించారన్న వ్యాఖ్యానాలు వినిపించాయి. దీనిపై ఆమె గురువారం ట్వీట్ చేస్తూ "ఎన్నికల తరువాత తొలిసారిగా ఆ వేదికపైనే అమిత్ షాతో మాట్లాడాను. ఎన్నికలు ముగిసినందున ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు, ఎలాంటి సవాళ్లు ఎదురవుతున్నాయని అడిగారు. నేను వాటిని వివరిస్తుండగా సమయం లేకపోవడంతో త్వరత్వరగా మాట్లాడుతూ పార్టీకి, నియోజకవర్గం అభివృద్ధికి మరింత విస్తృతంగా పనిచేయాలని చెప్పారు. దీనిపై రకరకాల వదంతులు వ్యాపించడంతో ఈ వివరణ ఇస్తున్నాన"ని వివరించారు.

ఆగస్టు 15 నాటికి ఏన్కూరు ద్వారా నీళ్లు

- 1.20 లక్షల ఎకరాలకు గోదావరి నీళ్లు అందిస్తాం
- ఏన్కూరు కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం
- నీటి పారుదల రంగాన్ని కేసీఆర్ నాశనం చేశారు
- సీతారామ రీడిజైన్‌తో ప్రజాధనం దుర్వినియోగం
- రూ.8 వేల కోట్లు ఖర్చుపెట్టి.. ఎకరాకైనా నీళ్లివ్వలేదు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి
- భద్రాద్రి జిల్లాలో సీతారామ ప్రాజెక్టు సందర్శన, సమీక్ష

ఖమ్మం(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం/అశ్వాపురం/ములకలపల్లి, జూన్ 13: ఆగస్టు 15 నాటికి సీతారామ ప్రాజెక్టు పరిధిలోని ఏన్కూరు లింక్ కెనాల్ నిర్మాణం పూర్తి చేసి 1.20లక్షల ఎకరాలకు గోదావరి నీళ్లను అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూ.2,654కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను గత ప్రభుత్వ పాలనలో రీడిజైన్ చేసి అంచనా వ్యయాన్ని రూ.20వేల కోట్లకు పెంచారని దుయ్యబట్టారు. పదేళ్లలో రూ.8వేల కోట్లు ఖర్చు చేసి.. ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కేసీఆర్ నిర్వాకం వల్లే రాష్ట్రంలో నీటిపారుదల రంగం నాశనమైందని దుయ్యబట్టారు. సీతారామ ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకొచ్చి గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భద్రాద్రి జిల్లాలో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ నిర్మాణ పనులను గురువారం మంత్రుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా భారీ విద్యుత్ మోటార్ల కోసం ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌ను వారు ప్రారంభించారు. అనంతరం ములకలపల్లి మండలం పూసూరు పంపుహౌస్ వద్ద ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు- ఎన్నెస్పీ కెనాల్‌ను లింక్ చేయడానికి ఏన్కూరు లింక్ కెనాల్(9కిలోమీటర్లు)ను పూర్తి చేయాలని నిర్ణయించి, రూ.72కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ లింక్ కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం పంపుల ట్రయల్ రన్ కోసం ప్రాసెసింగ్ కొనసాగుతుందని తెలిపారు. 1, 2, 3 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీల పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో నీటి పారుదల రంగాన్ని కేసీఆర్ నాశనం చేశారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. ప్రణాళిక లేకుండా నిధులు దుబారా చేసి, కోలుకోలేని విధంగా రాష్ట్రానికి నష్టం చేకూర్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.90,400 కోట్లు ఖర్చు పెట్టి 93,000 ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే సృష్టించగలిగారని ఆరోపించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.27వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టుకు రూ.8,000 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదన్నారు. ఆగస్టు 15లోగా సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లా రైతులకు గోదావరి నీళ్లను అందిస్తామన్నారు. పాలేరు లింక్ కెనాల్‌లో భాగంగా జూలూరుపాడు వద్ద టన్నెల్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. సీతారామ ప్రధాన కాలవ వెంట ఉన్న కొత్తగూడెం, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు డిస్ట్రిబ్యూటరీ కాలువలు నిర్మించనున్నట్లు చెప్పారు. ఏడాదిన్నరలోగా సీతారామ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు.


సీతారామ ఎత్తిపోతల పథకం మోటార్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి

కష్టమైనా సీతారామ పూర్తి చేస్తాం

కష్టమైనా, భారమైనా సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం లింక్‌కెనాల్ హెడ్‌వర్క్, ఎత్తిపోతల పనులు పూర్తయ్యాయని, కొంత భూసేకరణతోపాటు జూలూరుపాడు, పాలేరు లింక్ కెనాల్‌కు సంబంధించి రెండు టన్నెళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా, లంకసాగర్ ప్రాజెక్టులకు నీళ్లు తీసుకెళ్తే.. కొంతమేర సాగర్ ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. సీతారామ ద్వారా మొత్తం 10లక్షల ఎకరాలకు నీరందిస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సీతారామ ద్వారా ఆగస్టు 15 నాటికి 1.20లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెంలో ఆయకట్టు పెంచేలా సీతారామను రీడిజైన్ చేయాలని సూచించారు.

కవలలతో చెరువులో దూకిన ఇల్లాలు

- బాలుడి మృతి.. తల్లి, కుమార్తెను కాపాడిన కానిస్టేబుళ్లు
- భర్తతో గొడవపడిన మనస్తాపంతో ఘాతుకం
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఘటన

పటాన్‌చెరు, జూన్ 13: ఇల్లాలి క్షణికావేశం ఆ ఇంట్లో పెను విషాదాన్ని నింపింది. ఆలుమగల మధ్య గొడవ, వారి మూడేళ్ల చిన్నారిని బలిగొంది. భర్తతో గొడవ పడి, ఆ మనస్తాపంతో భార్య.. తన మూడేళ్ల వయసున్న కవలలతో కలిసి చెరువులో దూకింది. దగ్గర్లోని పెట్రోలింగ్ సిబ్బంది తల్లి, కుమార్తెను సురక్షితంగా బయటకు తీయగా.. కుమారుడు మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఈ ఘటన జరిగింది. సీఐ నాగరాజు వివరాల ప్రకారం.. శ్వేత (28), విద్యాధర్‌రెడ్డి (33) దంపతులు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. వీరికి కవలలు అమ్మాయి శ్రీహ, అబ్బాయి శ్రీహన్స్ (3) ఉన్నారు. ఈ కుటుంబం చందానగర్‌లో ఉంటోంది. శ్వేత, విద్యాధర్ బుధవారం రాత్రి గొడవ పడ్డారు. తీవ్ర మనస్తాపం చెందిన శ్వేత గురువారం తెల్లవారుజామున 2 గంటలకు ఇంటి నుంచి పిల్లలను తీసుకొని స్కూటీపై అమీన్‌పూర్ పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. కట్టపై స్కూటీని నిలిపి తొలుత శ్రీహన్స్‌ను చెరువులోకి విసిరేసి, కూతురుతో కలిసి దూకింది. సమీపంలో సాయిబాబా ఆలయం వద్ద పెట్రోలింగ్ చేస్తున్న అమీన్‌పూర్ స్టేషన్ కానిస్టేబుళ్లు జానకీరాం, ప్రభాకర్ చెరువులో శబ్దం విని అప్రమత్తమయ్యారు. ఇద్దరూ పరుగుపరుగున వెళ్లి చెరువులో దూకి.. మునిగిపోతున్న శ్వేత, కూతురు శ్రీహను సురక్షితంగా బయటకు తీశారు. అయితే అప్పటికే శ్రీహన్స్ నీళ్లలో మునిగిపోయాడు. బాబు కోసం ఎంత గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఉదయం శ్రీహన్స్ మృతదేహం నీటిపై తేలడంతో బయటకు తీశారు. మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదైంది.

మంత్రాల అనుమానంతో మహిళపై దాడి

- గొడ్డలితో నరకడంతో తలపై తీవ్ర గాయాలు
- జనగామ జిల్లా నర్మెటలో ఘటన

నర్మెట, జూన్ 13: మంత్రాలు చేస్తోందన్న అనుమానంతో ఓ మహిళపై యువకుడు గొడ్డలితో దాడి చేశాడు. ఈ సంఘటన జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. నర్మెటకు చెందిన నక్కల రవి కుటుంబ సభ్యులు గత కొంతకాలంగా అనారోగ్యానికి గురవుతున్నారు. తమ బంధువైన నక్కల సత్తెమ్మ మంత్రాలు చేయడం వల్లే తన కుటుంబసభ్యులు అనారోగ్యం బారిన పడుతున్నారని రవి అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి సత్తెమ్మపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సత్తెమ్మ కుమారుడు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదుతో నక్కల రవిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

కర్రెగుట్ట అడవిలో పేలిన ప్రెషర్‌బాంబు

- మహిళ కాళ్లకు తీవ్ర గాయాలు

వెంకటాపురం(నూగూరు), జూన్ 13: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో గురువారం ప్రెషర్ బాంబు పేలిన ఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం డోలి గ్రామంలో కొలువైన బెడెం మల్లన్నను దర్శించుకునేందుకు ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం చొక్కాలకు చెందిన సుమారు వందమంది బయలుదేరారు. అటవీ మార్గంలో వెళ్తుండగా భూమిలో పాతిపెట్టి ఉన్న బాంబుపై సుజాత అనే మహిళ కాలేయడంతో అది పేలింది. ఆమె ఎడమకాలు 80 శాతం దెబ్బతింది. కుడి కాలికి కూడా తీవ్రగాయమైంది. తోటి గ్రామస్థులు సుజాతను జోలెలో మోస్తూ పాలెం వాగు ప్రాజెక్టు సమీపానికి చేర్చారు. అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, ఈ నెల 3న వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో మందు పాతర పేలి జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి మరణించాడు.


గాయపడిన సుజాత

న్యాయస్థానాల్లో ప్రభుత్వ న్యాయవాదుల నియామకాలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ కోరారు. కాంగ్రెస్ లీగల్ సెల్‌లో పనిచేసిన వారికి అవకాశం ఇవ్వాలని విన్నవించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కువైట్ విషాదం

కువైట్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల సంఖ్య నలభైఐదుకు చేరుకుంది. చాలా మృతదేహాలు గుర్తుపట్టలేనిస్థితిలో ఉన్నందున డీఎన్ఏ పరీక్ష ద్వారా నిర్ధారణ జరుగుతోంది. అయా అంతస్థుల్లో ఎక్కడివారక్కడ నిలువునా తగలబడిపోయిన ఘోరమైన ఘటన ఇది. కొందరు దట్టమైన పొగలో ఊపిరాడక, మెట్లపైనే ఒరిగిపోయి అగ్నికి ఆహుతి అయిపోవాల్సివచ్చింది. కార్మికులను గొడ్లకంటే హీనంగా చూసే యజమానులు, వారి అపరిమిత ధనదాహం ఈ ఘోరానికి కారణం.

ఇటువంటి ఘోరాలు జరిగినప్పుడల్లా సదరు భవనానికి అనుమతులు లేవని, లేదా నిబంధనలు ఉల్లంఘించి దానిని కట్టారని, పరిమితిని మించి జనాన్ని అందులో కుక్కారని మనదేశంలో అధికారులు ఎట్లా అయితే అంటారో, కువైట్‌లోనూ అక్కడి అధికారులు అలాగే అంటున్నారు. అసలు ఆ భవనంలో ఎవరు ఉంటున్నారో, ఎందరు, ఎందుకు ఉంటున్నారో అక్కడి అధికారులకు తెలియదట. ఇంత ఘోరం జరిగిన తరువాతే సదరు బహుళ అంతస్థుల భవనం ఫైర్‌సేఫ్టీ నియమాలకు అనుగుణంగా లేదని వారికి తెలిసివచ్చింది. ప్రమాదం జరిగిన సమయంలో రెండువందలమందికి పైగా కార్మికులు అందులో ఉన్నారని కువైట్ స్థానిక పత్రికలు రాస్తున్నాయి. అధికారులు దీనిని పట్టించుకోకపోవడానికి కారణం వారంతా కార్మికులు కావడమే. కువైట్ జనాభాలో మూడింట రెండువంతులమంది వలస కార్మికులే కనుక, వారి ఆకలిబతుకులను, ఆవాసాలను పట్టించుకొనేంత శ్రద్ధ అక్కడి అధికారులకు, పాలకులకు సహజంగానే ఉండదు. భారతీయులైనప్పటికీ, ఒక రాష్ట్రానికి చెందినవారి ఊసు మరొకరికి పట్టనిస్థితి సైతం అక్కడ ఉన్నదని ఈ ఘటన తెలియచెబుతోంది. కువైట్ భవననిర్మాణరంగంలో అగ్రస్థానంలో ఉన్న ఎన్బీటీసీ గ్రూప్ ఈ భవనాన్ని లీజుకు తీసుకొని, తన కార్మికులను అందులో ఉంచిందని, దాని యజమాని కేరళకు చెందినవాడని తెలిసినప్పుడు మరింత ఆశ్చర్యం కలుగుతుంది. మరణించినవారిలో అధికులు కేరళకు చెందినవారే.

ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే కొన్ని అరెస్టులు జరిగాయి, విచారణామొదలైంది. కిటకిటలాడే ఇటువంటి భవనాలమీద కన్నేసివుంచుతామని, నిబంధనలు ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇస్తున్నారు. కానీ, వలసకార్మికుల విషయంలో తమ అధికారులు, పాలకులు తగినంత శ్రద్ధపెట్టడం లేదని, గతంలోనూ ప్రమాదాలు జరిగినప్పుడు ఇటువంటి హడావుడే చేసి ఆ తరువాత వదిలేశారని స్థానిక పత్రికలు విమర్శిస్తున్నాయి. గల్ఫ్‌దేశాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం విషయంలో మన ప్రభుత్వాలు ఎంతమేరకు శ్రద్ధవహిస్తున్నాయన్నది అసలు ప్రశ్న. గతంతో పోల్చితే ఇటువంటి ఘోరాలు జరిగినప్పుడు స్పందించడం, వైద్య సహాయాలు అందించడం, నష్టపరిహారాలు ప్రకటించడం సత్వరమే జరుగుతున్నమాట నిజం. కానీ, కువైట్ తదితర గల్ఫ్‌దేశాలు అనుసరిస్తున్న విధానంలో వలస కార్మికుల మంచిచెడులు చూడాల్సిన బాధ్యత పూర్తిగా యజమానిదే కావడం వల్ల కార్మికులకు న్యాయం జరగడం లేదు. వారి హక్కుల ఉల్లంఘన తీవ్రస్థాయిలో జరుగుతున్నదని, యాజమాన్యాలు వారితో అమానవీయంగా, అమానుషంగా వ్యవహరిస్తున్నాయని, అన్ని విషయాల్లోనూ దోపిడీకి పాల్పడుతున్నాయని అనాదిగా ఫిర్యాదులున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

భారతదేశానికి చెందిన వలసకార్మికులు కోటికిపైగా గల్ఫ్‌దేశాల్లో నివసిస్తున్నారు. వారు చెమటచిందించి సంపాదించిన లక్షలకోట్ల రూపాయలు విదేశీ మారకద్రవ్యం రూపంలో మనదేశానికి చేరుతోంది. మన పాలకులకు ఎన్నారైలమీద ఉన్న ప్రేమ ఈ వలసకార్మికులమీద లేదు. వీరి సంక్షేమం మన ప్రభుత్వాలకు పట్టదు. గల్ఫ్‌దేశాల్లో ఏటా వందలమంది కార్మికులు ప్రమాదాల్లో చిక్కుకొని కన్నుమూస్తున్నా, గాయపడుతున్నా వారిని కాపాడుకొచ్చే విధానాలు, వ్యవస్థలూ లేవు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రతకోసం ప్రత్యేకమైన బోర్డులు, వ్యవస్థలు ఉండాలి. నేరాలూ ఘోరాలూ జరిగినప్పుడు మాత్రమే స్పందించి, కాస్తంత నష్టపరిహారాన్ని విదిలించడం కాక, నిరంతరం కార్మికులకోసం పాటుపడే వ్యవస్థలు ఉండాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా బడ్జెట్ కేటాయింపులు జరిపి, ఖర్చుచేయాలి. గల్ఫ్ దేశాల ఆర్థికప్రగతిలో మన కార్మికుల పాత్ర కాదనలేనిది. భారత ప్రభుత్వం తనకున్న సత్సంబంధాలను ఉపయోగించి వారి సంక్షేమం కోసం ఒత్తిడితేవాలి.

నరేంద్ర మోదీ శకానికి విరామం!





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

గొప్ప అభినయం, సుమధుర సంగీతం, కన్నుల పండువ చేసే దృశ్యాల ఇంద్రజాలం ఉన్న సినిమాను వీక్షించడంలో ఉన్న మహదానందాలలో ఒకటి దాని విరామ సమయం. కథా గమనం నాటకీయమైన పతాక స్థాయికి చేరిన క్షణాన ఆ విశ్రాంతి రావడం కద్దు. ఆ విరామ కాలంలో మనం వెండి తెర వెలుగు జిలుగులు, మనలను ఆవరించి ఉన్న చీకటి నుంచి బయటకు వచ్చి సహజ కాంతిని అనుభూతిస్తాం, ఒక ఆశాభావంలోకి ప్రవేశిస్తాం. భారతదేశ ఎన్నికల రాజకీయాలు కూడా చాలా అవసరమైన ఒక విరామ దశలోకి ప్రవేశించాయి. నిరంతర రాజకీయ విన్యాసాలు; హిమాలయోన్నత శిఖరాల పైన, హిందూ మహాసముద్ర అగాధాలలోను ప్రతిధ్వనించిన గారడీ మాటలతో ఊగిపోయిన భారతీయ సమాజానికి అటువంటి విశ్రాంతి లభించింది. నరేంద్ర మోదీ 2014లో ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించిన నాటి నుంచీ వార్తా జగత్తు అవిరామంగా, అసాధారణంగా ప్రజలను ఆవహించడం ప్రారంభమయింది. నోట్ల రద్దు నుంచి లాక్‌డౌన్‌ల దాకా, పార్లమెంటరీ సస్పెన్షన్ల నుంచి రైతుల నిరసనల వరకు ఊపిరి పీల్చుకునే వ్యవధే ప్రజలకు లేకుండా పోయింది. ఎట్టకేలకు ఓటర్ మహరాజు Pause బటన్ నొక్కాడు. ఇది పూర్ణ విరామం కాదు, తాత్కాలిక విరామం మాత్రమే.

ఈ కారణంగానే 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రజా తీర్పును అనుచితంగా అర్థం చేసుకోవడం పెద్ద పొరపాటు అవుతుంది. ప్రధానమంత్రి ఇప్పటికీ తిరుగులేని, నిరాక్షేపణీయ నాయకుడు అని నరేంద్ర మోదీ అభిమానులు నొక్కి చెబుతున్నారు. గత మూడు దశాబ్దాలలో ఏ సార్వత్రిక ఎన్నికలలోనైనా కాంగ్రెస్‌కు లభించిన సీట్ల కంటే ఈ సారి బీజేపీకి దక్కిన 240 సీట్లు చాలా అధికమని వారు గంభీరంగా ఉద్ఘాటిస్తున్నారు. సరే, మోదీ వ్యతిరేకులు ఇది అధికారంలో ఉన్న ప్రభుత్వానికి, దాని అధినేతకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పు అని ఘంటాపథంగా ఘోషిస్తున్నారు. 400కు పైగా సీట్లు గెలుచుకుంటామని పదే పదే ప్రకటించిన పార్టీ అంతిమంగా కనీస మెజారిటీ (272 సీట్లు)ని అయినా పొందలేకపోవడాన్ని వారు అపహసిస్తున్నారు. సత్యమేమిటి? అది సహజంగా ఈ రెండు వాదనల మధ్య ఉన్నది.

భారతీయ జనతా పార్టీ రాజకీయ అశ్వమేధయాగం చేస్తోంది. అధికార పీఠాలను కైవసం చేసుకుంటూ ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి జయప్రదంగా పురోగమించడమే ఆ రాజకీయ యజ్ఞం. సందేహం లేదు, ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో అది నిలిచిపోయింది. సగటు పౌరులు అసామాన్య ఓటర్లుగా ప్రభవించిన పర్యవసానమది. మూడు అతి పెద్ద రాష్ట్రాల– ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్– లలో భారతీయ జనతా పార్టీ ఓట్లు, సీట్ల సాధనలో ద్వితీయ స్థానానికి జారిపోయింది. ఎక్కడ తప్పటడుగు వేశామన్న విచికిత్స, ఆరోపణ ప్రత్యారోపణల మధ్య ఒక వాస్తవం రాజకీయులకు, సామాన్య ప్రజలకు అర్థమయింది: అత్యంత శక్తిమంతమైన పార్టీ ఎన్నికల చాణక్యాలు ఇంకెంత మాత్రం అజేయమైనవి, కార్యసాధకమైనవి కాదు. ప్రధాన మంత్రి ప్రభావ తేజం సైతం మసకబారింది. నాయకత్వం విషయమై ఉత్తరప్రదేశ్‌లో నరేంద్ర మోదీ కంటే రాహుల్ గాంధీ వైపే ప్రజల మొగ్గు స్పష్టంగా ఉందని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ నిర్వహించిన ఒక పోస్ట్-పోల్ సర్వేలో వెల్లడయింది. గత దశాబ్ద కాలంలో ఒక ప్రధాన హిందీ భాషా రాష్ట్రంలో మోదీకంటే రాహుల్‌కు ఆధిక్యత లభించడం ఇదే మొదటిసారి.

అయినప్పటికీ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా సీట్ల సంఖ్యలోను, ఓట్ల వాటాలోను బీజేపీ కంటే వెనుకబడే ఉన్నది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రత్యక్ష పోటీల్లో కాంగ్రెస్, బీజేపీల మధ్య సీట్ల వ్యత్యాసం ఐదు సంవత్సరాల క్రితం వలే భారీగా లేనప్పటికీ ఆ తేడా బీజేపీకి అనుకూలంగా ఉన్నది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో ప్రత్యక్ష పోటీ జరిగిన నియోజకవర్గాలలో బీజేపీకి 157 దక్కగా కాంగ్రెస్ కేవలం 51 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. కాంగ్రెస్ నిజంగా ఆధిక్యత సాధించిన రాష్ట్రం కేరళ ఒక్కటే. అయితే ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి వామపక్షమే కానీ బీజేపీ కాకపోవడం గమనార్హం. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లలో సీట్ల, ఓట్ల సాధనలో కాంగ్రెస్ ముందంజ వేయలేకపోయింది.

> భారతీయ ఓటరు ఇప్పుడు ఘర్షణ కంటే ఏకాభిప్రాయాన్ని అహంకృత వ్యవహారశైలి కంటే మనసా వాచా కర్మణా మర్యాదపూర్వక ప్రవర్తనా రీతిని, ఏకరూపత కంటే వైవిధ్యాన్ని గట్టిగా కోరుకుంటున్నాడు. అతడి అభిలాష సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో ప్రతిబింబించింది. ఈ అసాధారణ ప్రజా తీర్పును గౌరవించి, దానికి అనుగుణంగా వ్యవహరించే వివేకాన్ని పాలక, ప్రతిపక్షాలు విధిగా అలవరచుకోవాలి. వాటికి అటువంటి విజ్ఞత కొరవడిన పక్షంలో ఇప్పటికే సహనం కోల్పోతున్న ఓటరు మళ్లీ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తాడు.

సీట్ల, ఓట్ల అంకగణితం 2024 ఎన్నికల కథలో ఒక భాగాన్ని మాత్రమే చెప్పింది. నరేంద్ర మోదీ జనసమ్మోహన శక్తి, 'మోదీకీ గ్యారంటీ'లో ప్రజల అచంచల విశ్వాసమే ఈ సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి అనుకూలంగా నిర్ణయాత్మక తీర్పును సాధిస్తాయని అధికార పార్టీ శ్రేణులు భావించాయి. నిశ్చింతగా ఉన్నాయి. సరిగ్గా ఇక్కడే బీజేపీ ప్రచార సారథులు పొరపడ్డారు. భారత్ లాంటి సువిశాల, వైవిధ్యభరిత దేశంలో ఏ వ్యక్తీ దాని ప్రజల కంటే గొప్పవాడు కాదనే సత్యాన్ని వారు విస్మరించారు. బీజేపీ అభ్యర్థులలో 100మందికి పైగా ఇతర పార్టీల నుంచి 'దిగుమతి' అయినవారే. 132 మంది సిట్టింగ్ ఎంపీలకు మళ్లీ టిక్కెట్ ఇవ్వడానికి పార్టీ అధిష్ఠానం నిరాకరించింది. ఈ చర్యలు సూచిస్తున్నదేమిటి? 'ఒకే నాయకుడు, ఒకే దేశం' చుట్టూ పరిభ్రమించిన రాజకీయ వ్యూహంపై మితిమీరిన విశ్వాసాన్ని ఉంచడమే కాదా? తత్కారణంగానే మోదీని చూసే ప్రజలు తమకు ఓటు వేస్తారని బీజేపీ నాయకత్వం విశ్వసించింది. మోదీ మినహా ఇతర అభ్యర్థులు అందరూ రాజకీయ వామనమూర్తులేనని, పార్టీ విజయానికి వారు చేసే దోహదం ఉపేక్షణీయమేనని భావించారు.

మోదీ కేంద్రిత రాజకీయ వ్యవస్థ ఇప్పుడు నిస్సత్తువలో పడిపోయింది. బీజేపీ 'బ్యాంకర్ రాష్ట్రాలు' గుజరాత్, మధ్యప్రదేశ్ మినహా దేశంలోని వివిధ ప్రాంతాల ఓటర్లు మోదీ 'మహిమాన్విత వ్యక్తిత్వం' ప్రభావానికి లోను కావడానికి నిరాకరించారు. తమకు సహాయకారులుగా ఉండే నాయకులను ఎన్నుకోవడానికే వారు ప్రాధాన్యమిచ్చారు. మూడు కీలక నియోజకవర్గాల ఫలితాలే ఇందుకు నిదర్శనం. అవి: వారణాసి, ఫైజాబాద్, బన్స్వారా. వారణాసి ప్రధానమంత్రి నియోజకవర్గం. ఈ సారి మోదీ రికార్డు స్థాయి మెజారిటీతో గెలుపొందనున్నారని ఊదరగొట్టారు. అయితే మోదీకి అంతిమంగా లభించిన మెజారిటీ గత ఎన్నికలలో కంటే 3.2 లక్షల మేరకు తక్కువగా ఉన్నది. అయోధ్య ఉన్న నియోజకవర్గం ఫైజాబాద్. గత జనవరిలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని కాలం, చరిత్రపై హిందూత్వ శాశ్వత సంతకంగా ప్రపంచానికి చాటారు. చివరకు అక్కడ జరిగిందేమిటి? కొత్తగా రాజకీయలలోకి వచ్చిన ఒక దళిత నాయకుడు వరుసగా రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికైన ఒక రాజకీయ ఘనాపాఠీని ఓడించాడు. రాజస్థాన్‌లోని బన్స్వారాలో ప్రధాని మోదీ ఉద్దేశపూర్వకంగా మతతత్వ భావోద్వేగాలకు ఊపిరి లూదారు. ముస్లింలకు ఇచ్చేందుకై కాంగ్రెస్ వారు హిందూ స్త్రీల మంగళసూత్రాలను సైతం లాక్కుంటారని మోదీ భయపెట్టారు. అయితే ఆ నియోజకవర్గంలో భారత్ ఆదివాసీ పార్టీకి చెందిన ఒక యువ గిరిజన నాయకుడు జయపతాక నెగురవేశాడు.

నరేంద్ర మోదీ రాచరిక తరహా నిరంకుశత్వానికి ఓటర్లు తీవ్ర విఘాతం కలిగించారు. పదవిని నిలబెట్టుకుని అధికారంలో కొనసాగుతున్నప్పటికీ ఆయన రాజకీయ, నైతిక పలుకుబడి క్షీణించింది, సందేహం లేదు. అయితే మోదీ శకం ముగియలేదు, అలసిన, విసిగి వేసారిన ఓటర్ మహాశయుడు బలవంతంగా దానికి విరామం కల్పించాడు. కేంద్రంలో ప్రస్తుతం అధికారానికి వచ్చింది సంకీర్ణ ప్రభుత్వమే అయినా ఇదివరకటి సంకీర్ణ ప్రభుత్వాలలో వలే కాకుండా ఈ సర్కార్ సారథ్య స్థానంలో ఒక శక్తిమంతమైన పార్టీ ఉన్నది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ 63 సీట్లను కోల్పోయినప్పటికీ వాస్తవంగా గతంలో కంటే 69 లక్షల ఓట్లను అధికంగా గెలుచుకున్నది. నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకునే తీరు తెన్నుల స్థానంలో మరింతగా సర్దుకునిపోయే రీతిలో పాలనా బాధ్యతలు నిర్వహించే పద్ధతి అమలులోకి రావచ్చుగానీ ఆ మార్పు ఎంతకాలం అనేది చర్చించదగిన అంశం.

సరే, తరువాత ఏమి జరగబోతోంది? ఇది బీజేపీ మిత్రపక్షాల చేతుల్లో లేదు. సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామ్య పక్షాలలో చాలా వాటికి పరిమిత ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉన్నాయి. కనుక అవి అధికార కూటమిలో తప్పక కొనసాగుతాయి. చెప్పవచ్చిందేమిటంటే ప్రజాతీర్పు పట్ల అపరిమితంగా ఆనందపడుతున్న ప్రతిపక్షాలే తదుపరి నిర్ణయాత్మక అంకానికి తెరలేపాలి. పది సంవత్సరాలుగా మోదీ సర్కార్ చేతుల్లో అవి చావుదెబ్బలు తింటూ వస్తున్నాయి. వివిధ పార్టీలు చీలిపోయాయి. పలు పార్టీల నాయకులను దర్యాప్తు సంస్థలు అదే పనిగా వెంటాడాయి. వారిలో కొంత మందిని జైలుకు కూడా పంపించారు. పార్లమెంటును కేవలం ఒక నోటీస్‌బోర్డ్‌గా కుదించివేశారు. ఎన్నో అవాంతరాలు, అనేక అవస్థలను అధిగమించి ప్రతిపక్షాలు ఎట్టకేలకు ప్రజల మద్దతును కూడగట్టుకున్నాయి, పార్లమెంటులో సంఖ్యా బలాన్ని పెంచుకున్నాయి. జాతీయ భద్రత, ప్రజా శ్రేయస్సుకు సంబంధించిన విషయాలలో తమ వాణిని నిర్ణాయకంగా వినిపించగల సామర్థ్యాన్ని సాధించుకున్నాయి. వివేకశీలురు అయిన ఓటర్లు వినయం, వినమ్రతతో పాలన చేసే ప్రధానమంత్రిని మాత్రమే కోరుకోలేదు; ఒక పటిష్ఠ ప్రతిపక్షం కోసం కూడా వారు ఆరాటపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత శ్రద్ధాసక్తులు, సమన్వయంతో నిర్మాణాత్మకంగా కృషి చేసే ప్రతిపక్షం పార్లమెంటులో ఉండాలని వారు సంకల్పించారు. సార్వత్రిక ఎన్నికలలో ఓటింగ్ తీరు తెన్నులు ఆ సంకల్పానికి అద్దం పట్టలేదా?

మోదీ శకానికి విరామ దశ ఎంతకాలం కొనసాగుతుందన్న విషయమై స్పష్టత లేదు. తదుపరి విడత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అది ఆధారపడి ఉంటుంది. అయితే భారతీయ ఓటరు ఇప్పుడు ఘర్షణ కంటే ఏకాభిప్రాయాన్ని, అహంకృత వ్యవహారశైలి కంటే మనసా వాచా కర్మణా మర్యాదపూర్వక ప్రవర్తనా రీతిని, ఏకరూపత కంటే వైవిధ్యాన్ని గట్టిగా కోరుకుంటున్నాడు. అతడి అభిలాష ఎన్నికల ఫలితాలలో ప్రతిబింబించింది. ఈ అసాధారణ ప్రజా తీర్పును గౌరవించి, దానికి అనుగుణంగా వ్యవహరించే వివేకాన్ని పాలక, ప్రతిపక్షాలు విధిగా అలవరచుకోవాలి. వాటికి అటువంటి విజ్ఞత కొరవడిన పక్షంలో ఇప్పటికే సహనం కోల్పోతున్న ఓటరు మళ్లీ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తాడు. అనిశ్చితంగా ఉన్న భారత రాజకీయ చిత్రం రెండో సగ భాగం ఇంకా మొదలు కాలేదు మరి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సర్కార్ బడి విలువ పెరగాలి!

తాను, తనతో పాటు చాలామంది ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివామని.. సర్కార్ బడి విలువ నాకు తెలుసని.. వాటి అభ్యున్నతి కోసం కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందించదగ్గ అంశం. ముఖ్యమంత్రి స్పందన ఓ వైపు, బడి బాటలో తిరుగుతున్నప్పుడు ప్రజల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలు ఇంకొక వైపు విద్యా వ్యవస్థను సవాల్ చేస్తున్నట్లు కనిపిస్తున్నది.

నూతన ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో కల్పించిన ప్రయాణాన్ని ప్రభుత్వ పాఠశాలలతో పోలుస్తూ.. ఉచితంగా పాసులు ఇస్తే బస్సులెక్కే జనం, ఉచితంగా చదువు చెప్పే పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్చకపోవడానికి బస్సు డ్రైవర్ మీద ఉన్న నమ్మకం టీచర్ల మీద లేకేనా? అన్న ఓ వాట్సాప్ మెసేజ్ ఇటీవల విపరీతంగా వైరల్ అవుతోంది. ఇది ఒక రకంగా ప్రభుత్వ విద్యను, సర్కార్ వైఖరిని, టీచర్ల స్థితిగతుల్ని అవహేళన చేస్తున్నట్లుంది. ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఒక చిరు అవకాశాన్ని పాఠశాల విద్యా వ్యవస్థతో పోలుస్తూ అటు కార్లల్లో, ఏసీ బస్సుల్లో, ప్రైవేటు బస్సుల్లో తిరిగే జనాలను, అలాంటి ఒక ప్రైవేటు వ్యవస్థను విస్మరించి, ఇది కేవలం టీచర్ల మీద నమ్మకం లేని అంశంగా ప్రచారంలో పెట్టడం దుర్మార్గం.

కొఠారి కమిషన్ తన నివేదికలో చెప్పినట్లు.. పేదోడికైనా, పెద్దోడి బిడ్డకైనా ఒకే రకం బడి, ఒకే రకం చదువు అందాలన్న 'కామన్ స్కూల్' కల నెరవేరకపోగా... ప్రజాస్వామిక సంస్కృతి విలువ మృగ్యమై డబ్బున్న వాళ్ళకి ఓ రకమైన విద్య, డబ్బు లేని పేదలకు ప్రభుత్వ విద్య కొనసాగే విధానంలో మార్పు రాకుండా ప్రభుత్వ విద్యా రంగాన్ని సంస్కరించలేం.

రేవంత్ రెడ్డి లాంటివాళ్ళు చదివిన ప్రభుత్వ పాఠశాలల్లో ఇవ్వాళ ఏ రాజకీయ నాయకుని పిల్లలు గాని, ఏ ఐఏఎస్ అధికారి పిల్లలు గాని, కనీసం టీచర్ల పిల్లలు కానీ చదవలేని దుస్థితి ఎందుకు కొనసాగుతున్నదో ఆలోచించాలి. విద్య ప్రైవేటీకరణ అయి, చదువు అంటే ఐఐటీలు, నీట్‌లు, డాలర్ కొలువులుగా మారిపోయాయి. ఆంగ్ల మాధ్యమంలోనే చదివితే కొలువులొస్తాయని భ్రమలు కొనసాగుతున్నాయి.

ముఖ్యమంత్రి ప్రసంగించిన వేదిక మీదే వరంగల్ విద్యార్థిని భువనకృతి అభిలషించిన అంశాలు ఉచిత రవాణా, మంచి కోచింగ్, మధ్యాహ్న భోజనం, టాయిలెట్స్, భద్రత, బట్టీ విధానం లేని చదువులు, సర్కార్ బడుల్లో సౌకర్యాలు, సబ్జెక్టు కొరత లేని టీచర్లు వంటి వాటి గురించి ఆలోచించాలి. ఇవిగాక ప్రభుత్వం ఇచ్చే ఉచిత పుస్తకాలు తప్ప మరో పుస్తకం చదవలేని గ్రంథాలయాలు, సైన్స్ ల్యాబులు, లాంగ్వేజ్ క్లబ్బులు, విద్యార్థుల సమగ్ర వికాసానికి కళలు, కనీసం ఓ పీరియడ్ ఆడుకునే అవకాశం వంటివి కూడా సర్కార్ బడుల్లో లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, విహారయాత్రల్లో సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించే టూర్స్ కల్పన చేయాలి. ఏళ్లకేళ్ల పాత పాఠ్యాంశాలతో పిల్లల మెదళ్లను నిస్తేజం చేయని నూతన కరికులంను రూపొందించుకోవడం, కనీసం పాఠశాల విద్య వరకైనా మాతృభాషలోనే చదువుకునే అవకాశం వల్ల ఇతర భాషల్ని నేర్చుకొని వివేకాన్ని పెంపొందించుకునే విధానాన్ని అమలు చేయాలి.



> మెరుగైన గ్రేడ్లు సాధించిన పిల్లలు కార్పొరేట్ స్కూళ్లలో చేరితే, పరోక్షంగా వాటికి నిధులు ఇచ్చి ప్రైవేటు విద్యను ప్రోత్సహించడం ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే. నేడు కార్పొరేట్ హాస్పిటళ్లకు రీయింబర్స్ పేరిట కోట్లాది రూపాయలు చెల్లిస్తూ, ప్రభుత్వ వైద్యశాలలను నిర్వీర్యం చేసినట్లుగా... ప్రభుత్వ విద్యారంగాన్ని కూడా నిర్వీర్యం చేస్తున్నారు.

ఒకవైపు కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) పేరిట తీసుకొస్తున్న మార్పులు తెలంగాణకు దోహదపడకపోగా, విద్యావ్యవస్థను ప్రాథమిక దశ నుంచి ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ వైపు నెట్టే స్థితి కొనసాగుతున్నది. అందువల్ల ఎన్ఈపీలో చేరకుండా తెలంగాణ భౌగోళిక, సాంస్కృతిక, రాజకీయ నేపథ్యానికి తగ్గట్టుగా, రాష్ట్ర అభ్యున్నతికి దోహదపడే విధానాలతో కూడిన శాస్త్రీయ విద్యావిధానాన్ని కొనసాగించాలి.

వీటన్నిటికంటే ముఖ్యంగా అసలు పాఠశాల విద్యా వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశంగా పరీక్ష విధానం కొనసాగుతున్నది. ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్‌లో చదివే ఇంగ్లీష్ మీడియం పిల్లలకి, ఏ వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద పిల్లలకి ఒకే పుస్తకం–ఒకే పరీక్ష విధానంతో ప్రతి ఏటా కొంతమంది పిల్లలకి గ్రేడులు తగిలించి, మిగిలిన వారిని ఎందుకు పనికిరాని, చదువురాని తరాలుగా సమాజంలోకి వదిలేస్తున్న ఈ లోపభూయిష్ఠ విద్యావ్యవస్థను సమీక్షించి, పరీక్ష విధానాన్ని మార్చాలి.

మెరుగైన గ్రేడ్లు సాధించిన పిల్లలు కార్పొరేట్ స్కూళ్లలో చేరితే, పరోక్షంగా వాటికి నిధులు ఇచ్చి ప్రైవేటు విద్యను ప్రోత్సహించడం ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే. నేడు కార్పొరేట్ హాస్పిటళ్లకు రీయింబర్స్ పేరిట కోట్లాది రూపాయలు చెల్లిస్తూ, ప్రభుత్వ వైద్యశాలలను నిర్వీర్యం చేసినట్లుగా... ప్రభుత్వ విద్యారంగాన్ని కూడా నిర్వీర్యం చేస్తున్నారు. దీనికి భిన్నంగా మెరుగైన విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులు కూడా ప్రభుత్వ విద్యారంగంలోనే కొనసాగేటట్లు చూడాలి. మెరుగైన విద్యార్థుల కోసం రాష్ట్రంలో ఒక బాసర ట్రిపుల్ ఐటీ తప్ప మరొకటి లేకపోవడం విషాదకరం. ఇటువంటివి జిల్లాకు ఒకటి కొనసాగించాలి. ప్రభుత్వ కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోని ఖాళీలన్నిటినీ భర్తీ చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి.

• ప్రభాకర్ కస్తూరి
కన్వీనర్, తెలంగాణ టీచర్స్ ఫోరం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

రాజ్యాంగానికి వెన్నెముక 'పీఠిక'

భారత రాజ్యాంగానికి ప్రాణం, వెన్నెముక, కళ్ళు, మెదడు అన్నీ దాని పీఠికే. భారతదేశాన్ని 'సర్వసత్తాక సామ్యవాద, మతసామరస్య ప్రజాస్వామిక రిపబ్లిక్' అని మన రాజ్యాంగ పీఠిక పేర్కొంటోంది. 1949 నవంబరు 26న ఆమోదించిన రాజ్యాంగ పీఠికలో 'సర్వసత్తాక ప్రజాస్వామిక రిపబ్లిక్' అని మాత్రమే ఉందన్నది వాస్తవం. 'సామ్యవాద, మతసామరస్య' స్వభావాలు మొదట్లో లేవు; ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలంలో 1976 డిసెంబరు 18న 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 'సామ్యవాద, మతసామరస్య' స్వభావాన్ని అడ్డంగా చేర్చారనే వాదనను బీజేపీ చాలా కాలంగా చేస్తోంది. తాము ఇక్కడవున్నది రాజ్యాంగాన్ని మార్చడానికే అని చెప్పిన నాయకులూ ఆ పార్టీలో కొందరున్నారు. దీనికి విరుద్ధమైన వాదన కూడా బలంగానే వుంది. ప్రజాస్వామ్యానికి విస్తృత అర్థమే 'సామ్యవాద, మతసామరస్య' భావనలని గట్టిగా వాదిస్తున్నవారూ ఉన్నారు. రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలు 'తమకుతాము' ఇచ్చుకున్న హామీల్లో, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఉన్నాయి. వీటిల్లోనూ అంతర్లీనంగా 'సామ్యవాద, మతసామరస్య' భావనలున్నాయి.



'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలు' భారత సాంప్రదాయం కాదనీ వాటిని బయటి దేశాల నుంచి అరువు తెచ్చి రాజ్యాంగంలో బలవంతంగా జొప్పించారని అప్పట్లోనే ఆరెస్సెస్ వంటి సంస్థలు గట్టిగానే విమర్శించాయి. వాటికన్నా మనుస్మృతియే మన సమాజానికి సరిగ్గా సరిపోతుందని బలంగా వాదించాయి.

'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలు' ఎక్కడి నుండి వచ్చాయి? వాటిని ఎవరు తెచ్చారూ? అనే విషయంలోనూ భిన్నాభిప్రాయాలున్నాయి. 1789 నాటి ఫ్రెంచ్ విప్లవంలో ఈ నినాదాలు మార్మోగాయి. అయితే తాను బుద్ధుని బోధనల నుంచి ఈ నాలుగు ఆదర్శాలను స్వీకరించినట్టు గొప్ప దార్శనికులు, భారత రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షులు బి.ఆర్. అంబేడ్కర్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఫ్రెంచ్ విప్లవ నినాదాలను జవహర్‌లాల్ నెహ్రూ సైతం విపరీతంగా అభిమానించేవారు.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక ఇండియాకు స్వాతంత్ర్యం ఇచ్చేందుకు బ్రిటీష్ ప్రభుత్వం ఆమోదించింది. బ్రిటీష్ ఇండియాను స్వతంత్ర ఇండియాగా మార్చే ప్రక్రియను సజావుగా సాగించడానికి 1946 సెప్టెంబరు 2న భారత తాత్కాలిక ప్రభుత్వం (Provisional Government of India) ఏర్పడింది. అదే రాజ్యాంగ సభగానూ పనిచేసింది. భారత తాత్కాలిక ప్రభుత్వానికి అధినేతగా ఉండిన జవహర్‌లాల్ నెహ్రూ 1946 డిసెంబరు 13న రాజ్యాంగ లక్ష్యాల తీర్మానాన్ని (Objectives Resolution) ప్రవేశపెట్టారు. దాన్ని 1947 జనవరి 22న రాజ్యాంగ సభ ఆమోదించింది. ఈ తీర్మానంలోనే న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలు అనే ఆదర్శాలు చాలా వివరంగా వున్నాయి.

పౌరసత్వ సవరణ చట్టానికి (సిఏఏ) వ్యతిరేకంగా 2019 చివర్లో ఢిల్లీ శివార్లలోని షాహీన్‌బాగ్‌లో ఉద్యమం ఆరంభమయినప్పుడు భారత రాజ్యాంగమే ఆధునిక 'మతగ్రంథం'గా మారిపోయింది. ఆందోళనకారులైన ముస్లిం మహిళలు ఒక చేత్తో మువ్వన్నెల జాతీయ జెండాను పట్టుకుని మరో చేతిలో భారత రాజ్యాంగాన్ని గుండెలకు హత్తుకుని, ఒళ్ళో గాంధీజీ, అంబేడ్కర్ల ఫొటోలు పెట్టుకుని 'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం' అంటూ నినదించారు.

'భారత రాజ్యాంగ పీఠిక' చారిత్రక ప్రాధాన్యాన్నీ, ప్రాసంగికతను గుర్తించి ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ఈ పుస్తకాన్ని రాశారు. రాజ్యాంగానికి సంబంధించిన అనేక పార్శ్వాలను 18 పర్వాల్లో ఇందులో ఆవిష్కరించారు. భారత రాజ్యాంగం మీద రాయడానికి సరైన ఛాయిస్ మాడభూషి శ్రీధర్ అయితే, ఈ పుస్తకాన్ని ప్రచురించడానికి విజయవాడ 'శ్రీశ్రీ' విశ్వేశ్వరరావు కూడా అంతే సరైన ఛాయిస్. విశ్వేశ్వరరావు ప్రచురణలు సోషల్ బారోమీటర్స్.

'భారత రాజ్యాంగ పీఠిక' పుస్తకాన్ని జూన్ 15 శనివారం సాయంత్రం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరిస్తారు. కె. రామచంద్రమూర్తి సభాధ్యక్షులు, ఎమెస్కో విజయ కుమార్ ఆత్మీయ అతిథి.

– డానీ

'బస్ కా పయ్యా' ఆరాటం! స్వరాష్ట్రం కోసం పోరాటం!

తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘ కాలంగా జరిగిన ఉద్యమంలో ప్రతి వర్గం తమదైన పాత్ర పోషించింది. మరీ ముఖ్యంగా తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆర్టీసీ పోషించిన ముఖ్య భూమిక చిరస్మరణీయం. నాడు సంస్థ ఉద్యోగుల ఉద్యమ స్ఫూర్తి, అంకితభావం, కృషి, చిత్తశుద్ధి, త్యాగం, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకంగా నిలిచాయి. 'బస్ కా పయ్యా నహీ చలేగా!' అన్న ఒకే ఒక్క నినాదంతో ఆర్టీసీ చేపట్టిన సమ్మె ఉద్యమానికి ఊపిరిలూదడంతో పాటు ప్రధాన మైలురాయిగా నిలిచింది.

ప్రత్యేక రాష్ట్ర పోరాట మలిదశ 2000 దశకంలో ప్రారంభమైన రోజుల్లో, ఆర్టీసీ సిబ్బంది ఎవరికి వారు వ్యక్తిగతంగా పాల్గొన్నారు. 2010 సంవత్సరంలో, ములాఖత్ అనే వినూత్న కార్యక్రమంతో అప్పటి రాజకీయ నాయకులకు పువ్వులు అందించి తమ ఉద్యమ భావజాలాన్ని వ్యక్తపరచడంతో ఉద్యమం జీవం పోసుకుంది. ఇదే స్ఫూర్తితో 'ఆర్టీసీ ఉద్యమ శంఖారావం' అనే నినాదంతో ఉద్యోగులు కదనానికి సిద్ధమయ్యారు. డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్‌లు, మెకానిక్‌లు, ఆర్టిజాన్లు, సూపర్‌వైజర్లు, అధికారులు, మొదలైన ఆర్టీసీ ఉద్యోగులు డిపో, రీజియన్, రాష్ట్ర స్థాయిలో ఉద్యమ బృందాలుగా ఏర్పడి, మలిదశ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులు తమ డ్యూటీలను నిర్వహిస్తూనే ప్రజా రవాణాకు అంతరాయం కలుగకుండా 2011, 2012లలో వివిధ దశల్లో నిరసనల్ని చేపట్టారు. బస్సు డ్యూటీలకే ప్రాధాన్యతనిస్తూ తమ విరామ సమయంలో సమావేశాలు, చర్చలు నిర్వహించుకుని ఉద్యమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. 2011 మార్చి 10న నిర్వహించిన మిలీనియం మార్చ్‌కు అప్పటి ప్రభుత్వం అనుమతి ఇవ్వనప్పటికీ, ఆర్టీసీ ఉద్యోగులంతా ఒక బృందంగా ఏర్పడి పెద్ద సంఖ్యలో పాల్గొని కదం తొక్కారు. సెప్టెంబరు 30, 2012లో జరిగిన సాగర హారంలో ఆర్టీసీ ఉద్యోగులు వేలాది సంఖ్యలో పాల్గొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అంతకు ముందు సన్నాహక సదస్సులు, ఇంటింటికి కరపత్రాల పంపిణీ, పోస్టర్ల ప్రదర్శన, ర్యాలీలు నిర్వహించారు.

2012 నవంబరు 1న జరిగిన తెలంగాణ విద్రోహ దినంలో ఆర్టీసీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి డిపోల ముందు విస్తృత ప్రదర్శనలు చేపట్టారు. నవంబరు 29న ఇందిరాపార్కు వద్ద జరిగిన దీక్షా దివస్‌లో వేలాదిమంది ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొని సంఘీభావాన్ని తెలియజేశారు. అసెంబ్లీ ముట్టడి, సద్భావన ర్యాలీ, కలం కవాతు, సకల జనుల భేరీ, రైల్ రోకో, ధూం ధాం మొదలైన కార్యక్రమాల్లోనూ ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించారు. సంసద్ యాత్రలో పాల్గొని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అంతకుముందు బస్సు చైతన్య యాత్ర తెలంగాణలోని అన్ని జిల్లాలలో నిర్వహించి డిపోలలోని ఉద్యోగులను సమాయత్తపరిచారు.

అంతకు ముందు, 2011 సెప్టెంబరు 13న సకల జనుల సమ్మె ప్రారంభమైనప్పటికీ, 19 సెప్టెంబరు 2011న ఆర్టీసీ ఉద్యోగులు 'మేము సైతం!' అంటూ ఉద్యమంలో పాలుపంచుకోవడంతోటే సమ్మె ప్రభావం జన జీవనంపై తీవ్రంగా పడింది. ఇది దేశ చరిత్రలోనే అతి పెద్ద సమ్మెలలో ఒకటి. ఫలితంగా, తెలంగాణలో ఆనాడు ఉన్న 89 డిపోలలోని 10,137 బస్సులన్నీ డిపోలకే పరిమితం అయ్యాయి. ఎవరి ఒత్తిడితోనో కాకుండా స్వయంగా తెలంగాణకు చెందిన 55,713 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొని అప్పటికే ప్రారంభమైన సకల జనుల సమ్మె సెగ తీవ్రతరం చేశారు.

> 2011 సెప్టెంబరు 13న సకల జనుల సమ్మె ప్రారంభమైనప్పటికీ, సెప్టెంబరు 19న ఆర్టీసీ ఉద్యోగులు 'మేము సైతం!' అంటూ ఉద్యమంలో పాలుపంచుకోవడంతోటే సమ్మె ప్రభావం జన జీవనంపై తీవ్రంగా పడింది. ఇది దేశ చరిత్రలోనే అతి పెద్ద సమ్మెలలో ఒకటి. సంస్థ రోజుకు రూ.7.65కోట్ల చొప్పున మొత్తం రూ.214.20 కోట్ల ఆదాయాన్ని శాశ్వతంగా కోల్పోయింది. అయితే, సకల జనుల సమ్మె విజయవంతం కావటంలో ఆర్టీసీ తనదైన చెరగని ముద్రను వేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావానికి బాట వేసింది.



తెలంగాణలో రోజూ తిరగాల్సిన 33.59లక్షల కిలోమీటర్లకు గానూ ఒక్క కిలోమీటర్ కూడా ఏ ఒక్క బస్సూ తిరగలేదు. నాడు, రోజుకు రూ.7.65కోట్ల ఆదాయాన్ని సంస్థ కోల్పోయింది. సకల జనుల సమ్మె ఆర్టీసీలో 28 రోజులు కొనసాగింది. ఈ కాలంలో సంస్థ మొత్తంగా, రూ.214.20కోట్లు నష్టపోయింది. ఉద్యమం వివిధ దశలలో తెలంగాణ ప్రాంతంలోని జిల్లాల్లో బస్సులు, ఆస్తుల ధ్వంసం వల్ల మరో రూ.100 కోట్లు నష్టపోయింది. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే బస్సులను తెలంగాణ ప్రాంతంలో ఎక్కడా తిరగనివ్వలేదు. నాడు తెలంగాణలో ఉన్న 360 బస్టాండులు, 2000 బస్ షెల్టర్స్ బోసిపోయాయి. రాష్ట్రం మొత్తం స్తంభించింది. ఈ ఉద్యమం చరిత్ర మహత్తర ఘట్టాలలో ఒకటిగా నిలిచిపోయింది.

ఇతర శాఖలకు, ఆర్టీసీకి తేడాను గమనించినట్లయితే, పై మొత్తం సంస్థ శాశ్వతంగా కోల్పోయింది. ఆదాయాన్ని సమకూర్చుకునే రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ లాంటి ఇతర శాఖలు తదుపరి ఆ ఆదాయాన్ని రాబట్టుకోగల్గుతాయి. కానీ, 'పెరిషబుల్ ప్రొడక్ట్' ఉన్న ఆర్టీసీ, ఆ ఆదాయాన్ని శాశ్వతంగా కోల్పోయింది. అయితే, సకల జనుల సమ్మె విజయవంతం కావటంలో ఆర్టీసీ తనదైన చెరగని ముద్రను వేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావానికి బాట వేసింది.

ఆనాడే సంస్థ ఉద్యోగులు, రాబోయే తెలంగాణలో ఆర్టీసీ అస్తిత్వాన్ని గుర్తించి, ఈ ప్రాంతంలో తిరుగుతున్న ఎ.పి.ఎస్. ఆర్టీసీ బస్సులపై, డిపో, బస్టాండు పేర్ల ముందు 'టి.జి.ఎస్.ఆర్టీసీ' అని రాయడంతో పాటు (జె.బి.ఎస్) జూబ్లీబస్ స్టేషన్‌ను జయశంకర్ బస్ స్టేషన్‌గా మార్చి తమ ఆత్మాభిమానాన్ని చాటుకున్నారు. ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల ప్రత్యేకత ఏంటంటే, నిరసలు కొనసాగిస్తూనే ఏనాడు కూడా ఆర్టీసీ బస్సులకు, సంస్థ ఆస్తులకు నష్టం, విఘాతం కలిగించలేదు. అంతేకాకుండా అటువంటి చర్యలకు పాల్పడే వారిని సైతం నిలువరించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ప్రత్యేకతను చరిత్రలో నిలిపిన వివిధ కార్యక్రమాలు రాష్ట్ర సాధనలో చారిత్రక ఘట్టాలుగా నిలిచిపోయాయి; ఫలితమే – మన నవ తెలంగాణ!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత గత పదేళ్ళుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజల ఆదరణ, రాష్ట్ర ప్రభుత్వ అండదండలు, మహాలక్ష్మి లాంటి ఎన్నో వినూత్న పథకాలు, ఉద్యోగుల నిబద్ధతలతో మెరుగైన, నాణ్యమైన సేవలను అందిస్తూ నష్టాల ఊబినుంచి లాభాల విజయ బాట వైపు పయనిస్తూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, దేశంలో నేడు అగ్రగామి ప్రజా రవాణా సంస్థగా రూపొందటంలో అంతర్గత శక్తి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తియే!

■ వి.సి. సజ్జనర్, ఐ.పి.ఎస్.
మేనేజింగ్ డైరెక్టర్, టి.జి.ఎస్.ఆర్టీసీ



కెమెరాలున్నాయ్.. దొంగలే

దొరకరు!

- ఆధారాలు సేకరించినా పట్టుకోలేకపోతున్న పోలీసులు
- జాడలేకుండా పోతున్న దొంగల ముఠాలు



నగరంలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుసచోరీలకు పాల్పడుతున్నారు. నిందితులను పట్టుకోవడంలో జాప్యం జరగడంతో దొంగతనాల సంఖ్య పెరుగుతోంది. చుడీదార్, ముఖానికి ముసుగుతో మహిళల వేషధారణలో అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి చోరీలకు పాల్పడిన దొంగల జాడ ఇప్పటి వరకూ తెలియలేదు.

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నేరం జరిగిన తర్వాత స్పందించడం కన్నా.. నేరం జరగక ముందే నేర నియంత్రణ చర్యలు తీసుకుంటే క్రైమ్‌రేటును భారీగా తగ్గించవచ్చని, పోలీస్ ఉన్నతాధికారులు ప్రతి సందర్భంలోనూ చెబుతుంటారు. అయితే పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు అందుకు భిన్నంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. దేశంలోనే అత్యధిక సీసీటీవీ కెమెరాలున్నది హైదరాబాద్ మహానగరంలోనే. ట్రై కమిషనరేట్ పరిధిలో సుమారు పది లక్షల కెమెరాలున్నాయి. చీమ చిటుక్కుమన్నా వెంటనే తెలుసుకునేలా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లోని కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. అయినా నగరంలో వరుస చోరీలకు పాల్పడి హల్‌చల్ సృష్టించిన దోపిడీ దొంగలను పట్టుకోలేక పోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రెచ్చిపోతున్న దొంగల ముఠాలు

మహానగరంలో అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. ఏ మూల ఏం జరిగినా వెంటనే కనిపెట్టేంత సీసీటీవీల నిఘా ఉన్నా పోలీసులకు పట్టుబడతామన్న భయం మాత్రం దొంగలకు లేదు. దాంతో నగరంలో దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. ఒకవైపు స్థానిక దొంగలు ఒంటరి మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతుండగా.. మరోవైపు అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు నగరంలో తిష్టవేసి చోరీలకు తెగబడుతూ అదును చూసి అందినంత దోచుకుంటున్నాయి. కొద్దిరోజుల క్రితం సిటీ కమిషనరేట్ పరిధిలో మూడు భారీ చోరీలకు పాల్పడ్డ దొంగల ముఠాల జాడ తెలియలేదు. ఇటీవల రాచకొండ పరిధిలో మరో భారీ చోరీ జరిగింది. అయితే దొంగలు మాత్రం పోలీసులకు చిక్కడంలేదు. అయితే ఆ దొంగల ముఠాలు నగరంలోనే నక్కి ఉన్నాయా..? నగరం దాటేశారా..? అని పోలీసులు అనుమానిస్తున్నారు.

హబీబ్‌నగర్‌లో రెండు ఇళ్లల్లో

హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. రెండు వేర్వేరు ఇళ్లలోకి చొరబడి తాళాలు పగులగొట్టి 15.5 తులాల బంగారం, 5.70లక్షల నగదు ఎత్తుకెళ్లారు. టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించిన పోలీసులు దొంగలకోసం గాలిస్తున్నారు.

దొరకని చుడీదార్ దొంగలు

చుడీదార్ ధరించి, ముఖానికి ముసుగు ధరించి మహిళల వేషధారణలో అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి చోరీలకు పాల్పడిన దొంగల జాడ ఇప్పటి వరకు తెలియలేదు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం పగులగొట్టి ఫ్లాట్‌లోకి ప్రవేశించిన దొంగలు అల్మారాలో దాచిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన తీరును బట్టి ప్రొఫెషనల్ దొంగలు పక్కా పథకం ప్రకారం చోరీ చేసినట్లు పోలీసులు అనుమానించారు.

జవహర్‌నగర్‌లో..

ఇటీవల రాచకొండ కమిషనరేట్ పరిధిలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. బంగారం, నగదు సహా.. 10లక్షల విలువైన సొత్తును దొంగలు దోచుకెళ్లారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. కానీ ఇప్పటి వరకు దోపిడీ దొంగల ఆచూకీ తెలియలేదు.



చుడీదార్ దొంగలు సీసీఫుటేజీ దృశ్యాలు (ఫైల్)

బదిలీల పేరుతో పాలన గాలికి!

- కేసుల విషయం పట్టించుకోని ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు

పోలీస్‌శాఖలో త్వరలోనే సీపీ స్థాయి అధికారుల నుంచి ఎస్ఐ స్థాయి వరకు పూర్తిస్థాయిలో పోలీసుల బదిలీలు జరగనున్నాయని ప్రచారం జరుగుతోంది. డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐల మధ్య తదుపరి పోస్టింగ్‌లు, బదిలీలపై చర్చ నడుస్తోంది. పోలీస్‌శాఖలో ఏ ఇద్దరు సిబ్బంది మాట్లాడుకున్నా నా పోస్టింగ్ ఇక్కడ ఉంటుందో..? లేదో ఎక్కడికి బదిలీ చేస్తారో..? అని చర్చించుకుంటున్నట్లు తెలిసింది. ఎప్పుడైతే బదిలీల అంశం చర్చనీయాంశమైందో అప్పటి నుంచీ కొన్ని పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు విధినిర్వహణపై పెద్దగా దృష్టి సారించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై పెద్దగా పట్టించుకోవట్లేదని తెలుస్తోంది. కొన్ని పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది ఏకంగా నేను పోస్టింగ్‌లో ఉంటానో..? లేక బదిలీపై వెళ్తానో..? తెలియడం లేదని వచ్చిన కేసులను సీరియస్‌గా తీసుకోకుండా కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏది ఏమైనా బదిలీల ప్రక్రియ పూర్తయి, కొత్త అధికారులు కొలువుదీరితే తప్ప పోలీస్‌స్టేషన్‌లలో పాలన గాడిన పడే పరిస్థితి కనిపించడంలేదని క్షేత్రస్థాయి పోలీస్ అధికారులు చర్చించుకుంటున్నారు. త్వరలోనే బదిలీలు జరుగుతాయనే ప్రచారంతో పలువురు డీసీపీలు, ఏసీపీలు సైతం సిబ్బంది పనితీరును సీరియస్‌గా తీసుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

మెట్రోరైలు నిర్వహణలో అవాంతరాలుండొద్దు

- వర్షాకాలంలో నిరంతరాయంగా సేవలందించాలి
- హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగర రవాణాలో కీలకమైన మెట్రోరైలు నిర్వహణలో వర్షాకాలంలోనూ ఎలాంటి అవాంతరాలూ ఉండొద్దని హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో 24/7 విధులు నిర్వర్తించి, ప్రయాణికులకు మెరుగైన రవాణా అందించాలని ఆదేశించారు. వర్షాకాల పనుల సన్నద్ధతపై గురువారం రసూల్‌పురాలోని మెట్రోరైలు భవన్‌లో ఎల్అండ్‌టీ ఆపరేషన్స్, మెయింటెనెన్స్ కంపెనీ కియోలిస్, హెచ్ఎంఆర్ఎల్ ఇండిపెండెంట్ ఇంజనీర్, ఏఈసీఓఎం సీనియర్ అధికారులతో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, కియోలిస్ ఎండీ ఎస్సీ మిశ్రా, హెచ్ఎంఆర్ఎల్, ఎల్అండ్‌టీ, కియోలిస్, ఏఈసీఓఎం సీనియర్ ఇంజనీర్లు పాల్గొన్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో సీనియర్ ఇంజనీర్లందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మెట్రోరైలు కార్యకలాపాలు, ఇన్‌స్టలేషన్ పనులను 24/7 పర్యవేక్షించాలని సూచించారు. సమీక్షలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

- భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ట్రాన్స్‌కో ఫీడర్ ట్రిప్ అయితే వెంటనే ప్రత్యామ్నాయ ఎలక్ట్రిక్ ఫీడర్లకు మార్చేందుకు ఏర్పాట్లు చేయాలి.
- కారిడార్లలోని విస్తరణ జాయింట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. వర్షపు నీటి పైపులను శుభ్రపరచాలి. వర్షపు నీటి గట్టర్ లీకేజీలను నివారించేందుకు జాయింట్ల సీలింగ్ పరిశీలించాలి. వయాడక్ట్‌పై

మిగతా 8వ పేజీలో..

పీడీయాక్ట్ ప్రయోగించినా తిరిగి అదే దందా..

- ఘరానా వ్యభిచార ముఠా అరెస్ట్
- ఆరుగురు యువతులను కాపాడిన టాస్క్‌ఫోర్స్



పోలీసుల అదుపులో ఉన్న వ్యభిచార ముఠా నిర్వాహకులు, సబ్ ఆర్గనైజర్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ, పశ్చిమబెంగాల్, త్రిపుర ప్రాంతాల నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా సభ్యులను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. విజయవాడకు చెందిన సూర్యకుమారి(38), తిరుపతికి చెందిన కె.విజయశేఖర్‌రెడ్డి(49) వ్యభిచారం నిర్వహించడమే దందాగా పెట్టుకున్నారు. పేర్లు మార్చుకుంటూ నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యభిచార ముఠాను నిర్వహిస్తున్న సూర్యకుమారి అలియాస్ వర్ష అలియాస్ ముడిసి సూర్యకుమారి అలియాస్ అంజలి అలియాస్ దాసరి అంజలి అలియాస్ చిట్టి అలియాస్ కుమారి అలియాస్ రాణి అలియాస్ పల్లవి, అలియాస్ లక్ష్మిపై 16 కేసులు నమోదయ్యాయి. ఆమెపై రాచకొండ పోలీసులు పీడీ యాక్ట్ కూడా ప్రయోగించారు. కానీ, తీరు మార్చుకోని సూర్య కుమారి అమీర్‌పేటలో ఉంటున్న విజయశేఖర్‌రెడ్డితో కలిసి దందా ప్రారంభించింది. సబ్ ఆర్గనైజర్లు పశ్చిమబెంగాల్ 24 పరగణాకు చెందిన ఆర్కోజిత్ ముఖర్జీ(30), తిరుపతికి చెందిన వేణుగోపాల్ బాలాజీ(50) సహకారంతో ఏపీ, పశ్చిమబెంగాల్, త్రిపురకు చెందిన యువతులను నగరానికి రప్పించేవారు. విజయశేఖర్‌రెడ్డి తనకున్న నెట్‌వర్క్ ద్వారా కస్టమర్లకు యువతుల ఫొటోలు పంపేవాడు. వారి కోరిక మేరకు యువతులను ఆయా ప్రాంతాలకు, లాడ్జిలకు పంపేవాడు. సూర్యకుమారి పలు మార్గాల్లో కస్టమర్ల నుంచి డబ్బులు తీసుకోవడం, ఆన్‌లైన్ పేమెంట్ వ్యవహారాలను చూసుకునేది. పక్కా సమాచారమందుకున్న

మిగతా 8వ పేజీలో..

లేని కార్మికులకు వేతనాలపై విజిలెన్స్

- ఆరా తీసిన అధికారులు
- త్వరలో సమగ్ర విచారణ..?
- ఎవరి పాత్ర ఏంటనేది పరిశీలించే అవకాశం
- బోగస్‌ను కప్పిపుచ్చే ప్రయత్నాలు
- కొత్తగా కార్మికులను తీసుకునేందుకు కసరత్తు
- ఇప్పటికే పలు సర్కిళ్లలో నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'లేని కార్మికులకు రూ.200 కోట్ల వేతనాలు' పేరిట ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనం సంచలనంగా మారింది. దశాబ్దానికిపైగా బోగస్ అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల వేతనాలు పక్కదారి పట్టించిన వైనం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. కార్మికుల పేరుతో ఎంత ప్రజాధనం మింగారు..? అదంతా ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ఉద్యోగులు చర్చించుకున్నారు. దీనిపై నోరు మెదిపేందుకు ఉన్నతాధికారులు ఆసక్తి చూపలేదు. అధికార వికేంద్రీకరణతో జోనల్, సర్కిల్ కార్యాలయాల్లోనే ఈతంతు జరిగిందని కేంద్ర కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. పారిశుధ్య నిర్వహణ విభాగంలో అవినీతి భాగోతంపై విజిలెన్స్ విచారణ మొదలైంది. కథనం ప్రచురితమైన నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు వివరాలు ఆరా తీశారు.ఈ తతంగంలో కీలకంగా వ్యవహరించింది ఎవరు..? అని పలువురికి ఫోన్ చేసి సమాచారం సేకరించినట్లు తెలిసింది. త్వరలో వేతనాల చెల్లింపులు, వాస్తవంగా ఉన్న కార్మికుల వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశముందని సమాచారం. సర్కిళ్ల వారీగా వివరాలు పరిశీలించి.. బోగస్ కార్మికులు ఎవరు..?

మిగతా 8వ పేజీలో..

ఫీడర్ల నిర్వహణకు ప్రత్యేక యాప్

- విద్యుత్ స్తంభాలతో పాటు చేసిన పనుల వివరాలు నమోదు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణమవుతున్న సమస్యలను ముందే గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఫీడర్ మేనేజ్‌మెంట్ యాప్‌ను విద్యుత్ శాఖ కొత్తగా రూపొందిస్తోంది. త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. గ్రేటర్‌జోన్‌లో 22వేల కిలోమీటర్ల 11కేవీ విద్యుత్ లైన్లు, 57వేల కిలోమీటర్ల ఎల్‌టీ విద్యుత్‌లైన్లు, 23 డివిజన్లు, 200కు పైగా సెక్షన్లు, రెండు వేలకు పైగా ఫీడర్లు ఉన్నాయి. విద్యుత్ డిమాండ్ రికార్డుస్థాయిలో పెరిగినా, భారీ వర్షాలతో చెట్ల కొమ్మలు తీగలపై పడినా ఫీడర్లు ట్రిప్పవుతుంటాయి. ఫీడర్లలో



విద్యుత్ లైన్లు

మిగతా 8వ పేజీలో..

7నుంచి గోల్కొండ బోనాల ఉత్సవాలు

- నెల రోజుల పాటు గురు, ఆదివారాల్లో నిర్వహణ
- తొమ్మిది రోజులు.. 9 ప్రత్యేక పూజలు

8



నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

ఫ్రైడ్ ఇండియాలో నిర్మాణాల కూల్చివేత

ఓ బడా రియల్ ఎస్టేట్ కంపెనీ చేసిన మోసంతో వందలాది మంది రోడ్డున పడ్డారు. కొన్న స్థలంలో కట్టుకున్న నిర్మాణాలను అధికారులు కూల్చివేస్తుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఎఫ్‌టీఎల్ స్థలంలో వెంచర్ చేసి ప్లాట్లు అమ్మిన కంపెనీ వందల కోట్లు లాభపడగా, కొనుగోలుదారులు రోడ్డున పడ్డారు.

- ఎఫ్‌టీఎల్ స్థలంలో ప్లాట్లు చేసి విక్రయించిన సంస్థ
- నిర్మాణాలు చేపట్టిన కొనుగోలుదారులు
- కూల్చేసిన అధికారులు
- రోడ్డున పడ్డ 250 మందికి పైగా కొనుగోలుదారులు

బేగంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున బేగంపేట డివిజన్‌లో మాతాజీనగర్ సమీపంలో 10 ఎకరాల విస్తీర్ణంలోని స్థలంపై బడా రియల్ ఎస్టేట్ కంపెనీ ఫ్రైడ్ ఇండియా కన్నేసింది. నకిలీ పేపర్లను సృష్టించి ఏకంగా అందులో వెంచర్ చేసింది. వంద గజాల చొప్పున 300 ప్లాట్లుగా చేసింది. సుమారు 250కు పైగా ప్లాట్లను ఒక్కొక్కటి రూ. 30 లక్షలకు అమ్మేసింది. ప్లాట్లు కొన్నవారు ఇళ్లు నిర్మించాక అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇది ఎఫ్‌టీఎల్ స్థలమని, అందులో నిర్మాణాలు చేయవద్దని జీహెచ్ఎంసీ చెప్పడంతో కొనుగోలుదారులు కంగుతిన్నారు. 2016 నుంచి 2024 వరకు సుమారు 5 సార్లు అక్కడి నిర్మాణాలను అధికారులు కూల్చివేయించడం గమనార్హం. గురువారం కూడా కూల్చివేతలు కొనసాగాయి.

ఎఫ్‌టీఎల్ స్థలంలో లేఅవుట్

బాలానగర్ మండల పరిధి బేగంపేట మాతాజీనగర్‌లోని సర్వే నంబర్ 194/8/1లోని సుమారు 10 ఎకరాల 20 గుంటల్లో 2015లో ఫ్రైడ్ ఇండియా రియల్ ఎస్టేట్ కంపెనీ లేఅవుట్ చేసింది. సుమారు 250కు పైగా ప్లాట్లను విక్రయించారు. కొన్నవారు ఇళ్లను నిర్మించుకుంటున్నారు. అది ఎఫ్‌టీఎల్ స్థలమని అప్పట్లోనే జీహెచ్ఎంసీ, నీటి పారుదల శాఖలకు ఫిర్యాదులు రావడంతో అధికారులు నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు స్థల యజమానులపై బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో

మిగతా 8వ పేజీలో..



స్థలంలో జీహెచ్ఎంసీ నర్సరీ బోర్డు

స్కైప్ యూజర్లే టార్గెట్

- కేసుల పేరుతో బెదిరింపులు
- రూ.లక్షలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్కైప్ యూజర్లే లక్ష్యంగా సైబర్‌నేరగాళ్లు దోపిడీలకు పాల్పడుతున్నారు. పలు కేసుల పేరుతో భయపెట్టి రూ.లక్షలు కాజేస్తున్నారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు వారి వలలో చిక్కి రూ. 40 లక్షలు పోగొట్టుకున్నాడు. మనీల్యాండరింగ్, పార్సిల్‌లో డ్రగ్స్ పేరుతో ఓ రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి రూ. 20 లక్షలు దోచుకున్నారు. పోలీసు దుస్తులు ధరించిన వ్యక్తులు స్కైప్ కాల్ చేసి కేసుల పేరుతో బెదిరించి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారని సైబర్ నిపుణులు ప్రసాద్ పాటిబండ్ల తెలిపారు. వాట్సాప్, టెలిగ్రాం వంటి యాప్‌లు లేని సమయంలో ఎన్నారైలు, ఐటీ, ఆరోగ్య రంగ నిపుణులు, పలు సంస్థల ఉన్నతాధికారులు విరివిగా స్కైప్‌ను వినియోగించేవారు. ఇప్పటికీ కొందరు స్కైప్‌ను వినియోగిస్తున్నారు. వారి సమాచారం సేకరించిన సైబర్ నేరగాళ్లు, వారి గురించి ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు సేకరించి దర్యాప్తు సంస్థల అధికారులమంటూ స్కైప్ కాల్స్ చేసి భయపెడుతున్నారు. కేసు నుంచి తప్పిస్తామని, ఖాతాలో డబ్బును స్క్రీనింగ్ చేయాలని చెప్పి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. వారి టార్గెట్ పూర్తయ్యే వరకు బాధితుడిని ఎవరితో కలవనీయకుండా, ఫిర్యాదు చేయనీయకుండా భయపెట్టి డబ్బులు గుంజుతున్నారు. బాధితుల్లో కొందరికి చట్టాలపై అవగాహన ఉన్నప్పటికీ సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు లొంగిపోయి, డబ్బులు పోగొట్టుకుంటున్నారు. మోసగాళ్ల చేతిలో డబ్బులు పోగొట్టుకున్నవారిలో 45 నుంచి 70 ఏళ్ల వారు ఉండటం గమనార్హం.

డబ్బు డిమాండ్ చేస్తే మోసమే



కేంద్ర దర్యాప్తు సంస్థల పేర్లు చెప్పి, కేసులు నమోదయ్యాయని భయపెట్టి డబ్బులు వసూలు చేయడాన్ని 'ఫైనాన్షియల్ స్వాటింగ్'గా పేర్కొంటారు. ఈడీ, ఐటీ, నార్కొటిక్స్, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు వీడియో కాల్స్‌లో నోటీసులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వవు. ఎవరైనా దర్యాప్తు సంస్థల అధికారి అని ఫోన్ చేస్తే వెంటనే ఫోన్‌ను పెట్టేసి, పోలీసులకు సమాచారమివ్వండి. ఒకవేళ సైబర్ నేరగాళ్లు డబ్బులు తీసుకుంటే వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. కేసుల పేరుతో డబ్బు డిమాండ్ చేస్తే కచ్చితంగా మోసమేనని గ్రహించాలి.

- ప్రసాద్ పాటిబండ్ల, సైబర్ నిపుణులు

నేడు 5గంటలు ఆలస్యంగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నాంపల్లి నుంచి న్యూఢిల్లీ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం 5 గంటలు ఆలస్యంగా బయల్దేరుతుందని దక్షిణమధ్యరైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. ఉదయం 6 గంటలకు బయల్దేరాల్సి ఉండగా, 11 గంటలకు రీషెడ్యూలు చేసినట్లు పేర్కొన్నారు. న్యూఢిల్లీ నుంచి నాంపల్లికి గురువారం సాయంత్రం 5 గంటలకు రావాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ 7 గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు చేరుకోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఆలస్యం కావడానికి గల కారణాలపై ముఖ్య ప్రజా సంబంధాల అధికారి రాకేశ్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌ద్వారా ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

బుర్రా వెంకటేశం పేరిట వాట్సాప్‌లో ఫేక్ మెసేజ్‌లు

● జేఎన్‌టీయూ ప్రొఫెసర్లను అప్రమత్తం చేసిన రిజిస్ట్రార్

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్, సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం పేరుతో యూనివర్సిటీ ప్రొఫెసర్లకు, ఉన్నతాధికారులకు వాట్సాప్‌లో ఫేక్ మెసేజ్‌లు వచ్చాయి. అమెజాన్‌లో పుస్తకాలు ఆర్డర్ చేశానని, నావైపు నుంచి పేమెంట్ కానందున మీరు చెక్ చేయాలన్నట్లుగా సదరు మెసేజ్‌ల సారాంశంగా తెలుస్తోంది. వాట్సాప్ నంబరుకు బుర్రా వెంకటేశం ఫొటోను డీపీగా పెట్టినట్లు గుర్తించిన కొందరు ఈ విషయాన్ని ఇన్‌చార్జ్ వీసీ, రిజిస్ట్రార్‌ల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వర్సిటీ సిబ్బందిని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు అప్రమత్తం చేశారు. ఇన్‌చార్జ్ వీసీ పేరిట వాట్సాప్‌లో వచ్చే ఫేక్ మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని, అలాగే ఈ-కామర్స్ సైట్ లింకులతో సొమ్ములు చెల్లించవద్దని సూచించినట్లు తెలిసింది.

హరీశ్‌రావును జైలుకు పంపించే వరకు ఉద్యమం

● ఆయన త్వరలో బీజేపీలో చేరతాడు: సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నాయకుడు చక్రధర్‌గౌడ్



మాట్లాడుతున్న చక్రధర్‌గౌడ్

తార్నాక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి తప్పించుకోవడానికి బీజేపీలో చేరేందుకు యత్నిస్తున్నాడని, సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చక్రధర్ గౌడ్ అన్నారు. గురువారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చక్రధర్‌గౌడ్ మాట్లాడుతూ ఆగస్టు 15న రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు తన మాటకు కట్టుబడి ఉండాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా హరీశ్‌రావు ఇప్పటికే బీజేపీ జాతీయ నాయకులతో మంతనాలు జరుపుతున్నాడని, త్వరలో ఆయన బీజేపీలో చేరుతాడని తెలిపారు. రంగనాయక సాగర్ భూముల విషయంలో హరీశ్‌రావు పాల్పడిన అక్రమాలను తాను బయటపెడుతున్నానని, గతంలో తనపై అక్రమ కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడని, హరీశ్‌రావును జైలుకు పంపించే వరకు తన ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

బక్రీద్ ఏర్పాట్లపై..



జీహెచ్‌ఎంసీ, విద్యుత్, వాటర్‌వర్క్స్ అధికారులు, రాజకీయ నాయకులు, మౌల్వీలు, ఉలేమాలుతో సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా తీసుకోవాల్సిన భద్రత చర్యలు, ఏర్పాట్ల గురించి చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రం సింగ్‌మాన్, తదితరులు పాల్గొన్నారు.
- హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

రెండో రోజూ స్కూల్ బస్సుల తనిఖీ

● నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 9 సీజ్

రాజేంద్రనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో స్కూల్ బస్సులను రెండోరోజు గురువారం కూడా అధికారులు తనిఖీ చేశారు. రాజేంద్రనగర్, శంషాబాద్, చేవెళ్ల, బాలాపూర్, కొండాపూర్, మేడ్చల్, ఇబ్రహీంపట్నం ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఆర్‌సీ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పరిశీలించారు. 60 సంవత్సరాలు పైబడిన వారు బస్సులను నడపొద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న రాజేంద్రనగర్‌లో ఐదు, చేవెళ్లలో రెండు, బాలాపూర్‌లో రెండు బస్సులను సీజ్ చేసినట్లు రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు తెలిపారు.


వ్యవసాయ వర్సిటీని సందర్శించిన ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు

వ్యవసాయ వర్సిటీని సందర్శించిన ప్రొబేషనరీ ఐఏఎస్‌లు

రాజేంద్రనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్ ప్రొబేషనరీ అధికారులు బుధవారం సాయంత్రం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ పి. రఘురామిరెడ్డి, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చేపడుతున్న బోధన, పరిశోధన, విస్తరణ విభాగాలలో చేస్తున్న కార్యక్రమాలు, నిర్వహిస్తున్న కోర్సులు, రాష్ట్ర వ్యవసాయానికి సంబంధించిన పలు విషయాలను రిజిస్ట్రార్ వారికి వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ వి.సుధారాణి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ అనిత, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ జమునారాణి, డాక్టర్ ఎన్.పి.రవికుమార్, డాక్టర్ వన్నోజ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ

పహాడిషరీఫ్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ నాలుగో వార్డు కౌన్సిలర్ జింకల రాధిక శ్రవణ్, ప్రధానోపాధ్యాయుడు అమరనాథ్‌రెడ్డి కోరారు. గురువారం బడిబాట కార్యక్రమంలో విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం బడిబాట ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బోగస్ క్రీడా సంఘాలను గుర్తించొద్దు'

బర్కత్‌పుర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బోగస్ క్రీడా సంఘాలను గుర్తించొద్దని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రకరకాల క్రీడా సంఘాలు పుట్టుకొస్తుండడం వల్ల క్రీడాకారులు తికమకపడుతున్నారని అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్ అన్నారు. అన్ని క్రీడలకు కోచ్‌లను నియమించాలని కోరారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి కె. రమేష్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, వివిధ జిల్లాల కార్యదర్శులు డి. లక్ష్మణ్, సురేందర్, శంకర్‌నాయక్, విజయ్‌కుమార్, పుల్లయ్యనాబా, తిరుమలరెడ్డి తదితరులు మాట్లాడారు. తమ అసోసియేషన్ హ్యాండ్ బాల్ ఫెడరేషన్ గుర్తింపు పొందిందని, ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నిర్బంధ క్రీడా విద్యను రాష్ట్రంలో పటిష్ఠంగా అమలు చేయాలని, ఎంసెట్, నీట్, ట్రిపుల్ ఐఐటీలలో స్పోర్ట్స్ కోటాను పునరుద్ధరించి రెండు శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

బర్కత్‌పుర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని కురుమ రాజకీయ జేఏసీ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కురుమ రాజకీయ జేఏసీ ప్రతినిధులు ఎర్ర సత్యనారాయణ, జక్కుల వంశీకృష్ణ, గొరిగె మల్లేష్‌యాదవ్, రఘునాథ్, కొంగల పాండు, పర్వతాలు, కె. శ్రీనివాస్, మాదారం కృష్ణ, శ్రీనివాస్ మాట్లాడారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు

అడ్డగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పేపర్ ప్లేట్ మెషీన్ అందజేస్తున్నట్లు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ వాన్ ఒవెన్ తెలిపారు. గురువారం లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రేమలీల ట్రాన్స్‌జెండర్ కార్యాలయంలో పేపర్ ప్లేట్ మెషీన్‌ను ఆయన అందజేశారు. ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి తోడ్పాటునందిస్తున్న హాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదాను ఆంథోనిని అభినందించారు. ట్రాన్స్ కమ్యూనిటీ లీడర్ వైజయంతి మాట్లాడుతూ.. హాస్ సంస్థ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌జెండర్లకు సూచించారు. ఆంథోని మాట్లాడుతూ.. వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు ట్రాన్స్‌జెండర్లకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.


పేపర్ ప్లేట్ మెషీన్‌ను పరిశీలిస్తున్న గారేత్ వాన్ ఒవెన్

2,800 బస్సులు గమ్యం యాప్‌తో అనుసంధానం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ ఆర్టీసీ గమ్యం యాప్ సేవలు అంతంతే' అని గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. గ్రేటర్ జోన్ పరిధిలో 2,800 బస్సులను గమ్యం యాప్‌నకు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. యాప్‌లో బస్సుల వివరాలు నమోదు చేసేందుకు ప్రతీ డిపోలో ప్రత్యేకంగా ఓ ఉద్యోగిని నియమించామని తెలిపారు. డిపో పరిధిలో ఆయా బస్సుల ట్రాకింగ్‌ను ఆ ఉద్యోగి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు.

'పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి'

గోషామహల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి గంగాధర్ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆర్థికస్థోమత లేని విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులకు అయ్యే ఖర్చులను ఫౌండేషన్ చెల్లిస్తుందని పేర్కొన్నారు. గురువారం గౌలిగూడలోని ఫౌండేషన్ కార్యాలయంలో పేద విద్యార్థులకు అడ్మిషన్ ఫారాలు అందజేశారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు

● 46 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం

● 9 మంది అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 46 కింటాళ్ల రేషన్ బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై అధికారులతో కలిసి హుమాయున్‌నగర్, చిలకలగూడ, ముషీరాబాద్, మలక్‌పేట, యాకుత్‌పురా పోలీస్‌స్టేషన్‌ల పరిధుల్లో గురువారం దాడి చేశారు. విశాల్ యాదవ్, మహ్మద్ నాసిర్, మహ్మద్ షోయబ్, మహ్మద్ జహంగీర్, ఎండీ షాబాద్, సంగం లోవ అలియాస్ రాజు, సయ్యద్ రహీం, సయ్యద్ నిజాం, మహ్మద్ మజార్ నగరంలో పలు ప్రాంతాలో రేషన్ బియ్యం సేకరించి అధిక ధరకు విక్రయిస్తున్నారు.

అక్రమంగా గ్యాస్ సిలిండర్‌లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

పహాడిషరీఫ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి పలు కంపెనీలకు చెందిన డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్లు, వాహనం స్వాధీనం చేసుకున్నారు. జల్‌పల్లి మంచు టౌన్‌లో ప్లాట్ నంబర్ 107 అక్రమంగా సిలిండర్ల దందా నిర్వహిస్తున్నారని ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. సిలిండర్లు నిల్వ చేసిన స్థావరంపై గురువారం దాడిచేశారు. రాజస్థాన్‌కు చెందిన మనీష్ బిష్ణోయ్(19), రమేష్ బిష్ణోయ్ (28), ప్రేమ్ రాజ్ బిష్ణోయ్(32)ను అరెస్ట్ చేశారు. ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్న త్రివిక్రం గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు నరసింహ, అతడికి సహకరిస్తున్న డ్రైవర్ సురేష్ బిష్ణోయ్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

● రాజేంద్రనగర్ పరిసరాల్లో ఎక్కడ చూసినా పచ్చదనమే ● దారి పొడవునా చెట్లు


రాజేంద్రనగర్‌లో ఓ రహదారిలో చెట్లు

రాజేంద్రనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ పరిశోధనా సంస్థలకు పుట్టినిల్లు లాంటిది. అందుకే రాజేంద్రనగర్‌ను సైన్స్ సిటీగా కూడా పిలుస్తారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు ఢిల్లీ, పూస తర్వాత అంతటి స్థానం ఉన్నది రాజేంద్రనగర్‌కే. రాజేంద్రనగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉంది. ఇవేకాకుండా ఐసీఏఆర్ సంస్థలైన నార్మ్, ఐఐఆర్ఆర్, ఐఐఓఆర్, ఐఐఎంఆర్, ఎన్‌బీపీజీఆర్, ఎన్ఐపీహెచ్ఎం, వీడీపీ లాంటి సంస్థలున్నాయి. వీటితోపాటు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్, సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ లాంటి సంస్థలున్నాయి. వీటిలో ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తుంది. వేలాది చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం రాజేంద్రనగర్ సొంతం అని చెప్పవచ్చు.

మార్నింగ్ వాకర్స్‌కు ఆక్సిజన్..

మార్నింగ్ వాక్ చేసే ప్రజలకు ఇక్కడి పచ్చటి చెట్లు ఆక్సిజన్‌ను అందజేస్తున్నాయని చెప్పవచ్చు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధనా సంస్థ, కిద్వాయి కాటేజ్, నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్) తదితర ప్రాంతాలలో వందల సంఖ్యలో ప్రజలు మార్నింగ్ వాక్ చేస్తుంటారు.

ఊటీ, కొడైకెనాల్ లాంటి వాతావరణం

రాజేంద్రనగర్ పరిసరాల్లో ఊటీ, కొడైకెనాల్ లాంటి వాతావరణం ఉంటుందని చెబుతుంటారు. కిద్వాయి కాటేజ్‌ను చూస్తే ఊటీ గుర్తుకొస్తుంది. ఇక్కడి మానస హిల్స్ ప్రాంతానికి వెళితే కొడైకెనాల్ వెళ్లామా అనిపిస్తుంది.

రాజేంద్రనగర్‌లో ఉండటానికి ఇష్టపడుతున్న ప్రముఖులు

రాజేంద్రనగర్‌లో ఉండటానికి పలువురు ప్రముఖులు ఇష్టపడుతున్నారు. సన్‌షైన్ ఆస్పత్రి అధినేత డాక్టర్ గురువారెడ్డి కుటుంబం, శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ వరప్రసాద్ రెడ్డి లాంటి వారు రాజేంద్రనగర్ మానసహిల్స్ ప్రాంతంలో నివసిస్తున్నారు.


ఓ పరిశోధనా సంస్థలో పచ్చని చెట్లు

శంకర్‌హిల్స్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

నార్సింగ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మున్సిపాలిటీలోని శంకర్‌హిల్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను నార్సింగ్ మున్సిపాలిటీ, హెచ్ఎండీఏ అధికారులు గురువారం కూల్చివేశారు. గండిపేట మండలం ఒట్టినాగులపల్లి గ్రామంలోని శంకర్ హిల్స్ లేఅవుట్‌లో నిర్మించిన షెడ్లు, కాంపౌండ్‌వాల్, సాయి తులసీ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలను నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేశారు.

అనుమతి లేకుండా, నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు రావడంతో కూల్చివేతల కార్యక్రమం చేపట్టారు. వట్టినాగులపల్లిలో కొన్ని అక్రమ నిర్మాణాలను మాత్రమే కూల్చడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



శంకర్‌హిల్స్, తులసి లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

ఆకట్టుకున్న పేరిణీ సప్తతాండవాలు నాట్య ప్రదర్శన

రవీంద్రభారతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలంలో యుద్ధంలో సైనికులను సమాయత్తం చేసే సమయంలో పేరిణీ నాట్యాన్ని ప్రదర్శించేవారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, పీఠరేకే నాట్య ప్రపంచం సంయుక్తాధ్వర్యంలో పేరిణీ సప్తతాండవాలు పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ పేరిణీ కళాకారులు, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ కేంద్ర యువ పురస్కార గ్రహీత రాజ్‌కుమార్ నేతృత్వంలో ఉచిత శిక్షణ పూర్తయిన సందర్భంగా సప్తతాండవాలు నాట్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పేరిణీ విశిష్టతను చాటుతూ సాగిన ప్రదర్శన ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మంత్రి కళాకారులను సత్కరించి మాట్లాడారు. పేరిణీ నాట్యంలో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారం అందజేస్తోందని తెలిపారు.

కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, దైవజ్ఞశర్మ, పేరిణి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కళాకారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు


పేరిణీ నాట్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

పహాడిషరీఫ్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో చాలామంది విద్యార్థులు మత్తుకు బానిసై భవిష్యత్‌ను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని, యువత మత్తుకు దూరంగా ఉండాలని మహేశ్వరం జోన్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ అన్నారు, గురువారం షాహీన్ నగర్‌లో ఓఎస్ డిగ్రీ కాలేజీలో డ్రగ్స్, సైబర్ క్రైమ్‌లపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అమాయకులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. గుర్తుతెలియని నంబర్‌ల నుంచి ఫోన్ వస్తే ఓటీపీ, బ్యాంకు ఖాతాల వివరాలు వంటివి చెప్పొద్దన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం జోన్ ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి, కళాశాల చైర్మన్ ఉస్మాన్ సాది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు,


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ సత్యనారాయణ

అతుల్‌కుమార్ మరణం రైతాంగానికి తీరని లోటు

బర్కత్‌పుర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర, రుణ విమోచన చట్టాలను సాధించుకున్నప్పుడే రైతు ఉద్యమ నాయకుడు అతుల్‌కుమార్ అంజాన్‌కు నిజమైన నివాళులర్పించిన వారమవుతామని పలు రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో అంజాన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయరంగ శాస్త్రవేత్తలు సోమ మర్లా, దొంతి నర్సింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ తదితరులు మాట్లాడారు. అతుల్‌కుమార్ మరణం భారత రైతాంగానికి తీరని లోటని అన్నారు. రైతు సమస్యలను పరిష్కరించడంలో, కార్యాచరణ రూపొందించడంలో ఆయనకు వించిన నాయకుడు లేడని కొనియాడారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సాగిన ఐక్య ఉద్యమంలో అతుల్ కుమార్ క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.సూర్యనారాయణ, రైతు సంఘం ఉపాధ్యక్షుడు కె. రాజయ్య, ప్రభులింగం, దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


అతుల్‌కుమార్‌కు నివాళులర్పిస్తున్న పలు రైతు సంఘాల నేతలు

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి

● ఇద్దరు బీజేపీ నాయకులు సహా ఏడుగురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మంగళ్‌హాట్ పోలీసులు బెల్ట్ షాపులపై కొరడా ఝుళిపించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అనుచరుడు, బీజేపీ మంగళ్‌హాట్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ అలియాస్ బబ్లూ, కార్పొరేటర్ సోదరుడు శైలేందర్‌తో పాటు మరో ఐదుగురిని గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ పరిధిలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేశారు. సంతోష్ అలియాస్ బబ్లూ(43) గుఫానగర్‌లో బెల్ట్ షాప్ నిర్వహిస్తూ పట్టుబడ్డాడు. మంగళ్‌హాట్ డివిజన్ కార్పొరేటర్ శశికళ సోదరుడు శైలేందర్(34) సైతం బెల్ట్ షాప్ నిర్వహిస్తుండడంతో పట్టుకున్నారు. గుఫానగర్‌కు చెందిన నర్సింగ్‌రావు(46), మంగళ్‌హాట్‌లో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న విశాల్ సింగ్(29), ఇందిరా నగర్ బెల్ట్ షాప్ నిర్వాహకుడు బాబర్ వియా(22), జుమ్మేరాత్ బజార్‌లో వికాస్‌సింగ్ అలియాస్ గురు(38), జుంగూర్ బస్తీలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న కమల్ సింగ్ అలియాస్ సీతల్ సింగ్(61)ను పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ. 36 వేల విలువ గల 68 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సర్వే నంబర్ 177లో ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి'

బర్కత్‌పుర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాప్రా మున్సిపాలిటీ చర్లపల్లిలోని సర్వే నంబర్ 177లో ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని శ్రీసాయికృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు ఎస్. లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్. మురళి, ప్రధాన కార్యదర్శి జె. శంకర్, సంయుక్త కార్యదర్శి కె. శ్రీకాంత్‌రాజు, కోశాధికారి ఆగేష్‌గౌడ్ మాట్లాడారు. 2003లో 228 మంది ప్లాట్లు కొనుగోలు చేశారని, ఇళ్ల నిర్మాణానికి కాప్రా మున్సిపాలిటీ అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 104 ఆవులు స్వాధీనం

కోదాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 104 ఆవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అజీద్‌ఖాన్, యూసఫ్, సలీం ఆంధ్రప్రదేశ్‌లో హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా 104 ఆవులను కంటైనర్‌లో తరలిస్తున్నారని సమాచారం అందింది.

కోదాడ పోలీసులు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం వాహనాలు తనిఖీ ప్రారంభించారు. కంటైనర్‌ను, ఆవులను స్వాధీనం చేసుకున్నారు. ఆవులను ఏపీలోని వేదాద్రి దేవాలయ గోశాలకు తరలించి, సంబంధితులతో పాటు వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/x1u7KGe లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ మంజూరు చేయాలి

పహాడిషరీఫ్: వాదీ ఏ ముస్తఫా బస్తీలో సీసీరోడ్డు, భూగర్భ డ్రైనేజీ మంజూరు చేయాలనీ జల్‌పల్లి మునిసిపల్ కమిషనర్ వాణిరెడ్డికి కౌన్సిలర్ షాహమీ అఫ్జల్ గురువారం వినతిపత్రం అందజేశారు.

రైల్వే స్థలంలో బారికేడ్ల తొలగింపు

చాంద్రాయణగుట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా కాళీమాత దేవాలయం వద్ద భక్తుల తాకిడి దృష్ట్యా ఆలయ నిర్వాహకులు రైల్వే స్థలంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను రైల్వే పోలీసులు గురువారం తొలగించారు.

4.7 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

రాజేంద్రనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంఏ డ్రగ్ విక్రయించేందుకు యత్నిస్తున్న ఇద్దరిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. శాస్త్రీపురం ఎంఎస్‌ఫంక్షన్ హాల్‌వద్ద పోలీసులను చూసి అబ్దుల్ సొహైల్ ఖాన్, సయ్యద్ నవాజ్ పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 44 వేల విలువైన 4.7 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు.

ఎఫ్‌టీసీసీఐ అవార్డులకు నామినేషన్ల స్వీకరణ

మంగళ్‌హట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌టీసీసీఐ వార్షిక ఎక్స్‌లెన్స్ అవార్డులను ప్రకటించింది. ఈనెల 20వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. అవార్డులను జూలై 5వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అందజేస్తామని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్ తెలిపారు. ఫ్యాప్సీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన ఉత్పత్తి, వృద్ధికి పేరుగాంచిన కంపెనీలను గుర్తించి అవార్డులకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు ఎఫ్‌టీసీసీఐ వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

అఫ్జల్‌గంజ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి తహసీల్దార్‌కు పలు సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. గోషామహల్ నియోజకవర్గంలో పేదలకు ధ్రువపత్రాల జారీ విషయంలో, విద్యార్థుల సర్టిఫికెట్లు, షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ విషయంలో జాప్యం జరుగుతోందని ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా, సూర్యమహల్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, బాబా, షర్ఫుద్దీన్, ఖాజా మహ్మద్ ఆసిఫ్, సయ్యద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

హిమాయత్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. లిబర్టీలోని టీటీడీ తిరునిలయం ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టం, ఉదయం ఆరు గంటల నుంచి గంట పాటు తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉదయం శేష వాహనంపై, సాయంత్రం హనుమంత వాహనంపూ స్వామి వారిని ఊరేగించారు.


ఆచార్య మృణాళిని, గరిపెల్లి అశోక్‌ను సత్కరిస్తున్న అతిథులు

'ఏడు రంగుల జెండా' ఆవిష్కరణ

రవీంద్రభారతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సమ సమాజ నిర్మాణంలో బాల సాహిత్యం ఎంతో ఉపయోగపడుతుందని మణికొండ వేదకుమార్ అన్నారు. గురువారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అమరవాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమరవాది నీరజ రచించిన బాలల కథలు ఏడు రంగుల జెండా పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా అమరవాది హైమావతి - డా.ఎ.సి.ఎం.ఎల్.ప్రసాద్ సాహిత్య పురస్కారాన్ని ఆచార్య మృణాళినికి ప్రదానం చేశారు. డా.ఎసిఎంఎల్ ప్రసాద్, హైమావతి బాల సాహిత్య పురస్కారాన్ని గరిపెల్లి అశోక్‌కు అందజేశారు. వేదకుమార్ పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. మృణాళినికి అమరవాది సాహిత్య పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. సమాజహితం కోరే సాహిత్యం ఈతరం నుంచి రావాలని ఆకాంక్షించారు. ఏడు రంగుల జెండా పుస్తకం పిల్లల మనస్తత్వానికి దగ్గరగా ఉందని అన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయడానికి బాలసాహిత్యం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలన్నారు. కార్యక్రమంలో పత్తిపాక మోహన్, జుర్రు చెన్నయ్య, చొక్కాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సామాజికవేత్త ఆమనికి డాక్టరేట్

రవీంద్రభారతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక రంగంలో చేసిన సేవలకు గాను మలుగు ఆమనికి హోలీ స్పిరిట్ క్రిస్టియన్ వర్సిటీ ఆధ్వర్యంలో గురువారం సత్కరించి డాక్టరేట్ పట్టా అందజేశారు. బిషప్ ఆనంద్, డాక్టర్ అబ్రహం, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుసుమ భోగరాజు మాట్లాడుతూ.. నిరుపేదలకు సేవలు అందించడంలో ఆమని ముందుంటారని అన్నారు. మిషన్ పాజిటివ్‌లో భాగంగా ఈ పురస్కారం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసన

● పోలీసుల అదుపులో నలుగురు

రాయదుర్గం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా నిఘా సంస్థలు డైరెక్టెడ్ వెపన్స్‌తో తమ వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించడంపై టార్గెటెడ్ ఇండివిజువల్స్ ఆఫ్ ఇండియా కన్వీనర్ రావి తరుణ్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యులు నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా రావి తరుణ్‌సహా మరో ముగ్గురిని గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లిన భారతీయులు, భారతి సంతతికి చెందిన చాలా మంది నిఘా వేధింపులకు గురవుతున్నారని అన్నారు. న్యూరో వెపన్స్ ద్వారా అమెరికా నిఘా సంస్థలు అమెరికాలో ఉంటున్న వివిధ విదేశాల వారిని వేధిస్తున్నాయని ఆరోపించారు. న్యూరో వెపన్స్ గురించి హవాన సిండ్రోమ్, సింథటిక్ టెలిపతిని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భవిష్యత్‌లో పలు సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. వ్యక్తిగత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.

బీదర్, పద్మావతి రైలులో చోరీ

● పలువురి మెడలో బంగారు గొలుసుల అపహరణ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీదర్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్లో చోరీ జరిగింది. విజయవాడ నుంచి సికింద్రాబాద్ వైపు వస్తుండగా ప్రయాణికుల మెడల్లోని బంగారు గొలుసులను దొంగలు తెంచుకుని పారిపోయారు.

బుధవారం అర్ధరాత్రి చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ మధ్యలో సిగ్నల్ కట్ చేయడంతో రైలు ఆగిపోయింది. ఆ సమయంలో కింద రైలు పట్టాలపై ఉన్న నలుగురు దొంగలు ఎస్- 4,9,10 బోగిలలో కిటికీల పక్కన కూర్చున్న ప్రయాణికులు మెడలోని బంగారు గొలుసులు తెంపుకుని పారిపోయారు. ఎస్4 బోగిలో ప్రయాణం చేస్తున్న పద్మావతి మెడలో 4 గ్రాములు బంగారు గొలుసు, వర్ధనమ్మ మెడలో నుంచి 20 గ్రాముల బంగారు గొలుసు, వి.కుమార్ అనే ప్రయాణికుడి మెడలో 16 గ్రాములు బంగారు గొలుసు, జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న కీర్తన బ్యాగులో ఉన్న రూ.13 వేలు అపహరించారు. బాధితులు సికింద్రాబాద్ రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఖమ్మం జీఆర్‌పీ పోలీసులకు బదిలీ చేశారు.



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

అశ్రునయనాల మధ్య రాధక్క అంత్యక్రియలు

సైదాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గోదావరి లోయ ప్రతిఘటనా పోరాట నిర్మాణంలో ముఖ్యభూమిక పోషించిన విప్లవోద్యమ నాయకురాలు రాధక్క(86) అంత్యక్రియలు గురువారం ఉదయం సైదాబాద్ శ్మశానవాటికలో జరిగాయి. ఆమెకు చివరిసారిగా విప్లవజోహార్లు అర్పించేందుకు వామపక్ష, ప్రజాసంఘాల నేతలు హాజరయ్యారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, ప్రజాకవి జయరాజ్, ప్రజాసంఘాల నాయకులు ఝాన్సీ, చెరుకు సుధాకర్, యు.వెంకటేశ్వర్‌రావు, భూతం వీరన్న, ప్రసాద్, సీపీఎం సౌత్ జిల్లా కమిటీ సభ్యుడు బాలునాయక్, నాయకులు కిషోర్, యాదగిరి, ఇందిరాఅశోక్ ఆమెకు నివాళులర్పించారు.

లేని కార్మికులకు వేతనాలపై విజి'లెన్స్'

(5వ పేజీ తరువాయి)


వారికి చెల్లించిన వేతనాల్లో ఎవరెవరికి వాటాలు దక్కాయి..? అన్నది తేల్చనున్నారు.

బోగస్‌ను కప్పిపుచ్చేలా..

బోగస్ కార్మికుల తతంగాన్ని కప్పిపుచ్చేందుకు మరోవైపు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ కాని కార్మికుల స్థానంలో కొత్త వారిని తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఫేస్ రికగ్నైజేషన్ హాజరు విధానం అందుబాటులోకి వచ్చిన అనంతరం పలు సర్కిళ్లలో ఇప్పటికే కొందరు కొత్త కార్మికులను తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం ఒక్కో కార్మికుడు/కార్మికురాలి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, చార్మినార్, ఎల్‌బీనగర్ జోన్లలో ఈ తతంగం నడిచినట్టు తెలుస్తోంది. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని రెండు సర్కిళ్లలోనూ ఇటీవల నూతన కార్మికుల నియామకం జరిగిందని తెలిసింది. గతంలో సింథటిక్ వేలిముద్రలతో హాజరు వేసిన వారి స్థానంలో కొత్త వారిని తీసుకుంటున్నారు. బేరం కుదరకపోవడంతో కొన్ని సర్కిళ్లలో నియామక ప్రక్రియలో జాప్యం జరిగిందని ఓ అధికారి చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న కార్మికుల వివరాలను పరిశీలిస్తే బోగస్ బాగోతం బయటపడనుంది. కార్మికుల ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతాల వివరాలను పరిశీలిస్తే.. అవకతవకలపై స్పష్టత రానుంది. గత రెండు నెలల్లో చేరిన వారిలో ఎంతమంది సక్రమం..? ఎందరు అక్రమంగా వచ్చారు..? అన్నది తేలనుంది.

7 నుంచి గోల్కొండ బోనాలు

● నెల రోజుల పాటు గురు, ఆదివారాల్లో నిర్వహణ ● తొమ్మిది రోజులు 9 ప్రత్యేక పూజలు



గోల్కొండ కోటపై గల జగదాంబిక ఆలయం



నార్సింగ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో అమావాస్య తర్వాత వచ్చే గురువారం లేదా ఆదివారం గోల్కొండ కోటపై గల శ్రీ ఎల్లమ్మ(జగదాంబిక) ఆలయంలో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈసారి ఆషాఢంలో అమావాస్య జూలై 5న వస్తుంది. తరువాత వచ్చే ఆదివారం(జూలై 7) నుంచి బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ మొదటి పూజ జరిగిన తర్వాత తెలంగాణలోని ఇతర ఆలయాల్లో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గోల్కొండ తర్వాతనే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, లాల్‌దర్వాజ మహంకాళి ఆలయంలో పూజలు జరుగుతాయి. ఆషాఢమాసంలో చివరి రోజు గోల్కొండ కోటలోనే చివరి బోనం పూజ జరుగుతుంది. దీంతో బోనాల ఉత్సవాలు సమాప్తం అవుతాయి. గోల్కొండ కోటపై గల శ్రీఎల్లమ్మ(జగదాంబిక) ఆలయంలో జూలై 7నుంచి నెల రోజుల వరకు ప్రతీ గురువారం, ఆదివారం బోనాలు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరం నలు మూలల నుంచే గాక, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారు.

ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్

కార్వాన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ బోనాల ట్రస్ట్‌బోర్డు కమిటీ పదవీకాలం ముగియడంతో దేవాదాయ శాఖ అధికారులు నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలవుతుందని వారు తెలిపారు. ట్రస్ట్‌బోర్డు అధ్యక్ష పదవికి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే చాలామంది రాష్ట్ర మంత్రులను కలుస్తూ తనకు అవకాశం కల్పించాలని కోరారు.

గోల్కొండ ఎల్లమ్మ ఆలయంలో బోనాల షెడ్యూల్ ఇదీ..

- జూలై 7న మొదటి పూజ
- జూలై 11న రెండో పూజ
- జూలై 14న మూడో పూజ
- జూలై 18న నాల్గో పూజ
- జూలై 21న ఐదో పూజ
- జూలై 25న ఆరోపూజ
- జూలై 28న ఏడో పూజ
- ఆగసు 1న ఎనిమిదో పూజ
- ఆగస్టు 4న తొమ్మిదో పూజ

ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నగరంలో ఈ నెల 16న జరగనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లోని సరోజినీనాయుడు వనిత మహావిద్యాలయ మందిరంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షకు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 99 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 45,153 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. పేపర్-1 ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. యూపీఎస్సీ నిబంధనల మేరకు పరీక్షకు 30 నిమిషాల ముందే కేంద్రం గేట్లు మూసేయడం జరుగుతుందన్నారు. పరీక్షకు 30 నిమిషాల ముందు అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని, ఆ తర్వాత వచ్చిన వారిని అనుమతించబోమని తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్ష కేంద్రాల సూపర్‌వైజర్లు పని చేయాలన్నారు. కాగా, పరీక్ష నిర్వహణపై జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సమీక్షలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్, యూపీఎస్సీ డిప్యూటీ సెక్రెటరీ శైలేష్ గౌతమ్, అశోక్ జోషి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్‌సింగ్ పాల్గొన్నారు.

పీడీయాక్ట్ ప్రయోగించినా తిరిగి అదే దందా..

(5వ పేజీ తరువాయి)

వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పంజాగుట్ట పార్క్ హోటల్‌లో కస్టమర్ కృతితేజతోపాటు యువతిని అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆరుగురు యువతులను కాపాడారు. ప్రధాన నిర్వాహకులు సూర్యకుమారి, విజయశేఖర్‌రెడ్డితోపాటు సబ్ ఆర్గనైజర్‌లు ఆర్కోజిత్ ముఖర్జీ, వేణుగోపాల్ బాలాజీలతోపాటు కృతితేజను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 89,500, రెండు కార్లు, మూడు బైక్‌లు, 18 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 2 ట్యాబ్‌లు, వివిధ బ్యాంక్‌లకు చెందిన 45 క్రెడిట్, డెబిట్ కార్డులు, 5 సిమ్‌కార్డులు, 25 ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు.

ఫీడర్ల నిర్వహణకు ప్రత్యేక యాప్

(5వ పేజీ తరువాయి)

సమస్యలు తలెత్తినప్పుడు వాటిని గుర్తించి పరిష్కరించేందుకు సమయం పడుతోంది. దాన్ని అధిగమించేందుకు టీజీఎస్పీడీసీఎల్ ఫీడర్ మేనేజ్‌మెంట్ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందిస్తోంది. తరచూ సమస్యలు తలెత్తే ఫీడర్లు, పరిష్కారానికి తీసుకున్న చర్యలు, చేసిన ఖర్చు, ఏ ఫీడర్ పరిధి ఎన్ని కిలోమీటర్లు ఉంది తదితర వివరాలన్నింటినీ ఏఈల బృందం ఫొటోలతో సహా యాప్‌లో అప్‌లోడ్ చేయనుంది. ఆ వివరాలను బట్టి భవిష్యత్‌లో ఆయా ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే యాప్ సేవల ట్రయల్‌రన్ మొదలైంది.

నష్టాలు, అనవసరపు ఖర్చుల తగ్గింపుపై దృష్టి

విద్యుత్ సరఫరా నష్టాలతో పాటు అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ ప్రయత్నిస్తున్నారు. గతంలో యాప్ వంటి సేవలు డెవలప్ చేయాలంటే రూ.కోట్లు చెల్లించి ప్రైవేట్ ఏజెన్సీలతో నివేదికలు తయారుచేయించేవారు. అలాంటి పనులను ఇకపై విద్యుత్ సంస్థల ఇంజనీర్లు, ఐటీ వింగ్ అధికారుల భాగస్వామ్యంతో చేపట్టనున్నారు. విద్యుత్ సంస్థలోని ఐటీ నిపుణుల సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని కొత్త ప్రాజెక్టులకు రూపకల్పనలు చేస్తున్నారు.

మెట్రోరైలు నిర్వహణలో అవాంతరాలుండొద్దు

(5వ పేజీ తరువాయి)

పెరిగిన చెట్టుకొమ్మలను తొలగించాలి.

- మెట్రో వయాడక్ట్ పక్కనే ఉన్న చెట్లను క్రమం తప్పకుండా కత్తిరించాలి. ప్లాట్‌ఫాంలపై నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు తొలగించేందుకు హౌస్‌కీపింగ్ సిబ్బందిని అదనంగా నియమించాలి.
- మెట్రో వయాడక్ట్ సమీపంలోని ప్రకటన బోర్డుల నుంచి ఫ్లెక్సీలను తొలగించాలి. విద్యుత్ అమరికలపై వదులుగా ఉండేటట్లు బోల్ట్‌లను బిగించాలి. ఈదురుగాలుల కారణంగా స్టేషన్ పైకప్పు షీట్లు పడిపోకుండా ఉండేందుకు గట్టిగా బిగించాలి.
- మెట్రో ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్ల వద్ద నీరు నిల్వకుండా చూడాలి.
- రైలు ఎక్కుతున్నప్పుడు, దిగుతున్నప్పుడు ప్రయాణికులను అప్రమత్తం చేయాలి. ఇటీవల ఢిల్లీ మెట్రోరైలులో మహిళ చీర డోర్ల మధ్య ఇరుక్కుపోవడంతో ప్రమాదవశాత్తు ఆమె మరణించిందని గుర్తు చేశారు.
- రైళ్లలో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు మహిళలు, యువతులు చీర అంచులు, దుపట్టాలు, బ్యాగ్ పట్టీలతో జాగ్రత్తగా చూసుకోవాలి.

ముగిసిన పీజీఈసెట్.. 90.82 శాతం హాజరు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పోస్ట్‌గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పీజీఈసెట్) పరీక్షలు గురువారంతో ముగిశాయి. హైదరాబాద్, వరంగల్ రీజియన్‌లలో ఏర్పాటు చేసిన 15 కేంద్రాల్లో పీజీఈసెట్ పరీక్షలు నిర్వహించారు. పీజీఈసెట్‌కు మొత్తం 22,712 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 20,626 మంది(90.83 శాతం) అభ్యర్థులు హాజరైనట్లు సెట్ కన్వీనర్ డాక్టర్ ఎ.అరుణ కుమారి తెలిపారు. కాగా, పీజీఈసెట్ ఫలితాలను ఈ నెల 23లోగా విడుదల చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల కోసం జిల్లాలోని ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హైదరాబాద్ జిల్లా గిరిజనాభివృద్ధి విభాగం అధికారి కోటాజీ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించరాదని, స్టడీసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్, సూచనలు స్టడీసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ లేదా టీడబ్ల్యూడీ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయని, మరిన్ని వివరాలకు 62817 66534లో సంప్రదించాలని సూచించారు.

ఎన్ఐఐఎంహెచ్‌కు డబ్ల్యూహెచ్ఓ గుర్తింపు

సైదాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్ఐఐఎంహెచ్)కు సంప్రదాయ వైద్య పరిశోధనలో సహకార కేంద్రంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్ఓ) ప్రతిష్టాత్మక గుర్తింపు ఇచ్చింది. దేశంలోనే ఆయుర్వేద విభాగంలో ఎన్ఐఐఎంహెచ్‌ను మూడో సహకార కేంద్రంగా డబ్ల్యూహెచ్ఓ గుర్తించిందని, నాలుగు సంవత్సరాలు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. దీని ద్వారా సంప్రదాయ వైద్యం, పరిశోధన పద్ధతులను అభివృద్ధి చేయడంలో డబ్ల్యూహెచ్ఓ సభ్య దేశాలకు మద్దతు ఇస్తుంది. ఈ కార్యక్రమానికి సీసీఆర్ఏఎస్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వైద్య రబీ నారాయణ ఆచార్య నాయకత్వం వహిస్తుండగా డాక్టర్ గోలి పెంచలప్రసాద్, డాక్టర్ సాకేత్‌రామ్, డాక్టర్ సంతోష్ మానే పరిశోధన బృందం సమన్వయం చేస్తారు.

19, 20 తేదీల్లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జూన్ 19, 20 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ తెలిపారు. ఖమ్మం బైపాస్ రోడ్ ఉషాహరి కన్వెన్షన్‌లో 19న ఉదయం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మహాసభలను ప్రారంభిస్తారని, అతిథులుగా వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. 20న సాయంత్రం ముగింపుసభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

హైటెక్స్‌లో ప్రారంభమైన ఫుడ్ ఎ'ఫెయిర్'

● మూడు రోజులపాటు బీ2బీ ప్రదర్శన



ఫుడ్ ఎ'ఫెయిర్'ను ప్రారంభిస్తున్న గోపీచంద్

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్‌తో పాటుగా డెయిరీ, ఆర్గానిక్ ఆహార రంగంలో వస్తోన్న విప్లవాత్మక మార్పుల గురించి చర్చిస్తూనే, సరికొత్త ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఫుడ్ ఎ'ఫెయిర్' పేరిట ఒక ప్రదర్శనను బ్లిట్జ్ ఎగ్జిబిషన్స్ నిర్వహిస్తోంది. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఫెయిర్‌ను బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో కలిసి తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ(టీఎఫ్‌పీఎస్) డైరెక్టర్ అఖిల్ గవార్ గురువారం ప్రారంభించారు. ప్రధానంగా మొక్కల ఆధారిత ప్రొటీన్, తృణధాన్యాలు వంటి వాటిపై దృష్టి సారించి రూపొందించిన ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ చాలా అవసరమని, ఇటీవల ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మోడ్రన్ ట్రేడ్ ఫుడ్, బేవరేజెస్, సంబంధిత రంగాల్లోని రిటైల్, హోల్‌సేలర్ల మధ్య అంతరాన్ని పూరించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ట్రేడ్ ఎ'ఫెయిర్'లో ఫుడ్, బేవరేజెస్ రంగాల్లోని పలు సుప్రసిద్ధ సంస్థలతో పాటుగా స్వయం సహాయక బృందాలు కూడా పాల్గొన్నాయి.

కాఫీ మిషన్‌లోనే జ్యూస్

కాఫీ వెండింగ్ మిషన్‌లో టీ వస్తుందా.. కష్టమే! కాఫీ మిషన్‌లోనే జ్యూస్ కూడా వస్తుందా అంటే, మీరు కోరుకుంటే వస్తుందంటోంది నాలా రోబోటిక్స్ సంస్థ. కృత్రిమ మేధస్సు, మిషన్ లెర్నింగ్ వంటి వాటిని వినియోగించుకుని తీర్చిదిద్దిన ఈ రోబోలు కిచెన్ స్వరూపాన్నే మార్చేస్తుందంటున్నారు ఆ సంస్థ ప్రతినిధులు.



తినేముందు ఒక్క బిళ్ల చాలు..!

మధుమేహం వచ్చిన వారి కోసమే మోడరేట్ అంటూ ట్యాబ్లెట్స్‌ను విడుదల చేసింది మోడరేట్ ఐఎన్‌యూ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్. షుగర్, కార్బ్స్, కేలరీ కట్టర్‌గా తోడ్పడే న్యూట్రాసిటికల్ ఇదని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. భోజనం చేసే ముందు ఒక్క ట్యాబ్లెట్ చాలంటున్నారు.

'ఫ్రైడ్ ఇండియా'లో నిర్మాణాల కూల్చివేత

(5వ పేజీ తరువాయి)

కేసులు నమోదు చేశారు. అధికారులు కూల్చిన కొద్దిరోజులకే మళ్లీ అక్కడ నిర్మాణాలు వెలుస్తున్నాయి. 2016, 2019, 2021 సంవత్సరాల్లో మళ్లీ 2024 ఏప్రిల్‌లో కూల్చివేతలు నిర్వహించారు. తాజాగా మరో 50కి పైగా నిర్మాణాలు జరిగాయి. వీటితో పాటు రోడ్డుపై మసీదు నిర్మించారు. అధికారుల దృష్టికి వెళ్లడంతో రెండు రోజుల క్రితం జీహెచ్ఎంసీ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ నిర్మాణాలు చేయవద్దని తెలిపారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీసు అధికారులు గురువారం పెద్దఎత్తున ఎక్స్‌కవేటర్లతో వచ్చి ఇళ్లను కూల్చివేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నర్సరీ ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేశారు. కూల్చివేతలను పలువురు యజమానులు అడ్డుకున్నారు. లక్షలాది రూపాయలు పెట్టి స్థలాలు కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, కొన్నస్థలంలో ఇళ్లను నిర్మిస్తే ఎందుకు కూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డున పడ్డ కొనుగోలుదారులు

ఈ వెంచర్ ద్వారా కంపెనీ వందల కోట్లు వెనకేసుకోగా, కొనుగోలు చేసిన వారు రోడ్డున పడ్డారు. నకిలీ పత్రాలతో అప్పట్లో కంపెనీ ప్లాట్లను విక్రయించింది. గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సుమారు 200 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయంపై పత్రికల్లో కథనాలు రావడంతో పాటు కొందరు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. కూల్చివేతలు జరిగిన ప్రతీసారి కొన్ని నెలల అనంతరం కంపెనీ వారు ఇక్కడ తిష్టవేసి మిగిలిన ప్లాట్ల విక్రయాలను సాగిస్తుంటారు.

కంపెనీపై ఫిర్యాదు చేయాలని నిర్ణయం

ప్లాట్ల కొనుగోలుదారులు గురువారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మోసం చేసి ప్లాట్లను విక్రయించిన ఫ్రైడ్ ఇండియా కంపెనీపై ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఐదేళ్ల క్రితం ప్లాట్లను కొనుగోలు చేశామని, నిర్మాణాలు చేస్తుంటే ఎఫ్‌టీఎల్ అని కూల్చివేస్తున్నారని, ఎఫ్‌టీఎల్ అయితే రిజిస్ట్రేషన్ ఎలా చేశారని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

మసీదు నిర్మాణంపై ప్రజావాణిలో ఫిర్యాదు

వెంచర్‌లోని వంద అడుగుల రోడ్డులో కంపెనీ ప్రతినిధులు ఇటీవల మసీదును నిర్మించారు. దీనికి సమీపంలో మాతాజీనగర్ బస్తీవాసుల ఆలయం ఉంది. మసీదుతో పాటు ఎఫ్‌టీఎల్ స్థలంలోని నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో మాతాజీనగర్‌వాసులతో కలిసి బీజేపీ నేత నెమలి ఆనంద్ మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు బుధవారం రాత్రి మసీదు బోర్డులను తొలగించారు. గురువారం పెద్దఎత్తున కూల్చివేతలను చేపట్టారు. మరోసారి నిర్మాణాలు జరగకుండా ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని నర్సరీ బోర్డు ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 14 జూన్ 2024



సందేశం

త్యాగానికి ప్రతిరూపం బక్రీద్

బక్రీద్- ముస్లింలు జరుపుకొనే అతి పెద్ద పండుగ. ఇస్లాంలో త్యాగానికి ఒక ప్రత్యేకమైన స్థానముంది. ఈ పండుగ ఆ త్యాగానికి ఒక సూచికగా నిలుస్తుంది. అందుకే ఇద్ అల్ అదా అంటే- త్యాగం సందర్భంగా చేసుకొనే విందు అని అర్థం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు అందరూ ఈ పండుగ జరుపుకోవటం వెనక కదిలించే ఒక కథ ఉంది.

ఇస్లాం సంప్రదాయం ప్రకారం- సుమారు నాలుగు వేల సంవత్సరాల క్రితం మక్కా వ్యాలీ (ప్రస్తుతం సౌదీ అరేబియా) ప్రాంతమంతా కొండలతో కూడిన ఎడారిగా ఉండేది. అల్లా తన భక్తుడైన అబ్రహంకు తనపై ఉన్న నమ్మకాన్ని పరీక్షించాలనుకున్నాడు. అబ్రహంను, అతని భార్య హిజార్‌ను, కొడుకు ఇస్మాయిల్‌ను మక్కా ప్రాంతానికి వెళ్లి- అక్కడ భార్య, కొడుకులను వదిలేసి రమ్మని ఆదేశించాడు. అబ్రహం అల్లా ఆజ్ఞ ప్రకారం మక్కా వ్యాలీకి వెళ్లి అక్కడ వారిని వదిలేసి వచ్చాడు. వారికి కొన్ని రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, నీళ్లు వదిలి- బరువైన గుండెతో తన స్వస్థలం కానాన్‌కు తిరిగి వెళ్లిపోయాడు. రోజులు గడిచాయి. ఆహారపదార్థాలు, నీళ్లు అయిపోయాయి. దీనితో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో హిజార్ తమను రక్షించమని అల్లాను ప్రార్థించింది. ఊహించని విధంగా ఒక అద్భుతం జరిగింది. ఇస్మాయిల్ కాళ్ల దగ్గర నుంచి ఒక నీటి ప్రవాహం ఉవ్వెత్తున ఎగసింది. దీనితో వారి కష్టాలు తీరిపోయాయి. ఇలా కొన్నేళ్లు సాగిన తర్వాత- అబ్రహంను మక్కా వ్యాలీకి వెళ్లమని.. అక్కడ ఒక ప్రార్థనా మందిరాన్ని నిర్మించమని అల్లా ఆజ్ఞాపించాడు. అబ్రహం, ఇస్మాయిల్ - కాబా ప్రాంతంలో ఒక ప్రార్థనా మందిరాన్ని నిర్మించారు. అయితే దీని నిర్మాణం కూడా అంత సులభంగా జరగలేదు. ఈ మందిరాన్ని నిర్మించకుండా సైతాన్ అడ్డుపడ్డాడు. అప్పుడు ఇస్మాయిల్ ఆ సైతాన్‌ను గులకరాళ్లు విసరటం ద్వారా తరిమేశాడు. ఈ రోజుకు ఇస్లాంలో సైతాన్‌ను తరిమివేయటానికి గులకరాళ్లను విసరటం ఒక ప్రధానమైన ఘట్టం.

మరో పరీక్ష..

అబ్రహంకు 99 ఏళ్లు వచ్చాయి. ఆ సమయంలో అల్లా - ఇస్మాయిల్‌ను బలి ఇవ్వమని - మరో పరీక్ష పెట్టాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకును బలి ఇవ్వటానికి ఏ తండ్రికి మనసు ఒప్పుతుంది? కానీ అబ్రహం మాత్రం ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఇస్మాయిల్‌ను బలి ఇవ్వటానికి నిర్ణయించుకున్నాడు. అయితే బలి కావటానికి ఇస్మాయిల్ అంగీకారం కూడా అవసరమే కదా! ఎందుకంటే- అల్లా పట్ల ఇస్మాయిల్‌కు ఉన్న నమ్మకానికి.. తన జీవితాన్ని త్యాగం చేయటానికి అంగీకరించటానికి ఇది ఆఖరి పరీక్ష. ఇస్మాయిల్‌కు బలి విషయం చెప్పినప్పుడు అతను ఏ మాత్రం వెనకడుగు వేయలేదు. "అల్లా నీకు ఇచ్చిన ఆజ్ఞ శిరోధార్యం. ఏ మాత్రం ఆలోచించకు" అని బలికి సిద్ధపడ్డాడు. అబ్రహం కత్తితో ఇస్మాయిల్ తల నరకటానికి ప్రయత్నించాడు. అక్కడ మరో అద్భుతం జరిగింది. ఇస్మాయిల్‌కు ఎటువంటి హాని జరగలేదు. కింద ఒక కొండ జంతువు తల పడి కనిపించింది.

అబ్రహం, ఇస్మాయిల్ - తమకు అల్లా పట్ల ఉన్న విశ్వాసాన్ని చాటుకోవడానికి బలికి సిద్ధపడి ప్రపంచానికి తెలియజేశారు. అయితే కరుణామయుడైన అల్లా తన భక్తులను శిక్షించడు. ఎప్పుడూ రక్షిస్తూనే ఉంటాడు. అయితే భక్తుల విశ్వాసం ఎంత ఉందో తెలుసుకోవటానికి పరీక్షలు పెడుతూనే ఉంటాడు. అబ్రహం, ఇస్మాయిల్‌లు- ఇస్లాం చరిత్రలో విశ్వాసానికి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తారు. వారి త్యాగానికి గుర్తుగా- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిములందరూ ఈ పండుగను జరుపుకుంటారు. దీనితో పాటు కొందరు- ఖురాన్ పూర్తయి.. మానవాళికి అందిన రోజుగా బక్రీద్‌ను భావించి పండుగ చేసుకుంటారు. అల్లాకు ప్రార్థనలు చేస్తారు.

(16న 'బక్రీద్')

నేను దేవుడి సర్వెంట్‌ని

వైద్యరంగంలో ప్రత్యేక పరిచయం అవసరం లేని పేరు... **డాక్టర్ ఎ.వి. గురవారెడ్డి**. కీళ్ళ వ్యాధుల శస్త్రచికిత్సా నిపుణుడు, కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ అయిన గురవారెడ్డి మంచి రచయిత కూడా. ఆయన 'నివేదన'తో తన ఆధ్యాత్మిక ఆలోచనలను పంచుకున్నారు.

మీ ఉద్దేశంలో దేవుడు ఎవరు?

ఒక సూపర్ నేచురల్ పవర్ ఉందనేది నా నమ్మకం. అది దేవుడా, మరొకటా అనేది నాకు తెలీదు. నేను దేవుడు లేడనే నాస్తికవాదిని కాను. అలాగని ప్రతి గుడికీ వెళ్ళడం, ఉపవాసాలు ఉండడం, మొక్కులు మొక్కుకోవడం లాంటి భక్తి నాకు లేదు. మనల్ని నడిపించే ఒక అతీతమైన శక్తి ఉందని నేను నమ్ముతాను. వృత్తిపరంగా... క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న పేషెంట్లకు ఆపరేషన్ చేసేటప్పుడు... ఆ పనిలో దేవుడు లేదా ఒక సూపర్ పవర్ నాకు సాయం చేస్తున్నారనేది నా నమ్మకం.



స్వానుభవం

ఆలయాలకు వెళ్తారా?

వెళ్తాను. కానీ నా అంతట నేను వెళ్ళను. ప్రతినెలా ఒక గుడి, ప్రతి శనివారం ఒక గుడి, ఆరునెలలకొకసారి తిరుపతి వెళ్ళేవారు ఉంటారు. నేను అలా లెక్క ప్రకారం వెళ్ళను. నా భార్య పుట్టినరోజు నాడో, లేదా మా కోడలు రమ్మన్నప్పుడో వాళ్ళతోపాటు వెళ్తాను. మా ఇంట్లో ప్రత్యేకంగా పూజ గది కూడా లేదు. ఒక అలమరాలో దేవుడి ఫొటోలు పెట్టుకుంటాం. నిలబడి, నమస్కారం పెట్టి... అగరుబత్తి వెలిగిస్తాం, అంతే! అలాగే దేవుడితో నాకు అనుభవాలనేవి కూడా ప్రత్యేకంగా ఏవీ లేవు. దేవుడు కలలోకి రావడం లాంటివేవీ లేవు. నేను 'మానవసేవే మాధవసేవ' అని నమ్ముతాను. 'నేను ఇంతమందికి మంచి చేస్తున్నాను, వీళ్ళందరూ నాకోసం ప్రార్థిస్తారు' అనేది నా విశ్వాసం.

మీ భారం వాళ్ళ మీద వేస్తున్నారా...

అంతేకదా! నా భారాన్ని నా పేషెంట్ల మీద వేస్తాను. పెద్దవారైతే ఆశీర్వదిస్తారు. మీరు ఇంకా ఎంతోమందికి సేవ చెయ్యాలంటారు. నా తరఫున వాళ్ళు ప్రార్థిస్తున్నారు. ఇందాక చెప్పినట్టు 'మానవసేవే మాధవసేవ' అని నాకు గట్టి నమ్మకం. నాకు చేతనైతే సేవ చేస్తాను. నాకు తెలిసి నేను ఏ ఒక్క వ్యక్తికీ చెడు చెయ్యలేదు. తెలియక చేసింది ఏదైనా ఉండొచ్చేమో... కాబట్టి దేవుడు నాకు మంచే చేస్తాడు. అదే నాకు గట్టి ధైర్యం, నమ్మకం. అందుకే 'ఐయామ్ బ్లెస్డ్' అని ఎప్పుడూ అంటూ ఉంటాను. ఆ ఆశీస్సులు అందించినది... దేవుడైనా కావచ్చు, మరే శక్తయినా కావచ్చు. మంచి జీవితం ఇచ్చాడు, మంచి కుటుంబాన్ని ఇచ్చాడు, మంచి స్నేహితులనిచ్చాడు, నలుగురికి సేవచేసే మార్గం ఇచ్చాడు. ఇవన్నీ కూడా నాకు దక్కిన దీవెనలే అనుకుంటాను. ఇవన్నీ అందరికీ ఉండవు కదా...

> **మీరు సైన్స్ స్టూడెంట్ కావడం కూడా మీ దృక్పథం మీద ప్రభావం చూపించిందా?**
>
> మీరన్నది నిజమే. కొంత సైన్స్ ప్రభావం కూడా ఉంది. వైద్యాన్నే తీసుకుంటే... ఈ వ్యాధికి ఈ మందు వేస్తే... అది తగ్గిందని నాకు తెలియాలి. ఆ ఎవిడెన్స్ మీదే మొత్తం వైద్యరంగం ఆధారపడి ఉంటుంది. మరి దేవుడు ఉన్నాడనడానికి ఎవిడెన్స్ ఎలా చూపించగలం? కానీ నేను రాముడున్నాడనుకుంటాను, కృష్ణుడు ఉన్నాడనుకుంటాను. దేవుడు ఉన్నాడనే అనుకుంటాను. ఇక బాబాల మీద నాకు నమ్మకం లేదు. కానీ వాళ్ళు చేసిన మంచిపనులను నమ్ముతాను. సత్యసాయిబాబా తన హిప్ జాయింట్ ఆపరేషన్ కోసం నన్ను పిలిపించుకున్నారు. ఉంగరాలు కూడా ఇచ్చారు. అనంతపురం మొత్తానికి నీటి సౌకర్యం కల్పించడం, ఆసుపత్రి కట్టించి రోగులకు సేవ లాంటివి చేశారు. ఆ మంచిపనులను నేను విశ్వసిస్తాను. వాటిని మెచ్చుకుంటాను.

మీ చిన్నప్పుడు ఇంట్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉండేదా?

ఉండేది. మా కులదైవం నరసింహస్వామి. మా నాన్న పెద్ద భక్తుడు. పూజలు ఎక్కువగా చేసేవారు. నా వరకూ వస్తే... విద్యార్థి దశలో కూడా నేనెప్పుడూ దేవుణ్ణి ఏదీ కోరుకోలేదు. దేవుణ్ణి అడగడం, కోరింది జరగకపోతే అలగడం... అలాంటివేవీ లేవు. మొదటినుంచి ఇప్పటివరకూ అదే కొనసాగుతోంది. దేవుడైనా, సూపర్ పవరైనా... మన పని మనం చేసుకుంటే... దాని పని అది చేసుకుంటుంది. నేను చెప్పేది ఒక్కటే... ఈ జీవితం ఒక నాటకరంగం. మనమందరం మన పాత్రలు పోషిస్తాం. దేవుడు స్క్రిప్ట్ రాస్తాడు. మనం నటిస్తాం. వెళ్ళిపోతాం. 'మనం ఏదో చేశాం, సాధించాం' అనుకోకూడదు. ఇదంతా ముందుగానే నిర్దేశించి ఉండే విషయం.

అంటే దేవుణ్ణి నమ్ముతున్నట్టే కదా...

ఒక పవర్‌ని నమ్ముతున్నాను. కానీ అందరూ దేవుడు అంటున్నదానికి నేను దేన్నీ ఆపాదించను. మొత్తం ప్రపంచంలో వివరణకు అందనివి జరుగుతూ ఉంటాయి. 'ఈ రోజు ఇంతమంది రోగులకు సేవచెయ్యి. ఇంతమందికి మోకాళ్ళ శస్త్రచికిత్సలు చెయ్యి' అని ఆయన స్క్రిప్ట్ రాశాడు. నేను చేస్తున్నాను. అందుకే ఏ అఛీవ్‌మెంట్ సాధించినా... ఇదంతా నా ఘనతేనని నేను అనుకోను. ఆయన రాశాడు, నేను చేశాను... అంతే.

వైద్యో నారాయణో హరిః అంటారు. మీ ద్వారా స్వస్థత పొందినవాళ్ళు మిమ్మల్ని దేవుడిలా చూస్తున్నపుడు మీకెలా అనిపిస్తుంది?

అలా అనేవాళ్ళు ఉంటారు. నేను అభ్యంతరం చెబుతూ ఉంటాను. "నేను దేవుణ్ణి కాదు. దేవుడి సర్వెంట్‌ని. దేవుడు మమ్మల్ని ఇక్కడికి పంపించాడు. మీ అందరికీ సాయం చెయ్యడానికి, సేవ చెయ్యడానికి. అలాగే వైద్యుల్ని దేవుళ్ళనీ అనుకోవద్దు, రాక్షసులనీ అనుకోవద్దు. మామూలు మనుషులని అనుకుంటే చాలు" అని చెబుతాను. విద్య నేర్చుకున్నాను. దాంతో ఉపయోగపడే పని చేసున్నాను. నా విద్య, నా అనుభవం, నేను తీసుకున్న శిక్షణతో... నాకు సముచితం అనిపించిన నిర్ణయం తీసుకుంటాను. ఇదంతా ఆ దేవుడు నా చేతుల మీదుగా చేయిస్తున్నాడని అనుకుంటాను. నేను చికిత్స చేస్తున్నాను, ఆయన నయం చేస్తాడు. కాబట్టి వైద్యంలో... నా వంతు నాది, ఆయన వంతు ఆయనది.

సమాజంలో భక్తి ప్రదర్శన ఇటీవల ఎక్కువయిందనే విమర్శను ఎలా చూడాలి?

ఇప్పుడు ఆధ్యాత్మికత, దేవుళ్ళు వ్యాపారంగా మారాయి. భక్తులకు డ్రెస్ కోడ్ లాంటివి కూడా ఎక్కువగానే చూస్తున్నాం. అలాగే ఫ్యాషన్ కూడా అయింది. దాంతో ఇది వరకటికన్నా భక్తికి ప్రదర్శన పెరిగింది. పూర్వం కుటుంబంతో గుడికి వెళ్ళి, కొబ్బరికాయ కొట్టి, బయటికి వచ్చేవాళ్ళు అక్కడితో అయిపోయేది. ఇప్పుడు అలా కాదు... ఏదైనా పండగ వచ్చినప్పుడు... వంద మంది ఫొటోలతో బ్యానర్లు ఎక్కడ చూసినా కనిపిస్తాయి. భక్తిని వ్యక్తీకరించే పద్ధతులు మారాయి.

మీ దృష్టిలో ఆధ్యాత్మికత అంటే...

ఆధ్యాత్మికత అంటే... ప్రపంచాన్ని యథాతథంగా స్వీకరించడం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్టు... ఫలితం మంచిదైనా, చెడుదైనా మన పని మనం చిత్తశుద్ధితో చెయ్యాలి. ఇది చేస్తే ఏం వస్తుందనేది ఆలోచించకుండా చెయ్యాలి. ఫలితం మన చేతుల్లో లేదు.

సంభాషణ: కృష్ణశర్మ

హరేకృష్ణ

తీపి దండన

ప్రపంచమంతటా నిర్వహించే దండన మహోత్సవం గురించి మీరు ఎప్పుడైనా విన్నారా? ప్రతి సంవత్సరం జూన్ నెలలో వచ్చే ఈ పండుగను బ్రహ్మ-మధ్వ-గౌడీయ సంప్రదాయాన్ని అనుసరించేవారందరూ కన్నులపండువగా జరుపుకొంటారు. ఈ సంప్రదాయానికే చెందిన... ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్‌లో కూడా ఈ ఉత్సవాన్ని 'పానిహటి చిడా-దహి దండన మహోత్సవం'గా నిర్వహిస్తారు. దండన అంటే అపరాధికి వేసే శిక్ష. మరి దాన్ని ఉత్సవంగా నిర్వహించుకోవడం ఏమిటి? ఈ వేడుక విశేషాలను తెలుసుకుంటే... ఆ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది.



20న 'చిడా-దహి మహోత్సవం'

ఈ ఉత్సవాన్ని మొట్టమొదటిసారిగా... అయిదువందల ఏళ్ళ క్రితం 1516లో... పశ్చిమ బెంగాల్‌లోని పానిహటి అనే ప్రదేశంలో... శ్రీచైతన్య మహాప్రభువుల కాలంలో నిర్వహించారు. వేలాది భక్తులకు అటుకులు (చిడా), పెరుగు (దహి)తో తయారు చేసిన మధురమైన పదార్థాలను అందజేశారు.

బ్రహ్మ-మధ్వ-గౌడీయసంప్రదాయంలో కృష్ణ నామ సంకీర్తన మార్గాన్ని విశేషంగా ప్రచారం చేసిన మహాభాగవతోత్తములైన ఆచార్యులు ఎందరో ఉన్నారు. వీరిలో 'షడ్గోస్వాములు'గా పిలిచే బృందావనంలోని ఆరుగురు స్వాములు... అత్యంత ప్రముఖులు. ఆకర్షణీయమైన లౌకిక భోగాలన్నిటినీ గులకరాళ్ళలా పరిగణించి, పరిత్యజించిన భక్తశిఖామణులు. బృందావనంలో కనుమరుగైపోయిన అనేకానేక పవిత్రస్థలాలను వెలికితీసి, కృష్ణతత్త్వాన్ని అద్భుతమైన తమ రచనలతో వారు లోకానికి అందించారు. వారిలో ఒకరైన శ్రీల రఘునాథ దాస గోస్వామి ఈ ఉత్సవానికి మూలకారకులు.

గొప్ప సంపన్నులైన జమీందారీ కుటుంబానికి చెందిన రఘునాథదాసుకు చిన్ననాటినుంచి శ్రీచైతన్య మహాప్రభువులన్నా, శ్రీకృష్ణుడన్నా అమితమైన ఇష్టం. అపారమైన సంపదలు ఉన్నప్పటికీ, వాటి మీద ఆయనకు ఆసక్తి ఉండేది కాదు. నామాచార్యులైన శ్రీల హరిదాస ఠాకూరును బాల్యంలో ఆయన కలుసుకున్నారు. కొంతకాలానికి. శ్రీచైతన్య మహాప్రభువు సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించిన తరువాత... శాంతిపూర్ గ్రామానికి వచ్చారు. అప్పుడు శ్రీచైతన్యులను దర్శించుకున్న రఘునాథదాసు... తన సర్వస్వాన్నీ మహాప్రభువు సేవకే అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ తరువాత జగన్నాథపురిలో శ్రీచైతన్యులను ఆశ్రయించడానికి అనేకమార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. ఒకరోజు... రఘునాథదాసు మనసులో ఒక ఆలోచన మెదిలింది. ముందుగా శ్రీనిత్యానంద ప్రభువును సందర్శిస్తే... చైతన్యులను చేరే మార్గం సుగమం అవుతుందని అనుకున్నారు.కొన్నాళ్ళకు పానిహటి గ్రామంలో శ్రీనిత్యానంద ప్రభువును రఘునాథదాసు దూరం నుంచి దర్శించుకున్నారు. ముందుగా గురువును ఆశ్రయించనందుకు రఘునాథదాసును నిత్యానందులు మందలిస్తూ "దొంగలా దూరంగా దాక్కున్న నీకు దండన విధిస్తున్నాను. ఇక్కడ భక్తులందరికీ అటుకులు, పెరుగుతో చేసిన మధుర పదార్థాలను వెంటనే వడ్డించు" అని ఆజ్ఞాపించారు. ఎంతో సంతోషించిన రఘునాథదాసు... పాలు, పెరుగు, అటుకులు, అరటిపండ్లు తదితరాలతో రుచికరమైన వంటకాలను సిద్ధం చేసి, భక్తులందరికీ వడ్డిస్తూ... మహా ఉత్సవాన్నే ఏర్పాటు చేశారు. సాక్షాత్తూ బలరాముడి అవతారస్వరూపంగా పేర్కొనే శ్రీనిత్యానంద రాములవారు తన భక్తుడికి వేసిన తీపి దండన ఇది. దేవదేవుని దండన సైతం ఎంత మధురంగా ఉంటుందో కదా! జీవుల పట్ల భగవంతుడికి ఉన్న అపారమైన కరుణకు ఇది నిదర్శనం.

తన భక్తిభావానికి అత్యంత ప్రసన్నులైన శ్రీనిత్యానందుల కృపతో... రఘునాథుడు తదనంతర కాలంలో శ్రీచైతన్య మహాప్రభువుల సంకీర్తనోద్యమ ప్రచారంలో ప్రథమస్థానంలో నిలిచారు. గోస్వామి స్థాయికి చేరారు. ఆనాటి తీపి దండనకు గుర్తుగా ఈ ఉత్సవాన్ని 'చిడా-దహి మహోత్సవం'గా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని ప్రతిఒక్కరూ కుటుంబంతో సులభంగా నిర్వహించుకోవచ్చు. అటుకులు, పాలు, పెరుగు, చక్కర లేదా బెల్లం, పండ్లను కలిపి వంటకాలు సిద్ధం చేసుకోవాలి. వాటిని స్వామికి నివేదించి, స్వీకరించడం ద్వారా భగవంతుడి ఆశీస్సులను పొందవచ్చు. మీకు సమీపంలోని హరేకృష్ణ మందిరంలో జరిగే ఈ ఉత్సవంలో కూడా తప్పక పాల్గొనండి. ముఖ్యంగా... 'హరేకృష్ణ' మంత్రాన్ని జపిస్తూ, ఆనందంగా జీవించండి.


శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

సద్బోధ

అడగాల్సింది ఆయననే

ఒక రాజ్యంలోని అడవిలో ఒక సన్న్యాసి ఆశ్రమం ఏర్పాటు చేసుకొని ఉండేవాడు. ఆయనను చాలామంది ప్రజలు దర్శించుకొనేవారు. వారిని చూసినప్పుడల్లా 'అయ్యో! వీరందరూ నా కోసం ఇక్కడికి వస్తున్నారు. అడవిలో ప్రయాణించి అలసిపోతున్న వీరికి నేను ఎలాంటి సదుపాయాలూ చేయలేకపోతున్నాను' అని ఆయన బాధపడేవాడు. కానీ వందల మందికి వసతి కల్పించే స్తోమత సన్న్యాసి అయిన అతనికెక్కడిదీ? కాబట్టి రాజ్యాన్ని పాలించే రాజు దగ్గరకు వెళ్ళి... సహాయం కోరాలనుకున్నాడు.

ఆ సన్న్యాసి ఒక రోజు... రాజ మందిరానికి వచ్చాడు. సాధువులకు, సన్న్యాసులకు ఆ చక్రవర్తి మందిర ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉండేవి. ద్వారపాలకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆ సమయంలో ఆ రాజు తన ధ్యానమందిరంలో ప్రార్థన చేస్తున్నాడు. సన్న్యాసిని ద్వారపాలకులు అక్కడికి తీసుకువెళ్ళి, ఆసనం మీద కూర్చోబెట్టారు.

"ఓ దైవమా! నాకు ధనాన్ని ఇవ్వు. సంపదను అనుగ్రహించు" అంటూ దేవుణ్ణి ఆ రాజు వేడుకోవడం ఆ సన్న్యాసికి వినిపించింది. వెంటనే కుర్చీలోంచి లేచాడు.



ఆ శబ్దానికి వెనక్కి తిరిగిన రాజు... ఆయనను కూర్చోమని సైగ చేశాడు. ప్రార్థన ముగించుకొని సన్న్యాసి దగ్గరకు వచ్చి "మీరు నన్ను కలుసుకోవడానికి వచ్చారు. కానీ నాతో ఒక్క మాట మాట్లాడకుండా తిరిగి వెళ్ళిపోతున్నారు. ఇంతకీ మీకు ఏం కావాలి?" అని అడిగాడు.

"ప్రభూ! ఆ సంగతి చెప్పి మిమ్మల్ని ఇబ్బంది పెట్టదలచుకోలేదు. నేను బయలుదేరుతున్నాను" అన్నాడు సన్న్యాసి.

"కాదు. మీరు చెప్పి తీరాల్సిందే" అని బలవంతపెట్టాడు రాజు.

"చాలామంది జనం నా ఆశ్రమానికి వస్తూ ఉంటారు. వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించలేకపోతున్నాను. అందుకని మిమ్మల్ని డబ్బు అడగడానికి ఇక్కడికి వచ్చాను" అని చెప్పాడు సన్న్యాసి.

"మరి నన్ను అడగకుండానే వెళ్ళిపోతున్నారేం?" అని ప్రశ్నించాడు రాజు.

"నేను మిమ్మల్ని యాచించడం కోసం వచ్చాను. మీరు కూడా యాచకుడేనని తెలుసుకున్నాను. మీరు డబ్బు కోసం, సంపదల కోసం దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు. అప్పుడు నాకు అనిపించింది... ఒక యాచకుణ్ణి నేనెందుకు యాచించాలి? నేరుగా ఆ భగవంతుణ్ణే యాచిస్తే సరిపోతుంది కదా!" అని చెబుతూ బయటకు నడిచాడు.

ఒక సందర్భంలో... రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ... "పేదవారు తమ ఇబ్బందులు తీరాలని కోరుకుంటారు. సంపన్నులు ఇంకా సంపద కావాలని తపిస్తారు. దానికోసం ఇరువురూ దేవుణ్ణి రకరకాలుగా ప్రార్థిస్తారు. సర్వప్రాణులకూ పోషకుడు ఆ భగవంతుడే. మన కర్మను మనం ఆచరిస్తూ, ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తే మనకు కావలసినవన్నీ ఆయనే ఇస్తాడు. కాబట్టి మనకు ఏది కావలసినా కోరాల్సిందీ, ప్రార్థించాల్సినదీ ఆయననే" అని ఉపదేశించారు.

సుభాషితం

విద్యతోనే వినయం

యదా కించిద్‌జ్ఞోహం ద్విప ఇవ మదాంధః సమభవం
తదా సర్వజ్ఞోస్మీత్యభవ దవలిప్తం మమ మనః
యదా కించిత్కించిద్బుధజన సకాశాదవగతం
తదా మూర్ఖోస్మీతి జ్వర ఇవ మదో మే వ్యపగతః

విద్యతోనే వినయం వస్తుందని వివరిస్తూ భర్తృహరి తన నీతిశతకంలో చెప్పిన ఈ శ్లోకాన్ని...

తెలివి యొకింత లేని యెడ దృప్తుడనై కరి భంగి సర్వమున్
దెలిసితి నంచు గర్వితమతిన్ విహరించితి దొల్లి, యిప్పుడు
జ్వలమతులైన పండితుల సన్నిధి నించుక బోధశాలినై
తెలియనివాడనై మెలంగితిన్, గతమయ్యె నితాంత గర్వమున్...

అంటూ తెలుగులోకి అనువదించారు ఏనుగు లక్ష్మణకవి.

భావం! నాకు స్వల్పమైన జ్ఞానం ఉన్నప్పుడు... అంతా నాకే తెలుసనే గర్వంతో మదించిన ఏనుగులా కన్నూ మిన్నూ కానకుండా ప్రవర్తించాను. ఆ తరువాత పండితుల సన్నిధిలో... వాళ్ళు చెప్పినవి వింటూ ఉంటే కొంచెం కొంచెంగా అన్నీ తెలిసి వచ్చాయి. అప్పుడు నాకేదీ తెలియదని తెలుసుకున్నాను. నా గర్వాన్ని వదిలిపెట్టాను. ఏదీ తెలియనివాడిలా మెలిగాను. వివేకవంతుణ్ణి అయ్యాను" అంటున్నాడు భర్తృహరి. విద్యతో వినయాన్ని పెంచుకోవాలి. మిడిమిడి జ్ఞానంతో అహంకారంగా ప్రవర్తించకూడదు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 14 జూన్ 2024
cinema@andhrajyothy.com

'అన్నదమ్ముల అనుబంధం అంటే ఇదే' అన్నారు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వేదికపై చిరంజీవితో ప్రధాని మోదీ ఆత్మీయంగా ముచ్చటించిన సంఘటన ఎంతోమందిని ఆకర్షించిన విషయం తెలిసిందే. 'ఆ హడావిడి సమయంలో అంత ఆసక్తిగా ఆయన చిరుతో ఏం మాట్లాడి ఉంటారబ్బా' అని జనాలు అనుకున్నారు. ఆ సంఘటనపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఎన్నికల్లో ఘన విజయం తర్వాత పవన్ కల్యాణ్ చిరంజీవి ఇంటికి వెళ్లారు. ఆ సందర్భంలో అన్నయ్య కాళ్లకు పవన్ కల్యాణ్ నమస్కరించడం, సంతోషంతో నాగేంద్రబాబు కళ్లు చెమర్చడం, కుటుంబ సభ్యులంతా పవన్ విజయాన్ని తమ గెలుపుగా భావించి ఒక్కచోట చేరి సంబరాలు చేసుకోవడం అందరినీ ఆకట్టుకున్నాయి. ఆ ఘటన తాలూకు వీడియోను తాను చూసినట్లు మోదీ ఆ రోజు చిరంజీవికి చెప్పారట. 'మీ అన్నదమ్ముల అనుబంధం నన్ను భావోద్వేగానికి గురి చేసింది. మన సంస్కృతి సంప్రదాయాలు, కుటుంబ విలువలకు ఆ సంఘటన అద్దం పట్టిందని ప్రశంసించారట. అలాంటి మధుర క్షణాలు అన్నదమ్ములందరికీ ఆదర్శంగా నిలుస్తాయి అని ప్రధాని మోదీ చెప్పటం నాకెంతో ఆనందం కలిగించింది అని చిరంజీవి పేర్కొన్నారు.

'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం'



ప్రేమ కథల్లో ఎక్కువగా నటించే సుధీర్‌బాబు.. రూటు మార్చి నటించిన కంప్లీట్ యాక్షన్ ప్యాక్‌డ్ చిత్రం 'హరోం హర'. ఈ చిత్రానికి జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించగా, సుమంత్.జి.నాయుడు నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు.

"హరోంహర' సరికొత్తగా చేసిన కమర్షియల్ సినిమా. ప్రేక్షకులకు ఈ కథా నేపథ్యం, మాటలు, సన్నివేశాలు కొత్త ప్రపంచాన్ని చూసిన అనుభూతిని ఇస్తాయి. నా దృష్టిలో కమర్షియల్ సినిమాల్లో కథ హీరో నుంచి మొదలైతేనే బాగుంటుంది. ఈ సినిమాను 'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం' అనొచ్చు. ఇందులో నేను పోషించిన సుబ్రమణ్యం పాత్ర అన్ని వర్గాల ప్రేక్షకులకి నచ్చుతుంది. ఇప్పటివరకూ తెలుగులో వచ్చిన పది ఉత్తమ యాక్షన్ చిత్రాల్లో 'హరోం హర' ఒకటిగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. చాలా రోజుల తర్వాత కమెడియన్ సునీల్ ఈ సినిమాలో గుర్తుండిపోయే పాత్ర చేశారు. హీరోయిన్ మాళవిక శర్మ తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది. చేతన్ భరద్వాజ్ ఇచ్చిన సంగీతం థియేటర్స్ నుంచి బయటకు వచ్చాక కూడా ప్రేక్షకులని వెంటాడుతుంది" అని చెప్పారు.

ముందుగానే దేవర రాక



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దేవర'. గురువారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రంలో తొలి భాగం 'దేవర: పార్ట్ 1'ను అక్టోబర్ 10న విడుదల చేస్తున్నట్లు గతంలో చిత్రబృందం ప్రకటించింది. అయితే ఇప్పుడు విడుదల తేదీ ముందుకు మారింది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు గురువారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఎన్టీఆర్ మాస్ లుక్‌లో కనిపించారు. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, నరైన్ కీలకపాత్రలు పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

రేవ్‌పార్టీ కేసులో నటి హేమకు బెయిల్



బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్ట్ అయి జైలు జీవితం గడుపుతున్న నటి హేమకు ఊరట లభించింది. బుధవారం ఆమెకు బెయిల్ లభించింది. రేవ్ పార్టీలో డ్రగ్స్ వాడకంపై బెంగళూరు ఎన్‌డీపీఎస్ కోర్టులో విచారణ జరిగింది. 'హేమ డ్రగ్స్ వాడినట్లు పోలీసులు ఎలాంటి సాక్ష్యాలు న్యాయస్థానానికి సమర్పించలేదు' అని ఆమె తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. 'హేమపై ఆరోపణలు వచ్చిన పది రోజుల తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించారని, ఆమెకు నెగెటివ్ వచ్చిందని, ఆమె వద్ద ఎలాంటి డ్రగ్స్ లభించలేదు అని న్యాయవాది కోర్టుకు నివేదించారు. సీసీబీ (బెంగళూరు నేర నియంత్రణ దళం) న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ, 'హేమ మరికొంత మంది టాలీవుడ్ సినీ ప్రముఖులను ఈ పార్టీకి తరలించే ప్రయత్నం చేశారు, నోటీసులు పంపినా అనారోగ్య కారణాలను సాకుగా చూపి విచారణకు హాజరుకాలేదు, అందువల్లే ఆమెను అరెస్ట్ చేయాల్సి వచ్చింది' అని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి 'హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఆమె ఏ క్షణంలోనైనా విడుదలయ్యే అవకాశాలున్నాయి. అరెస్ట్ తర్వాత తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ హేమ సభ్యత్వాన్ని రద్దు చేసింది.

ఇది సినిమా కాదు జీవితం



అజయ్‌ఘోష్, చాందినీ చౌదరి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. శివ పాలడుగు దర్శకత్వం వహించగా, జీ.హర్ష, జీ.రంగారావు నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజయ్‌ఘోష్ మాట్లాడుతూ "జీవితంలో ఏదో సాధించాలని అనుకునే వారికి.. ఏదో సాధించాలనుకొని ఆగిపోయిన వారికీ ఈ సినిమా విపరీతంగా కనెక్ట్ అవుతుంది. ఇది సినిమా కాదు జీవితం" అని అన్నారు. "కల కనడానికి వయసు అడ్డంకి కాదని నిరూపించే చిత్రమిది" అని చాందినీ చౌదరి చెప్పారు.



ఈ ప్రశంసలు ఊహించలేదు



వంశీ జొన్నలగడ్డ దర్శకత్వంలో నూతన నటీనటులతో రూపొందిన చిత్రం 'నీ దారే నీ కథ'. ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, వేద్, అంజన బాలాజీ ప్రధాన పాత్రల్లో నటించారు. వంశీ జొన్నలగడ్డ, తేజేష్ వీర, శైలజ జొన్నలగడ్డ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీమియర్ షో ఏర్పాటు చేశారు. ఈ షో ముగిశాక డైరెక్టర్ వంశీ మాట్లాడుతూ "సంగీతంలో అనుకున్నది సాధించడం కోసం నలుగురు యువకులు చేసే ప్రయత్నాల్ని అందర్నీ ఆకట్టుకునేలా, ఎంతో ఆసక్తికరంగా చూపించారని.. ప్రీమియర్‌లో సినిమాను చూసిన ప్రేక్షకులందరూ ప్రశంసిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అందరూ సినిమాను ఇంతగా ఆదరిస్తారని అస్సలు ఊహించలేదు. థియేటర్లలోనూ ప్రేక్షకులు ఇదే విధంగా సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నాను" అని అన్నారు.

బాలల పోరాటం



చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వంలో కేపీ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'బాలతేజం'. దిలీప్ రాథోడ్, ఇరిగే రమేష్, హీరోయిన్‌లుగా అరవింద, షన్ను, చెన్నకేశవ నాయుడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గురువారం ఈ సినిమా షూటింగ్ కూకట్‌పల్లి-ఆల్విన్ కాలనీలో ప్రారంభమైంది. డ్రగ్స్ సరఫరా చేసి యువతను నిర్వీర్యం చేస్తున్న ముఠాపై బాలలు చేసిన పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా సినిమా ఉంటుందని డైరెక్టర్ చిత్తజల్లు ప్రసాద్ తెలిపారు.

మాజీ ప్రేమికుల కథ



అడివి శేష్, శ్రుతి హాసన్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'డెకాయిట్'. షానీల్ డియో దర్శకత్వం వహిస్తుండగా, సుప్రియ ఆర్లగడ్డ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమాలోని కీలక షెడ్యూల్ షూటింగ్ హీరో హీరోయిన్లపై జరుగుతోంది. ఈ సందర్భంగా హీరో అడివి శేష్‌తో తీసుకున్న సెల్ఫీని శ్రుతి హాసన్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. కాగా, ఇద్దరు మాజీ ప్రేమికులు.. తమ జీవితాల్ని మార్చుకోవడానికి ఓ దోపిడీ కోసం ఎలా ఒక్కటయ్యారనేది 'డెకాయిట్' సినిమా కథని మేకర్స్ తెలిపారు.

అందాల రాక్సీ వచ్చింది

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలుగా నటిస్తున్నారు. గురువారం దిశా పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె రాక్సీ అనే పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. ట్రైలర్‌లో పోరాట ఘట్టాల్లో మెరిసిన దిశా ఈ పోస్టర్‌లో సైతం పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.


అదానీ గూటికి పెన్నా సిమెంట్

డీల్ విలువ రూ.10,422 కోట్లు

100% వాటా కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్

దక్షిణ భారత మార్కెట్‌పై మరింత పట్టు

శ్రీలంక మార్కెట్లోకి ప్రవేశం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశ సిమెంట్ రంగంలో మరో భారీ కొనుగోలు చోటు చేసుకుంది. అదానీ గ్రూప్ సిమెంట్ కంపెనీ అంబుజా సిమెంట్.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (పీసీఐఎల్)ను కొనుగోలు చేసింది. పెన్నా సిమెంట్ ప్రధాన ప్రమోటర్ పీ ప్రతాప్ రెడ్డి, అతని కుటుంబ సభ్యుల నుంచి 100 శాతం వాటాలను రూ.10,422 కోట్ల ఎంటర్‌ప్రైజ్ వాల్యూకి (అప్పులు, నగదు నిల్వలతో కలిపి) చేజిక్కించుకున్నట్లు అంబుజా సిమెంట్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఈ మేరకు పెన్నా సిమెంట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది.

నాలుగు నెలల్లో డీల్ పూర్తి: ప్రభుత్వ, రెగ్యులేటరీ సంస్థల నుంచి వెంటనే అనుమతులు లభిస్తే మూడు నుంచి నాలుగు నెలల్లోనే ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని అంబుజా సిమెంట్ సీఈఓ, హోల్‌టైమ్ డైరెక్టర్ అజయ్ కపూర్ వెల్లడించారు. ఈ కొనుగోలుకు అవసరమైన నిధులను పూర్తిగా అంతర్గత వనరుల నుంచి సమకూర్చుకోనున్నట్లు ఆయన తెలిపారు. కాగా పెన్నా సిమెంట్ కొనుగోలుతో అదానీ గ్రూప్ వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం మరో 1.4 కోట్ల టన్నులు పెరిగి మొత్తం 8.9 కోట్ల టన్నులకు చేరనుంది. ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్ తర్వాత దేశంలో మరే సిమెంట్ కంపెనీకి ఇంత ఉత్పత్తి సామర్థ్యం లేదు. దక్షిణాది మార్కెట్లో వాటాను పెంచుకునేందుకు పీసీఐఎల్ కొనుగోలు ఎంతగానో దోహదపడటమే కాకుండా దేశవ్యాప్తంగా సిమెంట్ రంగంలో అగ్రస్థానాన్ని దక్కించుకునేందుకు మార్గం సుగమం కానుందని కపూర్ తెలిపారు.

4 రాష్ట్రాల్లో పెన్నా సిమెంట్ యూనిట్లు: 1991లో కార్యకలాపాలు ప్రారంభించిన పెన్నా సిమెంట్.. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని తలారిచెరువు, బోయరెడ్డిపల్లి, తెలంగాణలోని గణేశ్‌పహడ్, తాండూరు, మహారాష్ట్రలోని పటాస్ వద్ద సిమెంట్, క్లింకర్ యూనిట్లను నిర్వహిస్తోంది. మరోవైపు శ్రీలంకలో నేరుగా, స్థానిక అనుబంధ సంస్థ ద్వారా పెన్నా సిమెంట్ కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ ప్లాంట్ల వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం కోటి టన్నులుగా ఉంది. పెన్నా సిమెంట్‌కు చెందిన ప్లాంట్లలో ఎక్కువ భాగం రైల్వే లైన్లకు సమీపంలో ఉన్నాయి. కాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం వద్ద ఏటా 20 లక్షల టన్నుల సామర్థ్యం గల ప్లాంట్‌తో పాటు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వద్ద ఏటా 20 లక్షల టన్నుల సామర్థ్యంతో కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. వచ్చే ఆరు నుంచి 12 నెలల కాలంలో ఈ ప్లాంట్లు వాణిజ్యపరంగా అందుబాటులోకి రానున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పెన్నా సిమెంట్ కన్సాలిడేటెడ్ టర్నోవర్ రూ.1,241 కోట్లుగా ఉంది.

మార్కెట్‌పై మరింత పట్టు: పెన్నా సిమెంట్ కొనుగోలుతో దక్షిణ భారత మార్కెట్లో అదానీ గ్రూప్ వాటా 8 శాతానికి పెరగనుంది. దేశవ్యాప్తంగా చూసినా మార్కెట్ వాటా 2 శాతానికి పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు పెన్నా సిమెంట్‌కు మంచి సున్నపురాయి గనులు కూడా ఉండటం అదానీ గ్రూప్‌నకు కలిసిరానుంది. దీంతో 2028 మార్చి నాటికి వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 14 కోట్ల టన్నులకు పెంచుకోవాలన్న అదానీ గ్రూప్ కల నెరవేరనుంది.

మరిన్ని కొనుగోళ్లు!

పెన్నా సిమెంట్ కొనుగోలు పూర్తి కావడంతో అదానీ గ్రూప్ ఇప్పుడు సౌరాష్ట్ర సిమెంట్, జైపీ అసోసియేట్స్ సిమెంట్ ప్లాంట్లు, ఏబీజీ షిప్‌యార్డ్ అనుబంధ సంస్థ వద్రాజ్ సిమెంట్ కంపెనీలపై కన్నేసింది. ఇందులో వద్రాజ్ సిమెంట్, జైపీ సిమెంట్స్ దివాలా ప్రక్రియలో ఉన్నాయి. అదానీ గ్రూప్ సరైన ఆఫర్ ఇస్తే ఈ రెండు సంస్థల రుణదాతలు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు ఆమోదించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్లోకి జియో

న్యూఢిల్లీ: త్వరలో అత్యంత వేగవంతమైన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించేందుకు జియోకు మార్గం సుగమమైంది. ఈ సేవలందించేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్, లక్సెంబర్గ్‌కు చెందిన ఎస్ఈఎస్ ఏర్పాటు చేసిన ఉమ్మడి భాగస్వామ్య సంస్థ 'ఆర్బిట్ కనెక్ట్ ఇండియా'కు భారత అంతరిక్ష నియంత్రణ మండలి ఇన్-స్పేస్ అనుమతి మంజూరు చేసింది. ఈ కంపెనీకి శాటిలైట్ కమ్యూనికేషన్ సర్వీసెస్ లైసెన్స్‌తోపాటు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ లైసెన్సును టెలికాం శాఖ ఇప్పటికే జారీ చేసింది. తాజాగా ఇన్-స్పేస్ నుంచీ క్లియరెన్స్ లభించిన నేపథ్యంలో ట్రయల్ సేవలను ప్రారంభించేందుకు స్పెక్ట్రమ్‌ను కేటాయించాలని టెలికాం శాఖను ఆర్బిట్ కనెక్ట్ కోరింది.

'డాలర్' ప్రచారకర్తగా మహేశ్ బాబు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బ్రాండెడ్ హోసరీ ఉత్పత్తుల సంస్థ డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ దక్షిణాది రాష్ట్రాల మార్కెట్లో పట్టును చేజిక్కించుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా వచ్చే మూడేళ్ల కాలంలో కొత్తగా 50 ఎక్స్‌క్లూజివ్ బ్రాండెడ్ ఔట్‌లెట్స్‌ను ప్రారంభించనున్నట్లు గురువారం నాడిక్కడ సంస్థ ఎండీ వినోద్ కుమార్ గుప్తా వెల్లడించారు. అంతేకాకుండా దక్షిణాదిలో వినియోగదారులకు మరింత చేరువయ్యే ఉద్దేశంతో టాలీవుడ్ హీరో మహేశ్ బాబును ప్రచారకర్తగా నియమించుకున్నట్లు ఆయన వెల్లడించారు. దక్షిణాది బ్రాండెడ్ హోసరీ మార్కెట్లో ప్రస్తుతం డాలర్ ఇండస్ట్రీస్ వాటా 8 శాతంగా ఉందని దీన్ని 20 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గుప్తా తెలిపారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం విక్రయాల్లో దక్షిణాది వాటాను 50 శాతానికి చేర్చాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకు మహేశ్ బాబు ప్రచారం ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నట్లు గుప్తా తెలిపారు.

సువెన్ చేతికి సపాలా ఆర్గానిక్స్

రూ.229 కోట్లకు 67.5% వాటా కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రం గా కార్యకలాపాలు సాగిస్తున్న సపాలా ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ చేతులు మారుతోంది. ఈ కంపెనీ ఈక్విటీలో 67.5 శాతం వాటాలను రూ.229.50 కోట్లకు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సువెన్ ఫార్మా కొనుగోలు చేసింది. రెగ్యులేటరీ సంస్థల నుంచి అనుమతులు లభిస్తే ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికల్లా ఈ కొనుగోలు పూర్తి అవుతుందని సువెన్ ఫార్మా తెలిపింది. మిగతా వాటా కొనుగోలు 2026-27 ఆర్థిక సంవత్సరంలో పూర్తి కానుంది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఒలిగో బిల్డింగ్ బ్లాక్స్ న్యూక్లిక్ యాసిడ్‌ల తయారీలో సపాలా ఆర్గానిక్స్ కంపెనీకి మంచి పేరుంది. ఈ ఉత్పత్తులను కంపెనీ కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ) పద్ధతిలో తయారు చేసి అనేక కంపెనీలకు సరఫరా చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ రూ.67 కోట్ల టర్నోవర్‌పై 45 శాతం స్థూల లాభాన్ని నమోదు చేసింది. ఈ కొనుగోలు తర్వాత కూడా సపాలా ఆర్గానిక్స్ ప్రమోటర్ డాక్టర్ పీ ఎల్లారెడ్డి కంపెనీకి సీఈఓగా కొనసాగుతారు. దీనికి తోడు జపాన్ మార్కెట్‌కు సంబంధించి సువెన్-చాన్స్ ప్లాట్‌ఫామ్‌కు వ్యూహాత్మక సలహాదారుగా వ్యవహరిస్తారు.

ఐదేళ్లలో కొత్తగా 75 షోరూమ్‌లు

జోయాలుక్కాస్ ఈడీ మాథ్యూ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆభరణాల రిటైలింగ్‌లోని జోయాలుక్కాస్ వచ్చే ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కొత్తగా 75 షోరూమ్‌లు ప్రారంభించనుంది. ప్రస్తుతం దేశంలో 97 షోరూమ్‌లు నడుస్తుండగా మరో రెండు వారాల్లో వాటి సంఖ్య 100కి చేరనుంది. గురువారం హైదరాబాద్‌లోని కొండాపూర్ లో కొత్త షోరూమ్ ప్రారంభించిన సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్ మాథ్యూ మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 17 షోరూమ్‌లుండగా కొత్తగా ప్రారంభించిన ఈ షోరూమ్ అతి పెద్దదని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాలు రెండింటిలో కలిపి తమకు 30 షోరూమ్‌లున్నాయని, వచ్చే వారం విజయవాడలో మరో షోరూమ్ ప్రారంభిస్తున్నట్టు ఆయన చెప్పారు. విదేశాల్లో తమకు 60 షోరూమ్‌లున్నాయని, కొత్త మార్కెట్లలో విస్తరణ అవకాశాలు అన్వేషిస్తున్నామన్నారు. అయితే ఇప్పటివరకు ఎంత పెట్టుబడి పెట్టింది వెల్లడించడానికి నిరాకరించారు. ఇప్పటివరకు పెట్టుబడి అవసరాలన్నింటికీ సొంత నిధుల పైనే ఆధారపడినట్టు ఆయన చెప్పారు. పబ్లిక్ ఇష్యూకి వచ్చే ఆలోచన తక్షణం లేదని మాథ్యూ అన్నారు. కాగా త్వరలో జోయాలుక్కాస్ ఆరోగ్య సంరక్షణ రంగంలోకి కూడా అడుగు పెట్టనుంది. కేరళలోని త్రిసూర్‌లో ఒక ఆస్పత్రి ఏర్పాటు చేయబోతున్నట్టు ఆయన వెల్లడించారు.

బిగ్ సీలో సామ్‌సంగ్ గెలాక్సీ ఏఐ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొబైల్ ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సీ.. సామ్‌సంగ్ గెలాక్సీ ఏఐ సిరీస్ స్మార్ట్‌ఫోన్ల విక్రయాలను ప్రారంభించినట్లు ప్రకటించింది. శుక్రవారం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్ని బిగ్ సీ షోరూమ్‌ల్లో ఈ స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉంటాయని సంస్థ ఫౌండర్ బాలు చౌదరి వెల్లడించారు. అత్యంత అధునాతన ఫీచర్లతో కూడిన ఈ ఏఐ సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ప్రారంభ ధర రూ.39,999గా ఉందని ఆయన తెలిపారు. సర్కిల్ టు సెర్చ్, లైవ్ ట్రాన్స్‌లేట్, చాట్ అసిస్ట్, 50 ఎంపీ అడాప్టివ్ పిక్సెల్ టెక్నాలజీతో కూడిన కెమెరా, నైటోగ్రఫీ, ఏఐ ఎడిట్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 8జెన్ వంటి ప్రత్యేక ఫీచర్లు ఈ ఫోన్‌లో ఉన్నాయి. ఈ స్మార్ట్‌ఫోన్స్ కొనుగోలుపై రూ.16,000 వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్, రూ.18,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ వంటి ఆకర్షణీయమైన ఆఫర్లతో పాటు జీరో డౌన్‌పేమెంట్, 24 నెలల నో కాస్ట్ ఈఎంఐ వంటి సదుపాయాలు తమ షోరూమ్‌ల్లో అందుబాటులో ఉంటాయని బిగ్ సీ తెలిపింది.

జూలై 5న ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే నెల 5న తెలంగాణ పారిశ్రామిక, వాణిజ్య మండళ్ల సమాఖ్య (ఎఫ్‌టీసీసీఐ) ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవం జరగనుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేయనున్నట్లు ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం 21 విభాగాల్లో ప్రతిభ కనబరిచిన కంపెనీలకు ఈ అవార్డులను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న కంపెనీలు ఈ నెల 20లోగా తమ దరఖాస్తులు, నామినేషన్లు ఎఫ్‌టీసీసీఐకి పంపించాలని జయదేవ్ కోరారు.

రూ.431 లక్షల కోట్లు

- ఆల్‌టైం రికార్డు స్థాయికి స్టాక్ మార్కెట్ సంపద
- సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై: గత నెలలో వినియోగదారుల ధరల సూచీ ఏడాది కనిష్ఠ స్థాయి 4.75 శాతానికి జారుకున్న నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు స్టాక్ మార్కెట్‌కు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. దాంతో ఇన్వెస్టర్లు రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఇండస్ట్రియల్స్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో సూచీలు గురువారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. ఒక దశలో సెన్సెక్స్ 538.89 పాయింట్ల లాభంతో 77,145.46 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 204.33 పాయింట్ల లాభంతో 76,810.90 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 158.1 పాయింట్లు ఎగబాకి 23,481.05 వద్ద ఇంట్రాడే రికార్డును, చివరికి 75.95 పాయింట్ల వృద్ధితో 23,398.90 వద్ద కొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. సూచీలు లాభపడటం వరుసగా ఇది రెండో రోజు. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఈ రెండు రోజుల్లో రూ.4.72 లక్షల కోట్లకు పైగా పెరిగి ఆల్‌టైమ్ రికార్డు స్థాయి రూ.431.67 లక్షల కోట్లకు (5.17 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,170 ▲	66,160 ▲	95,200 ▼
ముంబై	71,513 ▼	65,506 ▼	87,847 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ

హైదరాబాద్	530	విజయవాడ	530
వరంగల్	532	గోదావరి	525
చిత్తూరు	593	విశాఖపట్నం	530

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	136	విజయవాడ	142
వరంగల్	136	గుంటూరు	144
కరీంనగర్	136	ఒంగోలు	144
మహబూబ్‌నగర్	136	చిత్తూరు	148
కర్నూలు	136	నెల్లూరు	148
విశాఖపట్నం	134	అనంతపురం	142
గోదావరి	142		

స్పోర్ట్స్

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

అఫ్ఘానిస్థాన్ x పపువా న్యూగినీ (ఉ.6. గం.)

అమెరికా x ఐర్లాండ్ (రా.8. గం.)

బంగ్లా రేసులోనే..

నెదర్లాండ్స్‌పై కీలక విజయం

రాణించిన షకీబ్.. టీ20 వరల్డ్‌కప్



షకీబ్ అల్ హసన్ (46 బంతుల్లో 64 నాటౌట్)

కింగ్‌స్టౌన్: బంగ్లాదేశ్ తమ సూపర్-8 ఆశలను మరింత మెరుగుపర్చుకుంది. గ్రూప్ 'డి'లో తమకు పోటీగా ఉన్న నెదర్లాండ్స్‌పై గురువారం జరిగిన మ్యాచ్‌లో 25 రన్స్ తేడాతో విజయం సాధించింది. ప్రస్తుతం నాలుగు పాయింట్లతో ఉన్న ఈ జట్టు చివరి మ్యాచ్‌లో నేపాల్‌తో ఆడనుంది. బ్యాటింగ్‌లో షకీబ్ అల్ హసన్ (46 బంతుల్లో 9 ఫోర్లతో 64 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించగా.. పేసర్ రిషాద్ హొస్సేన్ (3/33) కీలక వికెట్లతో దెబ్బతీశాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 159 పరుగులు చేసింది. తన్‌జీద్ హసన్ (35), మహ్మదుల్లా (25) రాణించారు. వాన్ మీకెరెన్, ఆర్యన్ దత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 134 పరుగులు చేసి ఓడింది. ఏంజెల్‌బ్రెట్ (33), విక్రమ్‌జిత్ (26), ఎడ్వర్డ్స్ (25) పర్వాలేదనిపించారు. టస్కిన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా షకీబ్ నిలిచాడు.

ఆఖర్లో తడబాటు: ఛేదనలో నెదర్లాండ్స్ ఆటతీరు బాగానే ఉన్నా చివరి ఆరు ఓవర్లలో తడబాటు దెబ్బతీసింది. పవర్‌ప్లేలో ఓపెనర్లు లెవిట్ (18), ఓడౌడ్ (12) వికెట్లను కోల్పోగా, విక్రమ్‌జిత్ ఉన్నకాసేపు వేగం చూపుతూ మూడు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. ఏంజెల్‌బ్రెట్‌తో తను మూడో వికెట్‌కు 37 పరుగులు అందించాడు. ఆ తర్వాత కెప్టెన్ ఎడ్వర్డ్స్, ఏంజెల్ బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కోవడంతో జట్టు విజయం వైపు వెళ్తున్నట్టనిపించింది. 14వ ఓవర్ వరకు సజావుగా సాగిన డచ్ ఛేజింగ్ ఆ తర్వాత పూర్తిగా తడబడింది. 15వ ఓవర్‌లో ఏంజెల్‌బ్రెట్, బాస్ డి లీడ్ (0)లను రిషాద్ అవుట్ చేయడంతో మరిక కోలుకోలేకపోయింది.

షకీబ్ అర్ధసెంచరీ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌ను ఆల్‌రౌండర్ షకీబ్ ఆదుకున్నాడు. నాలుగో ఓవర్‌లోనే బరిలోకి దిగిన తను అజేయ హాఫ్ సెంచరీతో చివరికంటా నిలిచాడు. రెండో ఓవర్‌లోనే కెప్టెన్ షంటో (1)కు స్పిన్నర్ ఆర్యన్ షాకిచ్చాడు. ఇక అతడి తర్వాత ఓవర్‌లో లిట్టన్ దాస్ (1) ఇచ్చిన క్యాచ్‌ను ఏంజెల్‌బ్రెట్ సూపర్ డైవింగ్‌తో అందుకున్న తీరు హైలైట్‌గా నిలిచింది. కానీ మరో ఓపెనర్ తన్‌జీద్ మూడో ఓవర్‌లో 4,6,4తో 18 రన్స్ రాబట్టాడు. అటు షకీబ్ కూడా వేగం కనబరుస్తూ ఆరో ఓవర్‌లో నాలుగు ఫోర్లతో చెలరేగి 19 రన్స్ అందించడంతో పవర్‌ప్లేలో 54/2 స్కోరుతో నిలిచింది. కానీ చక్కగా కుదురుకున్న తన్‌జీద్‌ను పదో ఓవర్‌లో వాన్ మీకెరెన్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తౌహిద్ (9) విఫలమైనా షకీబ్‌కు మహ్మదుల్లా జత కలిశాడు. 17వ ఓవర్‌లో అతడు 6,4తో ఆకట్టుకున్నా.. తర్వాతి ఓవర్‌లోనే వాన్‌మీకెరెన్ చేతికి చిక్కాడు. నాలుగో వికెట్‌కు వీరి మధ్య 41 పరుగులు సమకూరాయి. చివర్లో జాకెర్ అలీ (14 నాటౌట్) మూడు ఫోర్లు, ఆఖరి ఓవర్‌లో షకీబ్ రెండు ఫోర్లతో స్కోరు 150 దాటింది.

పాయింట్ల పట్టిక — గ్రూప్-డి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
దక్షిణాఫ్రికా	3	3	0	0	6	0.603
బంగ్లాదేశ్	3	2	1	0	4	0.478
నెదర్లాండ్స్	3	1	2	0	2	-0.408
నేపాల్	2	0	1	1	1	-0.539
శ్రీలంక	3	0	2	1	1	-0.777

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 159/5. (షకీబ్ 64 నాటౌట్, తన్‌జీద్ హసన్ 35, మహ్మదుల్లా 25; వాన్ మీకెరెన్ 2/15, ఆర్యన్ దత్ 2/17)

నెదర్లాండ్స్: 20 ఓవర్లలో 134/8 (ఏంజెల్‌బ్రెట్ 33, విక్రమ్‌జిత్ 26, ఎడ్వర్డ్స్ 25; రిషాద్ 3/33, టస్కిన్ 2/30

కివీస్ కథ ముగిసినట్టే!

సూపర్-8కు వెస్టిండీస్

- 13 పరుగులతో ఓటమి
- రూథర్‌ఫోర్డ్ ధనాధన్ అర్ధ శతకం
- జోసెఫ్‌కు 4 వికెట్లు



రూథర్‌ఫోర్డ్ (39 బంతుల్లో 68 నాటౌట్)



కేన్

టరోబా (ట్రినిడాడ్): గత టోర్నీ సెమీఫైనలిస్ట్ న్యూజిలాండ్.. టీ20 వరల్డ్‌కప్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టడం దాదాపు ఖాయమైంది. గ్రూప్-సిలో గురువారం తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో కివీస్ 13 పరుగుల తేడాతో వెస్టిండీస్ చేతిలో చిత్తయింది. క్లిష్ట సమయంలో షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (39 బంతుల్లో 68 నాటౌట్) అర్ధ శతకంతోపాటు బౌలర్లు చెలరేగడంతో.. విండీస్ సూపర్-8కు దూసుకెళ్లింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి మొత్తం ఆరు పాయింట్లతో తర్వాతి దశకు అర్హత సాధించింది. కాగా, న్యూజిలాండ్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలైంది. కివీస్ సూపర్-8కు చేరాలంటే..అఫ్ఘానిస్థాన్ జట్టు మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలవ్వాలి. అలాగే మైనస్ రన్‌రేట్‌తో ఉన్న కివీస్ భారీ విజయాలు సాధించాలి. ఇది దాదాపు అసాధ్యమనే చెప్పాలి. ఇప్పటికే భారీ రన్‌రేట్ (+5.225)తో ఉన్న అఫ్ఘాన్ జట్టు పసికూన పపువా న్యూ గినీ, వెస్టిండీస్‌లతో ఆడాల్సివుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 149/9 స్కోరు చేసింది. న్యూజిలాండ్ పేసర్లు బౌల్ట్ (3/16), సౌథీ (2/21) విజృంభించడంతో.. విండీస్ 22/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఆరో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగిన రూథర్‌ఫోర్డ్ ఎడాపెడా షాట్లతో కివీస్ బౌలింగ్‌ను ఉతికి ఆరేశాడు. చివరి రెండు ఓవర్లలో 19, 18 పరుగులు పిండుకొన్న రూథర్‌ఫోర్డ్ జట్టుకు పోరాడగలిగే స్కోరును అందించాడు. అనంతరం ఛేదనలో న్యూజిలాండ్ ఓవర్లన్నీ ఆడి 136/9 స్కోరు మాత్రమే చేసింది. ఫిలిప్స్ (40), ఫిన్ అలెన్ (26), శాంట్నర్ (21) కొంతసేపు పోరాడారు. అల్జారీ జోసెఫ్ (4/19) నాలుగు వికెట్లు, గుడకేష్ (3/25) మూడు వికెట్లతో కివీస్ బ్యాటింగ్ వెన్నువిరిచారు.

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్: 20 ఓవర్లలో 149/9 (రూథర్‌ఫోర్డ్ 68 నాటౌట్; బౌల్ట్ 3/16, సౌథీ 2/21). **న్యూజిలాండ్:** 20 ఓవర్లలో 136/9 (ఫిలిప్స్ 40, ఫిన్ అలెన్ 26; జోసెఫ్ 4/19, గుడకేష్ 3/25).

పాయింట్ల పట్టిక — గ్రూప్-సి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
వెస్టిండీస్	3	3	0	0	6	2.596
అఫ్ఘానిస్థాన్	2	2	0	0	4	5.225
ఉగాండా	3	1	2	0	2	-4.217
పీఎన్‌జీ	2	0	2	0	0	-0.434
న్యూజిలాండ్	2	0	2	0	0	-2.425

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

బుల్‌డోజర్లు రెడీ!



నసా స్టేడియం కూల్చివేతకు రంగం సిద్ధం

న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్ కోసం తాత్కాలికంగా నిర్మించిన నసా క్రికెట్ స్టేడియం కనుమరుగు కానుంది. బుధవారం అమెరికా-భారత్ పోరుతో ఇక్కడ షెడ్యూల్ చేసిన మొత్తం 8 మ్యాచ్‌లు ముగిశాయి. దీంతో ముందుగా నిర్ణయించిన ప్రకారం స్టేడియం కూల్చివేతకు రంగం సిద్ధం చేశారు. స్టేడియం వద్ద భారీ క్రేన్లు, బుల్‌డోజర్లు ఉన్న వీడియో నెట్‌లో వైరల్ అవుతోంది. 930 ఎకరాల ఐసెన్ హోవర్ పార్క్‌లో 34 వేల సీటింగ్ కెపాసిటీతో ఈ స్టేడియాన్ని కేవలం 100 రోజుల్లో నిర్మించారు. స్టాండ్స్ నిర్మాణం కోసం వినియోగించిన ఇనుప కమ్మెలు, తదితరాలను లాస్‌వెగాస్‌లో జరిగిన ఎఫ్-1, గోల్ఫ్ ఈవెంట్ల నుంచి అరువు తెచ్చారు. ఇప్పుడు వీటిని ఊడదీసి మళ్లీ వారికి అప్పజెప్పనున్నారు. ఈ స్టేడియంలో ఏర్పాటు చేసిన డ్రాప్ ఇన్ పిచ్‌లు మెగా ఈవెంట్‌లో భారీ చర్చకు దారితీశాయి. వికెట్‌లో అసమతుల్యమైన బౌన్స్ కారణంగా బ్యాటర్లు ఎంతో ఇబ్బందిపడ్డారు. ఇండో-పాక్ మ్యాచ్‌కు ఈ మైదానం కిటకిటలాడిపోయింది. నిర్మాణాలను తొలగించడానికి ఆరు వారాల సమయం పడుతుందని అంచనా. అయితే, డ్రాప్ ఇన్ పిచ్‌లను మాత్రం ఇక్కడే ఉంచనున్నారు.

క్వార్టర్స్‌లో ప్రణయ్, సమీర్



సమీర్

సిడ్నీ: భారత షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, సమీర్ వర్మ ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. అలాగే మిక్స్‌డ్‌లో సుమిత్, సిక్కిరెడ్డి జోడీ కూడా ముందంజ వేసిం ది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రౌండ్-16 మ్యాచ్‌లో ఐదో సీడ్ ప్రణయ్ 21-17, 21-15తో మిషా జిల్బెర్‌మన్ (ఇజ్రాయెల్)ను చిత్తు చేశాడు. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో సమీర్ 21-14, 14-21, 21-19తో కీన్ యూ (సింగపూర్)కు షాకిచ్చాడు. ఇక..కిరణ్ జార్జ్ 20-22, 6-21తో నిషిమోటో చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 21-16, 21-13తో కాయ్ క్వి (ఆస్ట్రేలియా)పై నెగ్గి రౌండ్-8లో అడుగుపెట్టింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్ రెడ్డి, సిక్కిరెడ్డి ద్వయం 21-11, 21-11తో కాయ్ చెన్, కాయ్ క్వి (ఆస్ట్రేలియా) జోడీపై విజయంతో క్వార్టర్స్ చేరింది. ఇక..మహిళల సింగిల్స్‌లో అనుపమా ఉపాధ్యాయ, మాళవికా బన్సోడ్, డబుల్స్‌లో రితూ పర్ణ, శ్వేతా పర్ణ పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

వరల్డ్ జూనియర్ చెస్ చాంప్ దివ్య



గాంధీనగర్: వరల్డ్ జూనియర్ బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో దివ్య దేశ్ ముఖ్ విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఆఖరి, 11వ రౌండ్‌లో బొలో స్లావా క్రస్టేవా (బల్గేరియా)పై 18 ఏళ్ల దివ్య గెలిచింది. దీంతో మొత్తం 10 పాయింట్లతో టైటిల్‌ను సొంతం చేసుకొంది. 9.5 పాయింట్లతో మరియమ్ (అర్మేనియా) రెండో స్థానంలో, 8.5 పాయింట్లతో అలా వెర్దియేవా (అజర్‌బైజాన్) మూడో స్థానంలో నిలిచారు.

వింబుల్డన్‌కు నడాల్ దూరం



లండన్: వచ్చే నెల ఆరంభం నుంచి జరిగే గ్రాస్ కోర్ట్ గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌కు దూరమవుతున్నట్టు స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ ప్రకటించాడు. తన దృష్టంతా జూలై 26 నుంచి జరిగే పారిస్ ఒలింపిక్స్‌పైనే కేంద్రీకరించినట్టు తెలిపాడు. తుంటి గాయంతో నడాల్ గత కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నాడు.

శ్రుతి వోరా రికార్డు



న్యూఢిల్లీ: భారత ఈక్వెస్ట్రియన్ శ్రుతి వోరా.. 3స్టార్ గ్రాండ్‌ప్రీ డ్రెస్సేజ్ విభాగంలో విజేతగా నిలిచిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. స్లొవేనియాలో జరిగిన సీడీఐ-3 ఈవెంట్‌లో శ్రుతి పాల్గొంది. కోల్‌కతాకు చెందిన ఈ వెటరన్ మొత్తంగా 67.761 పాయింట్లతో తొలి స్థానంలో నిలిచింది.

వింబుల్డన్ ప్రైజ్‌మనీ పెంపు

లండన్: వింబుల్డన్ ప్రైజ్‌మనీ రికార్డు స్థాయిలో రూ. 535 కోట్లకు పెరిగింది. ఇది గత ఏడాది కంటే 11.9 శాతం..అంటే రూ. 57 కోట్లు పెరగడం విశేషం. పురుషులు, మహిళల సింగిల్స్ విజేతలకు తలో రూ. 29 కోట్లు అందుతుంది.

పాక్ ఆశలు గల్లంతేనా?

ఫ్లోరిడాలో భారీ వర్షాలు

లాడర్‌హిల్: టీ20 మెగా టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క విజయంతో ఉన్న పాకిస్థాన్ జట్టు సూపర్-8 దశకు చేరడం క్లిష్టంగా మారింది. ఆశలు నిలవాలంటే ఐర్లాండ్‌తో జరిగే తమ చివరి మ్యాచ్‌లో విజయం సాధించాల్సిందే. కానీ ఆదివారం జరగాల్సిన పాక్ మ్యాచ్‌పై సందేహాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఫ్లోరిడాలో భారీ వర్షాలతో వీధులన్నీ వరద నీటితో నిండిపోయాయి. అలాగే స్టేడియం ఉన్న బ్రోవార్డ్ కౌంటీలోనూ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఒకవేళ వర్షంతో ఈ మ్యాచ్ రద్దయితే 3 పాయింట్లతో పాక్ నిష్క్రమించాల్సిందే. దీనికి తోడు ఇదే స్టేడియంలో శుక్రవారం యూఎస్ జట్టు ఐర్లాండ్‌తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్ ఆటంకం లేకుండా సాగి ఆతిథ్య జట్టు ఓడిపోతేనే పాక్ ఆశలు సజీవంగా ఉంటాయి. అలాకాకుండా వర్షంతో రద్దయినా యూఎస్ ఐదు పాయింట్లతో సూపర్-8కు వెళుతుంది. అప్పుడు ఆదివారం మ్యాచ్‌లో పాక్ గెలిచినా లాభం లేదు.

డిగ్రీలో 40- 45 శాతం మార్కులున్నా ఉపాధ్యాయ పోస్టులకు అర్హులే

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సర్కారు శుభవార్త చెప్పింది. దరఖాస్తు చేసుకోవడానికి కావలసిన కనీస మార్కుల శాతాన్ని కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), భాషా పండిట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (పీఈటి) వంటి పోస్టులకు జనరల్ కేటగిరి అభ్యర్థులకు డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వంటి ఇతర కేటగిరి అభ్యర్థులకు డిగ్రీలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలన్న నిబంధన ఉండేది. అయితే... దానిని తాజాగా 45 శాతం, 40 శాతానికి కుదిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి సూచనల మేరకు మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

టాస్ ఫలితాల వెల్లడి

కాగా, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఫలితాలను వెల్లడించారు. ఏప్రిల్ 25 నుంచి మే 2వ తేదీ వరకు టాస్‌లో టెన్త్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో టెన్త్‌లో 51.20 శాతం, ఇంటర్‌లో 52.72 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణతను సాధించారు.

ఎస్ఎస్ఐ మంత్ర-3 ఆవిష్కరణ

- రోబోటిక్ టెలీ సర్జరీ ట్రయల్ విజయవంతం

న్యూఢిల్లీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక రోబోటిక్ టెలీ సర్జరీ యంత్రం 'ఎస్ఎస్ఐ మంత్ర-3'ని ఎస్ఎస్ఐ(సుధీర్ శ్రీవాత్సవ ఇన్నోవేషన్స్) సంస్థ గురువారం ఆవిష్కరించింది. అంతేకాక, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ మంత్ర-3 రోబోటిక్ వ్యవస్థతో టెలీ సర్జరీ ట్రయల్‌ను విజయవంతంగా చేసి చూపించింది. న్యూఢిల్లీలోని ఎస్ఎస్ఐ ప్రధాన కార్యాలయం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వరల్డ్ ల్యాప్రోస్కోపిక్ హాస్పిటల్‌లో ఓ సర్జరీని ప్రయోగాత్మకంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్ఎస్ఐ వ్యవస్థాపకులు సుధీర్ శ్రీవాత్సవ మాట్లాడుతూ మంత్ర-1, మంత్ర-2 పేరిట తమ సంస్థకు చెందిన రెండు రోబోటిక్ సర్జరీ ప్లాట్‌ఫామ్‌లు ఇప్పటికే మార్కెట్‌లో అందుబాటులో ఉన్నారు. వాటిని మరింత మెరుగుపరిచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మంత్ర-3 రోబోటిక్ టెలీ సర్జరీ యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. విదేశీ యంత్రాలతో పోలిస్తే పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మంత్ర-3 ఖర్చు తక్కువన్నారు. సరైన వసతులు లేని చోట కూడా మంత్ర-3 సాయంతో సులువుగా శస్త్ర చికిత్సలు నిర్వహించవచ్చునని చెప్పారు.

పరీక్ష లేకుండానే వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిని నియమించొచ్చు: హైకోర్టు

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షుడిని ఎలాంటి పరీక్ష నిర్వహించకుండానే నియమించవచ్చని హైకోర్టు పేర్కొంది. ఇదే విషయాన్ని ఇటీవల సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొందని, ఈ విషయం ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలియకపోవడం ఏంటని ప్రశ్నించింది. తెలంగాణ వినియోగదారుల కమిషన్ అధ్యక్ష పదవిని భర్తీ చేయడం లేదని కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ పుస్తక సహ రచయిత, న్యాయవాది బాగ్లేకర్ ఆకాశ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కమిషన్ అధ్యక్ష పదవి భర్తీకి సంబంధించి పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. పరీక్ష లేకుండానే అధ్యక్ష పదవిని భర్తీ చేయవచ్చని, ఇందుకు సుప్రీంకోర్టు తీర్పును పరిశీలించాలని పిటిషనర్ పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం సుప్రీం తీర్పు పరిశీలించి దాని ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ విచారణను 24కు వాయిదా వేసింది.

కుల, మత రహిత ధ్రువపత్రాల జారీపై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

కులం, మతం లేదు అని ధ్రువపత్రం కోరుకునే వారికి వాటిని జారీచేసే అంశంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. జనన ధ్రువపత్రం నుంచి మరణ ధ్రువపత్రం వరకు అన్నింటిలో 'కులం, మతం లేదు' అనే స్టేటస్ కోరుకునే వారిని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని డీవీ రామకృష్ణారావు, ఎస్ క్లారెన్స్ కృపాళిని తదితరులు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దానిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది.

ఆ 7 మండలాలపై వివాదం చేస్తున్న కేసీఆర్

- ఎప్పుడైనా ఆ మండలాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారులను పంపిందా?: సతీష్‌మాదిగ

పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు రాష్ట్రం వస్తోంది.. ఆ ఏడు చిన్న మండలాలు ఎంత అని ఏపీకి అప్పగించిన మాజీ సీఎం కేసీఆర్.. ఇప్పుడు మాట మార్చి వివాదం చేస్తున్నారని టీపీసీసీ నేత సతీష్ మాదిగ మండిపడ్డారు. పదేళ్ల పదవీకాలంలో ఏనాడైనా ఆ మండలాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారులను పంపిందా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఏడు మండలాల వివాదం తెరపైకి తెచ్చి ప్రాంతాల మధ్య విబేధాలు సృష్టించి కేసీఆర్ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి:సీపీఎం

ప్రజాపాలనలో ఒక కోటీ 30 లక్షల దరఖాస్తులు వస్తే అందులో 70వేల దరఖాస్తులు భూ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయని సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన అంశాలను అమలు చేయాలని కోరారు. ధరణి సమస్యల మీద ఇప్పటికే క్షేత్రస్థాయి విచారణ పూర్తయినందున తక్షణమే ప్రభుత్వం విధాన నిర్ణయం చేసి భూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక ప్రకటించి రైతులకు సూచనలు ఇవ్వాలని కోరారు.

సమస్యల సాధనకు ఉద్యమ బాట: పెన్షనర్లు

ప్రభుత్వ పింఛనుదారుల దీర్ఘకాలిక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారుల సంయుక్త కార్యాచరణ సమితి కోరింది. ఎన్నికల సందర్భంగా తమ సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇంత వరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని ఆ సమితి చైర్మన్ కె.లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టి.సుభాకర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చి దాటవేస్తున్నందున జూలై రెండో వారంలో చలో హైదరాబాద్ పేరుతో ఉద్యమ కార్యాచరణ చేపట్టేలా తీర్మానం చేశారు.

కూలింది.. కూలీ బతుకులను కూల్చింది

- మంచిర్యాలలో ప్రహరీ కూలి ముగ్గురు కూలీలు దుర్మరణం


హన్మంతు (ఫైల్)

మంచిర్యాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణం కోసం పునాది తవ్వుతుండగా ఘోరం జరిగింది. శిథిలావస్థకు చేరిన ప్రహరీ కూలీలపై పడడంతో ముగ్గురు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ఈ ఘటన చోటుచేసుకుంది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రుద్రాపూర్‌కు చెందిన ఎనాక హన్మంతు(45), అదే మండలవాసి ఆత్రం శంకర్(42), గోలెం పోశం(46), రమేష్ 15 రోజులుగా భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. గురువారం ఉదయం పునాది తీస్తుండగా పెద్ద పెద్ద కాంక్రీట్ దిమ్మెలు వారిమీద పడ్డాయి. పోలీసులు, అగ్నిమాపకశాఖ సిబ్బంది డ్రిల్లింగ్ యంత్రాలతో శిథిలాలను తొలగించి చూడగా ముగ్గురు అప్పటికే ప్రాణాలు వదిలారు. అదనపు కలెక్టర్ రాహుల్, రామగుండం కమిషనర్ శ్రీనివాస్, మంచిర్యాల ఆర్డీవో రాములు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హన్మంతు మంచిర్యాలలోని భగవంతంవాడలో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఇతడికి భార్య లక్ష్మి, కుమారులు రాజేష్, అంకుష్, కుమార్తె శివాని ఉన్నారు. వచ్చే నెలలో కూతురు వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రహరీ శిథిలావస్థకు చేరినట్లు భవన యజమానికి తెలిపినా పట్టించుకోలేదని కూలీల కుటుంబీకులు ఆరోపించారు.


రోడ్డంతా పూలు పరిచి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న అమరావతి ప్రజలు

మార్పు మొదలైంది!

పరదాల పాలనకు స్వస్తి.. మితిమీరిన ఆంక్షలకు సెలవు

అమరావతి ప్రాంతంలో మారిన చిత్రం

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీలో మార్పు మొదలైంది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు పరదాల పాలనకు తెర దించారు. ప్రమాణ స్వీకారానికి ముందే చంద్రబాబు ఈ విషయం స్పష్టం చేశారు. అయితే... చంద్రబాబు తిరుమల పర్యటన సందర్భంగా పరదాలు కట్టడం కనిపించింది. దీనిపై మంత్రి లోకేశ్ అప్పుడే స్పందించారు. 'పరదాలు కట్టొద్దని చెప్పాం కదా' అని ప్రశ్నించగా... 'అలవాటులో పొరపాటు జరిగిందనే సమాధానం రావడంతో ఆయన సరదాగా నవ్వారు. ఇకపై పరదాలు, బారికేడ్లు వద్దని స్పష్టం చేశారు. ప్రజలకూ తమకూ మధ్య అడ్డంకులు వద్దని చంద్రబాబు కూడా అధికారులకు సూచించారు. గురువారం ఆయన తిరుమల శ్రీవారిని, బెజవాడలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆ సమయంలో... సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా వీలైనంత తక్కువ స్థాయిలో ఆంక్షలు అమలయ్యాయి. ఇక.. జగన్ ముఖ్యమంత్రి హోదాలో సచివాలయం వైపు వెళ్లేందుకే ఇష్టపడలేదు. కేబినెట్ సమావేశాలు జరిగినప్పుడు మాత్రం వెళ్లేవారు. ఆ సమయంలో... దారి పొడవునా వందలాది మంది పోలీసులను మోహరించేవారు. ఆ చిత్రం మారిపోయింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానంతరం గురువారం తొలిసారి సచివాలయానికి వెళ్లిన చంద్రబాబుకు దారిపొడవునా ఘన స్వాగతం లభించింది. ప్రజలతో ఆయన మమేకమయ్యారు.

జగన్ బొమ్మ ఉన్నా.. విద్యాకానుకను ఆపొద్దు: బాబు

చంద్రబాబు మాట, ముద్రను జగన్ ఒక్క క్షణం కూడా సహించలేకపోయారు. 'ప్రజా వేదిక'నే కూల్చి వేయించారు. కానీ... ఇలాంటి విద్వేషపూరిత విధానాలను తాము అమలు చేయబోమని చంద్రబాబు సంకేతాలు పంపారు. 'విద్యా కానుక'పై జగన్ ఫొటో ఉన్నప్పటికీ పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. "ఎవరి బొమ్మ ఉందనేది ముఖ్యం కాదు. విద్యార్థులు ఇబ్బంది పడకూడదు. మాజీ సీఎం జగన్ బొమ్మలున్నా ఫరవాలేదు. విద్యార్థులకు ఇచ్చే స్టూడెంట్ కిట్ల పంపిణీ ఆపొద్దు' అని స్పష్టం చేశారు.

5 సంతకాల సంబరం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయనున్నారు. ఇక.. జగన్ సర్కారు రైతుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించేలా చేసిన 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' రద్దుపై చంద్రబాబు రెండో సంతకం చేశారు. రైతుల భూములను వివాదాస్పదం చేసి, కబ్జాదారులకు కోరలు తొడిగేలా రూపొందించిన ఈ చట్టాన్ని సమాధి చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ చట్టంలోని లోపాలు, లోటుపాట్లను ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు సవివరంగా చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తూ రెండో సంతకం పెడతానని ప్రకటించారు. ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నారు.

పేదల పింఛను రూ.4 వేలు

పేదల పింఛన్ మొత్తాన్ని రూ.3వేల నుంచి ఒకేసారి రూ.4వేలకు పెంచారు. చంద్రబాబు తన మూడో సంతకాన్ని ఈ ఫైలుపైనే చేశారు. 2019లోనే చంద్రబాబు పింఛను రూ.2వేలు చేశారు. దీనిని రూ.3వేలకు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్... 'విడతలవారీ' పాట పాడారు. కాగా... చంద్రబాబు ఇప్పుడు ఒకే విడతలో రూ.వెయ్యి పెంచేశారు. "దీనివల్ల 66 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది. మేం అధికారంలోకి వస్తే ఏప్రిల్ నుంచే పెరిగిన పింఛను అమలు చేస్తామని... ఈ మొత్తాన్ని కూడా కలిపి జూలైలో రూ.7వేలు ఇస్తామని చెప్పాం. దీని ప్రకారం... జూలై నెలలో ఈ మూడు నెలల బకాయి రూ.3వేలు, పెరిగిన పింఛను రూ.4వేలు కలిపి మొత్తం 7వేలు అందుతాయి. అలాగే దివ్యాంగుల పింఛను రూ.4వేల నుంచి ఆరు వేలకు పెంచుతున్నాం. వారికి బకాయిలతో కలిపి జూలైలో రూ.12 వేలు అందుతుంది" అని చంద్రబాబు వివరించారు.


తిరుమలలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న చంద్రబాబు

నైపుణ్యానికి జై...

ఏపీలోని యువత, ప్రైవేటు ఉద్యోగుల్లో ఎటువంటి ఉద్యోగ నైపుణ్యాలు ఉన్నాయో తెలుసుకొని... వారికి మరింత నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఉద్దేశించిన నైపుణ్య గణన (స్కిల్ సెన్సెస్) నిర్వహణపై చంద్రబాబు నాలుగో సంతకం చేశారు. స్కిల్ సెన్సెస్ ప్రాధాన్యంపై జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. ఇక... జగన్ రాగానే మూసేసిన 'అన్న క్యాంటీన్ల'ను పునరుద్ధరిస్తూ చంద్రబాబు ఐదో సంతకం చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం, అల్పాహారాన్ని రూ.5కే అందించింది. వందల సంఖ్యలో వీటిని ఏర్పాటు చేశారు. పేదలు, కూలీలతోపాటు వివిధ పనులపై పట్టణాలకు వచ్చే ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించారు. టీడీపీ ప్రభుత్వానికి బ్రాండ్‌గా నిలిచిన అన్న క్యాంటీన్లను జగన్ మూసి వేయించారు. ఆ భవనాలను వార్డు సచివాలయాలు, ఇతర అవసరాలకు వాడుకున్నారు. దీంతో... ప్రస్తుతం ఎన్ని వీలైతే అన్ని అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని, దశలవారీగా మిగిలిన వాటిని అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు తెలిపారు. వేడుకలా సాగిన 'తొలి సంతకాల' కార్యక్రమానికి కొత్త మంత్రులు, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పోస్టుల వివరాలివీ..

కేటగిరీ	పోస్టులు
ఎస్‌జీటీ	6,371
స్కూల్ అసిస్టెంట్	7,725
టీజీటీ	1,781
పీజీటీ	286
పీఈటీ	132
ప్రిన్సిపాల్స్	52
మొత్తం	16,347

వేడుకగా పదవీ బాధ్యతల స్వీకారం

గురువారం సాయంత్రం 4.41 గంటలకు చంద్రబాబు ఏపీలో సచివాలయంలోని తన చాంబర్లో ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో గతంలో తాను వినియోగించిన కార్యాలయాన్నే ఆయన ఈసారీ ఎంచుకొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి తొలి సంతకాలకు సంబంధించిన లబ్ధిదారులు, సచివాలయ ఉద్యోగులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చంద్రబాబుకు అభినందనలు తెలపడానికి వందల సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో సచివాలయంలో... ముఖ్యమంత్రి కార్యాలయంలో విపరీతమైన రద్దీ నెలకొంది.



చూస్తుండగానే ఐదేళ్లు గడిచిపోయాయి

వచ్చే ఐదేళ్లు కూడా అలాగే అయిపోతాయి

ఎమ్మెల్సీల సమావేశంలో జగన్ వ్యాఖ్యలు

సభలో ప్రతిపక్ష హోదా దక్కునోలేదోనని నిర్వేదం

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చూస్తుండగానే ఐదేళ్ల కాలం అయిపోయిందని, వచ్చే ఐదేళ్లూ అలాగే గడిచిపోతాయని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేక హోదా అడగకుండా సీఎం చంద్రబాబు తప్పుచేశారని విమర్శించారు. కానీ, అధికారపక్షంలో ఉన్న ఐదేళ్లలో తాను ఏనాడూ హోదా అంశం ప్రస్తావించని విషయం కావాలనే దాచేశారు. ప్రతిపక్ష హోదా అయినా శాసనసభలో లభిస్తుందో లేదోనన్న నిర్వేదాన్ని జగన్ వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం తాడేపల్లి నివాసంలో వైసీపీ ఎమ్మెల్సీలతో జరిగిన భేటీలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుకు మద్దతు ఇస్తున్న చంద్రబాబు ప్రత్యేక హోదాను కోరడం లేదని జగన్ అన్నారు. ఆయన తప్పులు చేసి దొరుకుతారన్నారు. ప్రతిపక్ష నేతగా 14 నెలల పాటు పాదయాత్ర చేశానని, ఆనాటి ఓపిక ఇంకా తనకున్నదని జగన్ పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లూ ప్రజల్లోనే ఉందామని ఎమ్మెల్సీలకు జగన్ సూచించారు.

తండ్రిని చంపిన కూతురు

అట్లకాడతో కొట్టి చంపిన వైనం

ఇష్టంలేని పెళ్లి చేసుకొమ్మనడమే కారణం!

హతుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మదనపల్లె అర్బన్, జూన్ 13: కన్న తండ్రిని ఓ కూతురు అట్లకాడతో కొట్టి దారుణంగా హత్య చేసింది. బుధవారం రాత్రి మదనపల్లె పీఅండ్‌టీ కాలనీలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు... చిత్తూరు జిల్లా సదుం మండలం, చెరుకువారిపల్లెకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇ దొరస్వామి (62) మదనపల్లె పీఅండ్‌టీ కాలనీలో స్థిరపడ్డారు. దిగువ కురవంకలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆయన జూలైలో పదవీ విరమణ చేయాల్సి ఉంది. భార్య లత ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. బీఎస్సీ, బీఈడీ చదివిన కుమార్తె హరిత(24), దొరస్వామి కలిసి ఉంటున్నారు. తాను సన్నిహితంగా ఉన్న ఒకరికి రూ.10 లక్షలు ఇచ్చిన హరిత... కొద్ది రోజుల క్రితం తండ్రిపై ఒత్తిడి తెచ్చి నివాసం ఉంటున్న ఇంటిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుంది. కుమార్తెకు పెళ్లి ప్రయత్నాలు చేస్తున్న దొరస్వామి ఓ సంబంధం చూశారు. అయితే ఆ అబ్బాయి వద్దంటూ హరిత తన తండ్రితో గొడవపడింది. బుధవారం రాత్రి 11.45 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి అరుపులు, కేకలు వినపడటంతో చుట్టుపక్కల వారు ఇంటి వద్దకు చేరుకుని, రక్తపు మడుగులో ఉన్న దొరస్వామిని గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. మదనపల్లె వన్‌టౌన్ సీఐ వల్లీబసు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. విచారణలో మొదట్లో పొంతన లేని సమాధానాలు చెప్పిన హరిత తరువాత నేరాన్ని అంగీకరించింది. అట్లకాడతో తలపై బలంగా మోది హత్య చేసినట్లు ఒప్పుకుంది. నిందితురాలిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. హత్య జరిగిన ఇంటిని, పరిసరాలను గురువారం ఉదయం మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ఈ సంఘటనపై మదనపల్లె రూరల్ సీఐ శేఖర్, వన్‌టౌన్ సీఐ వల్లీబసు, టూటౌన్ సీఐ యువరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హతుడి బంధువు డాక్టర్ నారాయణయ్య ఫిర్యాదు మేరకు హరితపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వ్యవస్థలను భ్రష్టు పట్టించారు!

- ఐఏఎస్, ఐపీఎస్‌లపై గౌరవం ఉండేది
- కానీ.. ఐదేళ్లలో మొత్తం డ్యామేజ్ చేశారు
- ఏం చేశారో ఆత్మ విమర్శ చేసుకోండి
- సీనియర్ బ్యూరోక్రాట్లకు ఏపీ సీఎం 'క్లాస్'

అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మూడంటే మూడు నిమిషాలు! అయితేనేం... చంద్రబాబు సూటిగా, ఘాటుగా మాట్లాడారు. సీనియర్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు క్లాస్ తీసుకున్నారు. మరీముఖ్యంగా... జగన్ ప్రభుత్వ హయాంలో గీతదాటి వ్యవహరించిన ఉన్నతాధికారులు భుజాలు తడుముకునేలా చేశారు. 'మీపట్ల గతంలో ఉన్న గౌరవం పోయింది' అని చెప్పకనే చెప్పారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం గురువారం తొలిసారి సచివాలయానికి వచ్చిన చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు చెప్పేందుకు అఖిలభారత సర్వీసు అధికారులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. వారందరినీ ఒక హాలులో కూర్చోబెట్టారు. సీఎం చంద్రబాబు అక్కడికే వెళ్లి క్లుప్తంగా మాట్లాడారు. "నేను ఉమ్మడి రాష్ట్రానికీ, నవ్యాంధ్రకూ ముఖ్యమంత్రిగా పని చేశాను. ఇప్పుడు మరోసారి ముఖ్యమంత్రిని అయ్యాను. నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నిబద్ధతతో పనిచేసేవారు. నాకూ ఐఏఎస్, ఐపీఎస్‌లంటే గౌరవం ఉండేది. వ్యవస్థల్ని బాగా నడుపుతున్నారనే భావన ఉండేది. కానీ... గత ఐదేళ్లలో ఏం చేశారో ఆత్మ విమర్శ చేసుకోండి. వ్యవస్థల్ని భ్రష్టుపట్టించారు. నిబంధనలు పక్కన పెట్టి, ఒక అజెండాతో పని చేసి మొత్తం డ్యామేజ్ చేశారు. అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా దెబ్బతింది. వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. నాకు జరిగిన అన్యాయం గురించి నేను మాట్లాడటంలేదు. రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించే నా బాధ. ఇప్పుడు వ్యవస్థల్ని మళ్లీ గాడిలో పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. అందుకు కొన్ని నిర్ణయాలు తీసుకుంటాను" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరోవైపు గత ప్రభుత్వంలో చట్టాన్ని మీరి పని చేసి, వివాదాస్పదమైన అధికారులు ఇప్పుడు చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకు పోటీ పడ్డారు. అక్రమాస్తుల కేసులో నిందితురాలు, జగన్ సీఎం కాగానే తెలంగాణ నుంచి ఏపీకి వచ్చేసిన ఐఏఎస్ శ్రీలక్ష్మి గురువారం బొకేతో సచివాలయంలో ప్రత్యక్షమయ్యారు. తాను బాధ్యతలు స్వీకరిస్తున్న సమయంలో ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, సీఎం ముఖ్య కార్యదర్శి మినహా ఇతర అధికారులు చాంబర్‌లో ఉండొద్దని చంద్రబాబు ముందే చెప్పారు. కానీ... శ్రీలక్ష్మి బొకేతో తీసుకుని తలుపు తోసుకుని సీఎం చాంబర్‌లో అడుగుపెట్టారు. సీఎం కొంత అసహనంతో ఆమె వైపు చూశారు. సీఎస్ నీరబ్ కుమార్ ఆమె వద్దకు వెళ్లి... అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పినట్లు తెలిసింది. ఐదేళ్లు జగన్‌కు వీర విధేయుడిగా పని చేసిన ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు కూడా సీఎం చాంబర్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆయన తలుపు వద్ద వేచి చూస్తుండగానే.. ఇంటెలిజెన్స్ చీఫ్ కుమార్ విశ్వజీత్ వెళ్లి, మీటింగ్ హాలులోకి వెళ్లాలని అక్కడి నుంచి పంపించేశారు. గత ప్రభుత్వంలో స్వామి భక్తి పరాయణులుగా గుర్తింపు పొందిన అధికారులు సీఎంకంటే ముందుగా వచ్చి, ఆయన కుర్చీకి బాగా దగ్గరగా కూర్చున్నారు. ముందుగా అనుకున్నదాని ప్రకారం ఒక్కో అధికారి వరుసలో ఆయన వద్దకు వచ్చి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఫొటోలు దిగాల్సి ఉంది. చంద్రబాబు వారికి ఆ అవకాశం ఇవ్వలేదు. తన సీటుకు దగ్గరగా కూర్చున్నవారు ఇద్దరు ముగ్గురు ఇచ్చిన బొకేలను ముభావంగా తీసుకొని టేబుల్ మీద పెట్టేశారు. సునీల్ కుమార్ కూడా పుష్పగుచ్ఛం ఇవ్వగలిగారు. ఆయన వైపు కనీసం చూడకుండా చంద్రబాబు దానిని తీసుకొని టేబుల్ మీద పెట్టేశారు. అక్కడి నుంచి తిరిగి వెళుతుండగా గనుల శాఖ ముఖ్య కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేది ఆయనకు పుష్ప గుచ్ఛం ఇవ్వడానికి గబగబా దగ్గరకు రాగా... చంద్రబాబు ఆయన వైపు చూడకుండానే వెళ్లిపోయారు.


సచివాలయంలో ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశంలో చంద్రబాబు

వారి పేర్లు కనపడొద్దు!

ఐదు సంతకాలకు సంబంధించిన జీవోలను సంబంధిత శాఖల కార్యదర్శులు జారీ చేయాల్సి ఉంది. కానీ.. ఆ అధికారుల పేర్లు కనిపించకూడదనే ఉద్దేశంతో కాబోలు, సీఎస్ సంతకాలతోనే అవి వెలువడ్డాయి. డీఎస్సీపై ప్రవీణ్ ప్రకాశ్, అన్న క్యాంటీన్లపై శ్రీలక్ష్మి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై అజయ్ జైన్, పింఛన్ల పెంపుపై శశి భూషణ్ సంతకాలతో జీవోలు జారీ చేయాల్సి ఉంది. కానీ... కొత్త ప్రభుత్వం వీరెవరికీ ఆ అవకాశం ఇవ్వలేదు. సీఎస్ పేరిటే సంబంధిత జీవోలు వెలువడ్డాయి.

మానవాళిపైనే ఇజ్రాయెల్ దాడులు

- తన పౌరులను కాపాడుకోవడంలో విఫలం
- యూఎన్ నివేదిక.. ఇజ్రాయెల్ తిరస్కరణ
- మహిళలపై హమాస్ లైంగిక హింస
- శవాల్ని విజయ చిహ్నాలుగా ప్రదర్శించారు
- మరో నివేదికలో వెల్లడించిన ఐరాస
- ఇరు వర్గాలూ యుద్ధనేరాలకు పాల్పడ్డాయని ఆగ్రహం

జెనీవా, జూన్ 13: మహిళలపై లైంగిక అకృత్యాలతో హమాస్ ఉగ్రవాదులు రాక్షసత్వం చాటుకుంటే.. గాజాలో పురుషులు, బాలురే టార్గెట్‌గా ఇజ్రాయెల్ సేనలు మానవత్వంపైనే దాడి చేశాయని, పాలస్తీనా సంపూర్ణ వినాశనానికి ప్రయత్నించాయని.. ఐక్యరాజ్యసమితి పేర్కొంది! ఇరువర్గాలూ యుద్ధనేరాలకు పాల్పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు, పాలస్తీనాలోని సాయుధ మూకల దాడితో మొదలైన యుద్ధంపై ఐక్యరాజ్యసమితి స్వతంత్ర దర్యాప్తు సంఘం లోతుగా విచారణ జరిపి.. రెండు వేర్వేరు నివేదిక అందజేసింది. పాలస్తీనా దళాలు, హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై దాడులు చేసి హత్యలు చేయడం, గాయపరచడం, అవమాన పరచడం, బందీలుగా తీసుకెళ్లడం, మహిళలను లైంగికంగా వేధించడం వంటి అరాచకాలకు పాల్పడినట్టు ఒక నివేదికలో పేర్కొంది. ఇవన్నీ యుద్ధనేరాలేనని, అంతర్జాతీయ మానవత్వ చట్టం (ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ లా-ఐహెచ్‌ఎల్), అంతర్జాతీయ మానవ హక్కుల చట్టం (ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ లా) నిబంధనలను హమాస్ అతిక్రమించిందని స్పష్టం చేసింది. హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌లో ప్రవేశించి నరమేధం సృష్టించినప్పుడు మృతదేహాలను రూపురేఖలు లేకుండా నాశనం చేశారని.. ముఖ్యంగా, మహిళల భౌతిక కాయాల విషయంలో మరీ దారుణంగా వ్యవహరించారని తెలిపింది. చనిపోయిన మహిళల దుస్తులను, వారి శరీర భాగాలను తొలగించడం, తగులబెట్టడం వంటి అకృత్యాలకు ఆధారాలు లభించినట్టు వివరించింది. మహిళలను అపహరించిన సమయంలో అమానుషంగా వ్యవహరించారని, వారి మృతదేహాలను విజయ చిహ్నాలుగా, ట్రోఫీలుగా ప్రదర్శించారని పేర్కొంది. చాలా మంది పిల్లల ముందే వారి బంధువులను హత్య చేశారని, ప్రచారం కోసం వీటన్నింటినీ వీడియోలుగా తీశారని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. పిల్లలను కిడ్నాప్ చేయడంపై దృష్టి పెట్టారని తెలిపింది. ఇజ్రాయెల్ కూడా ఐహెచ్ఎల్, ఐహెచ్ఆర్ఎల్‌లను ఉల్లంఘించిందని మరో నివేదికలో పేర్కొంది. గాజాలో సామాన్య పౌరులపై ఓ పద్ధతి ప్రకారం, విస్తృత స్థాయిలో దాడులు చేసిందని.. అక్కడి వారిని పూర్తిగా నిర్మూలించడం, హత్యలు చేయడం, పాలస్తీనా పురుషులు, బాలురను క్రూరంగా హింసించడం వంటి దారుణాలకు పాల్పడిందని వివరించింది. గాజా ప్రజలకు తిండి, నీళ్లు పరిమితంగా అందేలా చేసి వారి ఆకలిదప్పులతో మాడ్చిందని.. వేలాది మంది చిన్నారులను తీవ్రంగా గాయపరిచిందని పేర్కొంది. అలాగే.. తన పౌరులను కాపాడుకోవడంలో ఇజ్రాయెల్ అన్ని విధాలుగా విఫలమయిందని విమర్శించింది. ముఖ్యంగా దక్షిణ ఇజ్రాయెల్‌లో ప్రజలను ఏ రూపంలోనూ ఆదుకోలేదని పేర్కొంది. బాధితులతో మాట్లాడేందుకు ఇజ్రాయెల్ అనుమతి ఇవ్వకపోవడంతో టర్కీ, ఈజిప్ట్, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని సంప్రదించి సమాచారం సేకరించింది. ఫోరెన్సిక్ నివేదికలు, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా కొన్ని ఆరోపణలను నిర్ధారించుకొంది. ఐక్యరాజ్యసమితి కమిషన్‌కు ఇజ్రాయెల్ అన్ని విధాలుగా ఆటంకాలు కలిగించిందని తెలిపింది. ఈ నివేదికను వచ్చే వారంలో జరగనున్న ఐరాస మానవ హక్కుల మండలి సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. ఈ నివేదికను ఇజ్రాయెల్ తిరస్కరించింది. ఒక పద్ధతి ప్రకారం తమ పట్ల వివక్ష చూపుతున్నారని విమర్శించింది.

రాష్ట్రంలో 'మహిళా శక్తి క్యాంటీన్లు'

» మహిళా సంఘాల బలోపేతానికే ఈ నిర్ణయం: సీఎస్



హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'మహిళా శక్తి క్యాంటీన్ల'ను ఏర్పాటు చేయనున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకు ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. క్యాంటీన్ల ఏర్పాటుపై గురువారం ఆమె సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారని సీఎస్ తెలిపారు. అన్ని ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, బస్టాండ్లు, పారిశ్రామిక ప్రాంతాల్లో మహిళా సంఘాల నిర్వహణలో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇప్పటికే 'దీదీ కీ రసోయి' పేరిట పశ్చిమబెంగాల్‌లో నడుస్తున్న క్యాంటీన్లపై అధ్యయనం చేసినట్లు చెప్పారు. రానున్న రెండేళ్లలో కనీసం 150 క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నామని, వీటి నిర్వహణను గ్రామ ఐక్య సంఘాలకు అప్పగించనున్నామని తెలిపారు. ఈ సంఘాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఈ క్యాంటీన్లకు ఏర్పాటు, నిర్వహణ, వీటికి ఎంత విస్తీర్ణంలో స్థలం అవసరం తదితర అంశాలపై ప్రణాళిక రూపొందించాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌ను ఆదేశించారు.

14 బ్లడ్ బ్యాంకులను ఆధునీకరించాలి

» రక్తదానంపై అవగాహన కల్పించాలి: మంత్రి దామోదర

రాష్ట్రంలో మెరుగైన పని తీరు కనబరుస్తున్న 14 ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులను బ్లడ్ కాంపొనెంట్ సెపరేషన్ యూనిట్లుగా ఆధునీకరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఆయా కేంద్రాలకు అవసరమైన పరికరాలు, ఇతర సౌకర్యాలను కల్పించాలని సూచించారు. 14న ప్రపంచ రక్త దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల పని తీరుపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. నారాయణగూడలో 60 ఏళ్లుగా సేవలందిస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం) బ్లడ్ బ్యాంకులో పూర్తి సౌకర్యాలు కల్పించి, మరింత బలోపేతం చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. ప్రపంచ రక్త దాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో రక్తదానంపై సదస్సులు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

యాదాద్రి ప్లాంట్ నిర్మాణంలో నా పాత్రేమీ లేదు

» ఇంధనశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో తన పాత్రేమీ లేదని ఇంధన శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా తెలిపారు. ఇంధనశాఖలో తాను బాధ్యతలు స్వీకరించేలోపే దాని నిర్మాణానికి ప్రభుత్వం ఉన్నత స్థాయిలో విధానపరమైన నిర్ణయం తీసుకోవడంతో పాటు నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయని జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు ఆయన వివరించినట్లు తెలిసింది. ఈ మేరకు గురువారం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డిని ఆయన కలుసుకున్నారు. కమిషన్ నోటీసులకు బుధవారమే లిఖిత పూర్వక వివరణ ఇచ్చిన అజయ్‌మిశ్రా గురువారం నర్సింహారెడ్డితో భేటీ అయి వివరణ ఇచ్చారు.

'సీతారామ' ప్రాజెక్టుకు మార్గం సుగమం!

» డీపీఆర్‌కు సీడబ్ల్యూసీలో అన్ని విభాగాల అనుమతి

'సీతారామ ఎత్తిపోతల పథకం- సీతమ్మ బ్యారేజీ బహుళార్థ సాధక ప్రాజెక్టు'కు కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)లోని అన్ని డైరెక్టరేట్‌లు అనుమతులు ఇచ్చాయి. దీంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) త్వరలోనే గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు చేరనుంది. వాస్తవానికి సీతారామ, సీతమ్మ బ్యారేజీలు వేర్వేరు కాంపోనెంట్లుగా తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్‌లు దాఖలు చేసింది. 2023 జనవరి 28న సీతారామ, సీతమ్మను కలిపి మరిన్ని మార్పుల అనంతరం 'సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు'గా మార్చి డీపీఆర్‌ను దాఖలు చేశారు. ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.21 వేల కోట్లతో ప్రతిపాదిస్తూ సవరణ డీపీఆర్‌ను సమర్పించారు. దీనిపై సీడబ్ల్యూసీ పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తంచేసింది. వాటికి సమాధానాలు తెలపడంతో సీడబ్ల్యూసీలోని అన్ని విభాగాలు అనుమతులు ఇచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాక సీడబ్ల్యూసీ ఆమోదం పొందిన తొలి డీపీఆర్ ఇదే కావడం గమనార్హం.

రెండో రోజు 59 స్కూల్ బస్సులపై కేసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల బస్సుల్లో ఆర్టీఏ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలో 59 బస్సులపై అధికారులు కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ పరిధిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా తిరుగుతున్న 16, పర్మిట్లు లేని ఐదు బస్సులను సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో తనిఖీలు నిర్వహించిన నాలుగు బృందాలు 38 బస్సులను సీజ్ చేశాయని ఆ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలున్నాయా..? బస్సుల్లో అగ్నిమాపక యంత్రాలు, ప్రాథమిక చికిత్స సామగ్రి, సిటింగ్ ఎలా ఉంది..? తదితర విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. డ్రైవర్ల అనుభవం, వారి వయస్సు డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలను పరిశీలించారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కమ్మ సంఘం ప్రతినిధులు

కమ్మ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌ను నియమించండి

» సీఎంకు కమ్మ సామాజిక వర్గ ప్రతినిధుల వినతి

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన కమ్మ కార్పొరేషన్‌కు ఛైర్మన్, డైరెక్టర్‌లను నియమించాలని కమ్మ సామాజిక వర్గం ప్రతినిధి బృందం సీఎం రేవంత్‌ను కోరింది. కాంగ్రెస్ సీనియర్ నేత బండి రమేశ్ నేతృత్వంలో కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు రవిశంకర్‌రావు, ప్రధానకార్యదర్శి శ్రీరామకృష్ణప్రసాద్, కోశాధికారి రత్నాకర్‌రావుతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కమ్మ సంఘాల ప్రతినిధులు గురువారం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమ్మ సామాజిక వర్గానికి హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో 5 ఎకరాల స్థలాన్ని ఉచితంగా కేటాయించిందని సీఎంకు తెలిపారు. అయితే వివిధ కారణాలతో ఆ భూమి విషయం కోర్టుకు వెళ్లిందని వివరించారు. ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఎన్టీఆర్ స్మృతి వనం ఏర్పాటుచేస్తామని అందుకు కొంత స్థలాన్ని ఇప్పించాలని విన్నవించారు. తమ వినతుల పట్ల సీఎం సానుకూలంగా స్పందించారని కమ్మ సంఘం ప్రతినిధులు తెలిపారు.

వనాల కోసం భూముల గుర్తింపునకు కమిటీ

వనాల పెంపకానికి అవసరమైన ప్రత్యామ్నాయ భూముల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కమిటీకి ఛైర్‌పర్సన్‌గా పీసీసీఎఫ్, సభ్యులుగా చీఫ్ వైల్డ్ వార్డన్, రెవెన్యూ శాఖ నుంచి ఒకరు, సీసీఎల్ఏ నుంచి ఒకరు, అటవీ, పర్యావరణ శాఖ నుంచి ఒకరిని కమిటీలో ప్రతినిధులుగా నియమించారు.

'కోటా' ఐఐటీ, మెడికల్‌ఫౌండేషన్ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం 'కోటా' ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్స్ సిద్ధం చేసినట్లు ఐఐటీ- జేఈఈ/నీట్ ఫోరం వెల్లడించింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్, అసైన్‌మెంట్స్‌ను డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చు. మరింత సమాచారం కోసం II-TF, ME-DF అని టైపు చేసి 9849016661 నంబరుకు వాట్సాప్ మెసేజ్ చేయవచ్చు.

'గ్రోత్ కారిడార్'లో సీఎంకు ప్రత్యేక కార్యాలయం

» హెచ్ఎండీఏ ఛైర్మన్ హోదాలో ఏర్పాటు

» ఇటీవల తరచూ సమీక్షల నేపథ్యంలోనే



హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేశారు. హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఛైర్మన్ హోదాలో ఈ వసతి కల్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రే హెచ్ఎండీఏ అధిపతిగా ఉంటారు. కానీ, గతంలో సీఎంలెవరూ సమీక్షలు, సమావేశాలు జరపలేదు. కానీ, రేవంత్‌రెడ్డి ప్రస్తుతం మున్సిపల్ శాఖ బాధ్యతలు సైతం చూస్తుండడంతో హెచ్ఎండీఏ అభివృద్ధిపై సంబంధిత కార్యాలయానికి వచ్చి సమీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రహరీ ఎత్తు పెంచడంతో పాటు చుట్టూ వ్యూ కట్టర్స్, సౌర కంచె వేయనున్నారు. అగ్నిమాపక చర్యలను పటిష్ఠం చేయనున్నారు. సీసీ కెమెరాలు బిగించనున్నారు. రూ.1.10 కోట్లతో చేపట్టే ఈ పనులకు టెండర్లను ఆహ్వానించారు. హెచ్ఎండీఏ ఛైర్మన్ హోదాకు సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే రెండు ఎలివేటెడ్ కారిడార్లకు అనుమతిచ్చారు. మూసీ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఈ నిధులన్నీ హెచ్ఎండీఏ ద్వారానే సమకూర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నానక్‌రాంగూడలోని హెచ్ఎండీఏ-హెచ్‌జీసీఎల్ కార్యాలయాన్ని త్రిభుజాకారంలో ఉండే స్థలంలో నిర్మించగా, చుట్టూ ప్రధాన రోడ్లున్నాయి. ఐటీ కారిడార్‌లో హెచ్‌జీసీఎల్ భవనాలు ఆకర్షణగా నిలుస్తాయి. గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ కూడా ఈ కార్యాలయానికి అత్యంత ప్రాధాన్యమిచ్చేవారు. మరో వైపు పలు సౌకర్యాలతో పాటు ప్రశాంత వాతావరణంలో సమీక్షలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు జరిపేందుకు అనువైన హాళ్లు కూడా ఉన్నాయి. సీఎం రేవంత్ ఇటీవల ఇక్కడినుంచే సమీక్షలు, సమావేశాలు చేపడుతున్నారు. సీఎం ప్రత్యేక దృష్టిసారించిన నేపథ్యంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) కార్యాలయాన్ని కూడా హెచ్‌జీసీఎల్‌కు తీసుకొచ్చారు. దీనికోసం టీఎస్‌బీపాస్, హైదరాబాద్ ఫార్మాసిటీ, టీఫైబర్‌లను మాసబ్ ట్యాంక్, బషీర్‌బాగ్‌కు తరలించారు. త్వరలోనే హెచ్‌జీసీఎల్ కార్యాలయాన్ని, అర్బన్ ఫారెస్టు విభాగాన్ని పూర్తిగా హెచ్ఎండీఏ కార్యాలయంగా మారుతున్న పాయిగా ప్యాలెస్‌లోకి మార్చాలని నిర్ణయించారు.

గొర్రెల స్కాంలో రంగంలోకి ఈడీ

మనీ లాండరింగ్ కోణంలో విచారణకు సిద్ధం.. లబ్ధిదారులు, వ్యాపారుల వివరాలివ్వాలని లేఖ

» నేడు టీజీఎస్‌జీడీసీఎఫ్ఎల్‌కు అధికారులు.. విచారణ

» కీలక సూత్రధారులు లక్ష్మారెడ్డి, మొహిదొద్దీన్‌పై ఆరా!

» కెనడాలో లక్ష్మారెడ్డి, దుబాయ్‌లో మొహిదొద్దీన్

» వారిని రప్పిస్తే పెద్ద తలకాయలు బయటికొచ్చే చాన్స్



హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కన్నేసింది. ఈడీ అధికారులు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ (టీజీఎస్‌జీడీసీఎఫ్ఎల్) కార్యాలయంలో విచారణ జరపనున్నారు. గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలను మనీ లాండరింగ్ కేసుగా విచారణకు స్వీకరించిన ఈడీ.. కీలక సూత్రధారులైన లక్ష్మారెడ్డి, మొహిదొద్దీన్ ప్రమేయంపై ఆరా తీయనుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో చోటుచేసుకున్న అక్రమాలపై ఏసీబీ విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. గొర్రెల కొనుగోళ్ల పేరిట రూ.700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కేసులో పెద్దఎత్తున డబ్బు చేతులు మారడం, ఇతర రాష్ట్రాలకూ లింకు ఉండడంతో ఈడీ రంగంలోకి దిగింది. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలంటూ ఇప్పటికే గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్యకు హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయం లేఖ రాసింది. జిల్లాల వారీగా లబ్ధిదారుల వివరాలు, అడ్రస్, కాంటాక్ట్ సెల్ నంబర్లు, బ్యాంకు ఖాతా నంబరు, బ్యాంకు పేరు, బ్రాంచి పేరు తదితర వివరాలను ఇవ్వాలని కోరింది. జిల్లాలవారీగా లబ్ధిదారులకు గొర్రెలు అమ్మిన యజమానుల పూర్తి వివరాలు కూడా సమర్పించాలని స్పష్టం చేసింది. గొర్రెలు, మేకల సహకార అభివృద్ధి సంస్థకు సంబంధించిన ఏ బ్యాంకు ఖాతా నుంచి నిధులు బదిలీ చేశారు? బ్యాంకు- బ్రాంచి వివరాలు ఏమిటి? జిల్లాలవారీగా లబ్ధిదారులు తమ వాటా ధనాన్ని ఏ బ్యాంకు ఖాతా నుంచి ఏ బ్యాంకు ఖాతాకు జమ చేశారు? ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలు, రవాణా చేసిన వాహనాలు, గొర్రెల యూనిట్ల వివరాలు కూడా ఇవ్వాలని కోరింది. అలాగే, గొర్రెల దాణా అమ్మిన వ్యాపారులు, లబ్ధిదారుల వివరాలు కూడా ఇవ్వాలని లేఖలో పేర్కొంది. గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలు, పథకం అమలు చేసిన తీరుపై అంతర్గత నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ వివరాలు అత్యవసరమని, తక్షణమే సమర్పించాలని ఈడీ డిప్యూటీ డైరెక్టర్ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారమే ఈడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతున్నారు. గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ కార్యాలయానికి వెళ్లి విచారణ జరపనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈడీ స్వీకరించిన మొట్టమొదటి కేసు కూడా ఇదే!

లక్ష్మారెడ్డి, మొహిదొద్దీన్‌లే సూత్రధారులు

గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అక్రమాలు జరిగాయని, ఈ స్కాం సూత్రధారులు లక్ష్మారెడ్డి, మొహిదొద్దీన్ అంటూ ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. వీరిలో లక్ష్మారెడ్డి ప్రస్తుతం కెనడాలో ఉంటే.. ఏసీబీ కేసులో ఏ-1గా ఉన్న మొహిదొద్దీన్ దుబాయిలో తలదాచుకున్నారు. కోట్లాది రూపాయలు చేతులు మారాయని, మనీ లాండరింగుకు పాల్పడ్డారంటూ వీరిపై ఆరోపణలు వస్తున్నాయి. విదేశాల్లో తలదాచుకున్న వీరిని రాష్ట్రానికి తీసుకు రాగలిగితే కేసు విచారణ ముందుకు సాగే అవకాశాలున్నాయి. వీరిని విచారిస్తే.. కొందరు పెద్దల ప్రమేయం కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే డొంక కదిలించడానికి ఈడీ రంగంలోకి దిగిందనే చర్చ జోరుగా సాగుతోంది. కాగా రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా డాక్టర్ సుబ్బారాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈడీ లేఖ వచ్చిందని, శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈడీ అధికారులు తమ కార్యాలయానికి వస్తున్నారని, తనను అందుబాటులో ఉండాలని కోరారని డాక్టర్ సుబ్బారాయుడు తెలిపారు.

ప్రజాప్రతినిధులకూ నోటీసులు

» నీటి నిల్వ కారణంగానే బ్యారేజీల వైఫల్యం

» పీసీ ఘోష్ కమిషన్‌కు నిపుణుల కమిటీ స్పష్టీకరణ

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అధికారులు, నిపుణులు దాఖలు చేసిన అఫిడవిట్లను అన్నిటినీ పరిశీలించిన తర్వాతే బ్యారేజీల వైఫల్యానికి కారకులుగా భావించే ప్రజా ప్రతినిధులకు నోటీసులు జారీ చేయడంపై నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ కమిషన్ నిర్ణయించింది. కమిషన్ కార్యాలయంలో గురువారం జస్టిస్ పీసీ ఘోష్‌ను విలేకరులు కలిశారు. విద్యుత్తుపై విచారణ చేస్తున్న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. దాంతో.. "నీటిపారుదల శాఖ మంత్రి కేసీఆర్ కాదు. కాళేశ్వరం బ్యారేజీలు కట్టే సమయంలో ఆయన అల్లుడు (హరీశ్ రావు పేరెత్తకుండా) మంత్రిగా ఉన్నారు" అని గుర్తు చేశారు. అయితే, హరీశ్ రావుకు కూడా నోటీసులు ఇస్తారా? అని విలేకరులు తిరిగి ప్రశ్నించగా.. అఫిడవిట్లలో ఉన్న వివరాల ఆధారంగానే నోటీసులపై తదుపరి నిర్ణయం ఉంటుందని బదులిచ్చారు. విచారణలో భాగంగా మరోసారి క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లాలని కమిషన్ యోచిస్తోంది. అలాగే, కేంద్ర నీరు, విద్యుత్తు పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ప్రతినిధులను నేరుగా కలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం సాంకేతిక అంశాలపై విచారణ జరుపుతున్న కమిషన్.. త్వరలోనే ఉల్లంఘనలపై గురిపెట్టనుంది. నీటి మళ్లింపు కోసమే బ్యారేజీలు నిర్మిస్తారని, దానికి భిన్నంగా నదీ గర్భంలో నీటిని నిల్వ చేయడం కారణంగా బ్యారేజీలు విఫలమయ్యాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. నిల్వతో ఒత్తిడి పెరిగి, రాఫ్ట్ (పునాది) కింది నుంచి ఇసుక జారిపోవడం (పైపింగ్ కావడం) వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని వివరించింది. అన్నారం, సుందిళ్లలోనూ సీపేజీలు ఏర్పడ్డాయని గుర్తు చేసింది. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గురువారం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో నిపుణుల కమిటీ ఛైర్మన్ డాక్టర్ సీబీ కామేశ్వరరావు (జేఎన్‌టీయూ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ నిపుణుడు), సభ్యులు కె.సత్యనారాయణ (మాజీ చీఫ్ ఇంజనీర్, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ నిపుణుడు), ప్రొఫెసర్ రమణమూర్తి(ఎన్ఐటీ వరంగల్), ప్రొఫెసర్ పి.రాజశేఖర్ (ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ), కన్వీనర్ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, బ్యారేజీల వైఫల్యానికి కారణాలేమిటని ఘోష్ ఆరా తీయగా.. నీటిని నిల్వ చేయడమే కారణమని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. బ్యారేజీలను నీటి మళ్లింపు కోసమే కట్టాలని, నీటి నిల్వకు రిజర్వాయర్లు/డ్యామ్‌లు కట్టుకోవాలని స్పష్టం చేసింది. బ్యారేజీలను రిజర్వాయర్‌లాగా వాడుకొని నీటిని నిల్వ చేశారని, ఆపరేషనల్ మాన్యువల్ పాటించకుండా నీటిని వదిలారని, అందుకే, బ్యారేజీలు దెబ్బతిన్నాయని తెలిపింది. కాగా, బ్యారేజీలపై రెండు వారాల్లోపు మధ్యంతర నివేదికను అందించి, పూర్తిస్థాయి నివేదికను వీలైనంత త్వరగా సమర్పించాలని కమిటీకి కమిషన్ సూచించింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి పూర్తిస్థాయి నివేదికను తెప్పించుకోవాలని అధికారులను ఆదేశించింది. ఆ తర్వాత హైడ్రాలజీ విభాగం అధికారులను కూడా కమిషన్ ప్రశ్నించింది. శుక్రవారం ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓ అండ్ ఎం)తో పాటు ఈఎన్‌సీ (జనరల్) కార్యాలయంలోని అధికారులను కమిషన్ విచారించనుంది. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణలో భాగంగా ఓపెన్ కోర్టు కూడా నిర్వహించనున్నట్లు కమిషన్ ప్రకటించింది. ఓపెన్ కోర్టుకు ప్రజలు ఎవరైనా నేరుగా హాజరై, విచారణ క్రమంలో బాధ్యులైన వారిని ప్రశ్నలు అడిగే అవకాశం ఇస్తామని తెలిపింది.

మాజీ సీఎం కేసీఆర్‌పై ఈడీ కేసు నమోదైంది: రఘునందన్



మెదక్ అర్బన్, జూన్ 13: గొర్రెల కొనుగోలు వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు(ఈడీ) కేసు నమోదు చేశారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ఈ మేరకు కొద్దిసేపటి క్రితమే తనకు హైదరాబాద్ నుంచి ఫోన్ వచ్చిందన్నారు. మెదక్‌లో గురువారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ, సన్మానసభలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డికి ముందుంది ముసళ్ల పండుగ అని వ్యాఖ్యానించారు. ఈడీ కేసు ప్రభావం వీళ్ల ఇద్దరిపైనా ఉంటుందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక గెలిచామని విర్రవీగిన ఆరడుగుల హరీశ్.. ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. అన్ని ఎన్నికలను డబ్బుతో గెలవలేమని ప్రజలు నిరూపించారన్నారు. ఎంపీ ఎన్నికల్లో రూ.500 కోట్లు ఖర్చు పెట్టినా.. వెంకట్రామిరెడ్డి గెలవలేకపోయారని చెప్పారు. రూ.లక్ష కోట్లు ఉన్న వ్యక్తికి ఎంత విలువ ఉంటుందో.. పూటకు బువ్వ లేని కార్యకర్తకు కూడా తమ పార్టీలో అంతే విలువ ఉంటుందన్నారు. మెదక్ లోక్‌సభ స్థానంలో బీజేపీ జెండా ఎగరవేసి, ప్రధాని మోదీకి గిఫ్ట్ ఇచ్చామన్నారు. పార్లమెంట్‌లో గొప్ప నేతల పక్కన కూర్చునే అవకాశం కల్పించిన మెదక్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు.

రుణమాఫీకి రూ. 25 వేల కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయపన్ను చెల్లించేవారిని, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రూ.10 వేలకు మించి పింఛన్ పొందుతున్న రిటైర్డ్ ఉద్యోగులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు తదితర కీలక పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులను, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్ల వంటి ప్రొఫెషనల్స్‌ను కేంద్ర ప్రభుత్వం ఈ పథకం నుంచి మినహాయించింది. నాలుగో తరగతి సిబ్బందిని మాత్రం అర్హులుగా చేర్చింది. 2018 డిసెంబరు నుంచి పీఎం- కిసాన్ పథకం కింద కేంద్రం ఇప్పటివరకూ 18 విడతలుగా నగదు బదిలీ చేసింది.

ఇదీ లెక్క..

తెలంగాణలో 3 లక్షల మంది రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, లక్షన్నర మంది పెన్షనర్లు, మరో లక్షన్నర మంది కేంద్ర ఉద్యోగులు ఉన్నారు. అంటే.. అంతాకలిపి 6 లక్షల మంది దాకా ఉంటారు. అలాగే 119 మంది ఎమ్మెల్యేలు, 17 మంది లోక్‌సభ సభ్యులు, ఏడుగురు రాజ్యసభ సభ్యులు, 40 మంది ఎమ్మెల్సీలు,



33 మంది జడ్పీ ఛైర్మన్లు, 13 మంది మేయర్లు ఉన్నారు. వీరితోపాటు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ మేయర్లు, మాజీ జడ్పీ ఛైర్మన్లను లెక్కేస్తే ఆ సంఖ్య భారీగానే ఉంటుంది. ఇక.. రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది ఆదాయపన్ను చెల్లింపుదారులు ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో పంట రుణాలు తీసుకున్న వారి సంఖ్య 47 లక్షలు కాగా.. వారి బ్యాంకు, రుణ ఖాతాలు, ఆధార్, పాన్‌కార్డు నంబర్లన్నింటిని సీడింగ్ చేసి జల్లెడ పడితే అంతిమంగా లబ్ధిదారుల సంఖ్య ఎంతో తేలే అవకాశం ఉంది.

సగానికి సగమే..

'ధరణి' పోర్టల్ ప్రకారం రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది పట్టాదారు పుస్తకాలు కలిగిన రైతులు ఉన్నారు. అయితే ఇందులో పీఎం- కిసాన్ లబ్ధిదారులు మాత్రం సుమారు 33 లక్షల మందే ఉన్నారు. అంటే రాష్ట్రంలో ఉన్న పట్టాదారుల్లో సగం మందికి మాత్రమే పీఎం- కిసాన్ పథకం అమలవుతోంది. నిజానికి ఆ పథకానికి అర్హులై ఉండి కూడా దరఖాస్తు చేసుకోని రైతులూ రాష్ట్రంలో చాలా మంది ఉన్నట్టు సమాచారం. అలాంటివారిని కూడా కలుపుకొంటే రుణమాఫీకి దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య మరికొంత ఎక్కువ ఉండొచ్చు. ఏదేమైనా ఆ మార్గదర్శకాలను రుణమాఫీ పథకానికీ అనుసరిస్తే.. అర్హులకు మాత్రమే పథకాన్ని అమలుచేయొచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతోపాటు ఇతర రాష్ట్రాల్లో రుణమాఫీ పథకం అమలు తీరుపైనా అధికారుల బృందాలు అధ్యయనం చేశాయి. పీఎం- కిసాన్ మోడల్‌ను తీసుకోవాలా? ఇతర రాష్ట్రాల్లో అమలుచేసినట్లు చేయాలా? అనే అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

పూర్తిస్థాయి బడ్జెట్‌పై 18 నుంచి భట్టి సమీక్ష



హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రతిపాదనలపై 18 నుంచి డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. దీనిపై అన్ని ప్రభుత్వ శాఖలకు డిప్యూటీ సీఎం కార్యాలయం సమాచారం పంపింది. తమ శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేసుకోవాలని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ఇప్పటికే 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఈ తాత్కాలిక బడ్జెట్ స్థానంలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల కారణంగా కేంద్ర ప్రభుత్వం ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓట్-ఆన్-బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ జూలైలో నిర్వహించే వర్షాకాల సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. ఇందులో రాష్ట్రానికి వచ్చే గ్రాంట్లు, ప్రత్యేక గ్రాంట్లు, పన్ను వాటాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. జూలైలోనే రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నిర్వహించి ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. దీని కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ కసరత్తు ప్రారంభించింది. బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేసుకోవాలని అన్ని శాఖలను ఆదేశించింది. ఏ శాఖకు ఎంత బడ్జెట్ అవసరం, రాబడుల శాఖల పని తీరు, ప్రభుత్వ పథకాలవారీగా కేటాయింపులు, ఉద్యోగుల సంఖ్య, కొత్త పోస్టుల భర్తీ వంటి అంశాలపై సమీక్ష సమావేశాల్లో చర్చించనున్నారు.

విద్య.. వినోదం.. ఉల్లాసం

» అంగన్‌వాడీ పిల్లలకు కొత్త పాఠ్యాంశాలు

» తంగేడుపువ్వు, పాలపిట్ట స్థానంలో 'ప్రియదర్శిని' పుస్తకాలు తెచ్చిన సర్కార్



అంగన్‌వాడీల్లోకి తీసుకొచ్చిన 'ప్రియదర్శిని'

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నపిల్లలకు విద్య భారంగా కాకుండా వినోదంగా ఉల్లాసంగా ఉండాలనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. అంగన్‌వాడీల్లో చేరే 3-6 ఏళ్ల వయసున్న చిన్నారులకు చదువు పట్ల ఆసక్తి పెరిగేలా వినూత్న అంశాలు, నూతన పాఠ్యాంశాలతో కూడిన కొత్త పుస్తకాలను రూపొందించింది. వీటిని ఈ విద్యా సంవత్సరం నుంచే పిల్లలకు అందించనుంది. ఇందుకు సంబంధించిన కసరత్తు ఇప్పటికే పూర్తవ్వగా, పలు అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలు కూడా చేరాయి. రాష్ట్రంలోని అంగన్‌వాడీల్లో ఇప్పటి వరకు 'తంగేడుపువ్వు' 'పాలపిట్ట' అనే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పిల్లల వయసుల వారీగా ఒకటి, రెండు నమూనాలతో ఉన్న పుస్తకాలను ఇచ్చేవారు. ఆ పుస్తకాల్లో పాత విధానం ఉండడంతో పాటు, పిల్లలు కూడా ఆ పుస్తకాల్లోని అంశాల పట్ల పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదని గ్రహించిన మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు.. కొత్త పుస్తకాలను, కొత్త పాఠ్యాంశాలను అందుబాటు లోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే.. తంగేడు పువ్వు, పాలపిట్ట పుస్తకాల స్థానంలో 'ప్రియదర్శిని' అనే కొత్త పుస్తకాన్ని రూపొందించారు. అయితే గతంలో రెండు పుస్తకాలుండగా.. ఇక నుంచి ఒక్క పుస్తకమే పిల్లల వయసుల వారీగా ఒకటి, రెండు నమూనా లతో అందుబాటులోకి రానుంది. 'ప్రియదర్శిని'లో విద్యను.. ఆటలు, పాటలు, కథల రూపంలో చిట్టిబుర్రలకు సులువుగా అర్థమయ్యేలా రూపొందించారు. పిల్లలకు చదువుపై ఆసక్తి పెరగాలంటే.. వారు ఏం కోరుకుంటారు అనే అంశం ఆధారంగా ఈ పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు అధికారికవర్గాల ద్వారా తెలిసింది. ఇందుకు అవసరమైన కొత్త కుర్చీలు, ఆట, పాటల వస్తువులను కూడా సమకూర్చను న్నారు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అంగన్‌వాడీల్లో చేరే పిల్లలకు యూనిఫామ్‌లను అందించాలని సర్కారు యోచిస్తోంది. ఇందుకు సంబంధించి రెండు, మూడు యూనిఫామ్ నమూనాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్టు సమాచారం.

తెలుగు పుస్తకాలు వెనక్కి

» 'ముందుమాట'పై వివాదం నేపథ్యంలో విద్యాశాఖ నిర్ణయం

» ఆ పేజీ మరోవైపున వందేమాతరం, జాతీయ గీతం

» దాన్ని తొలగిస్తే ఇబ్బందే..!

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు పాఠ్య పుస్తకాల్లో ముందుమాట మార్చకుండా విద్యార్థులకు పంపిణీ చేయడం వివాదాస్పదమవడంతో వాటిని వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాలవుతున్నా.. 1 నుంచి పదో తరగతుల తెలుగు పుస్తకాల్లోని ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు, అధికారుల పేర్లే ఉండడం వివాదానికి కారణమైన సంగతి తెలిసిందే.. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం పంపిణీ చేసిన పుస్తకాలతో పాటు, ఇంకా పంపిణీ చేయకుండా ఆయా మండల కేంద్రాల్లో ఉన్న పుస్తకాలను కూడా వెనక్కి తెప్పిస్తున్నారు. ఈ పుస్తకాల్లోని 'ముందుమాట'లో మార్పులు చేస్తారా? లేక గత ప్రభుత్వంలోని ముఖ్యుల పేర్లున్న స్థానంలో స్టిక్కర్‌ను అతికిస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే ముందుమాట పేజీని తొలగించి దాని స్థానంలో మరో పేజీని అతికించడానికి కొన్ని సాంకేతిక ఇబ్బందులున్నట్టు తెలుస్తోంది. ఈ ముందుమాట ఉన్న పేజీ మరోవైపు వందేమాతరం, జాతీయ గీతం ముద్రించి ఉన్నాయి.. దాంతో దీన్ని ఎలా సరిచేస్తారనేది ఆసక్తిగా మారింది.



మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్‌తో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న

ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న ప్రమాణ స్వీకారం

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి కూడా
- తన చాంబర్‌లో ప్రమాణం చేయించిన మండలి చైర్మన్

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ గురువారం ఎమ్మెల్సీగా ప్రమాణం చేశారు. ఆయనతోపాటు మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డి కూడా శాసనమండలి సభ్యుడిగా ప్రమాణం చేశారు. ఇద్దరు ఎమ్మెల్సీలతో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శాసన మండలి విధి విధానాలు, సభ్యులు వ్యవహరించాల్సిన తీరును వారికి తెలియజేయడంతోపాటు, పూర్తి వివరాలున్న పుస్తకాలను మండలి చైర్మన్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

'ధరణి'తో కేసీఆర్, 'భూరక్ష'తో జగన్ పతనం

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ వల్ల తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం, భూరక్ష పథకం వల్ల ఏపీలో జగన్ సర్కారు పతనమయ్యాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. జగన్ తీసుకొచ్చిన భూరక్ష పథకానికి ఏపీ నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాతర వేయడం అభినందనీయమంటూ గురువారం ఓ ప్రకటన చేశారు. రైతుల భూముల పత్రాలపై జగన్ ఫొటో అనే అంశంపై ఏపీ రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. రైతులు ఎన్నిసార్లు నిరసనలు తెలిపినా జగన్ పట్టించుకోలేదని గుర్తు చేశారు. కానీ జగన్ అహంకారం చంద్రబాబు చేతిలో నరికివేతకు గురైందని పేర్కొన్నారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి: కార్మిక సంఘం

సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వల్ల చేనేత రంగం సంక్షోభంలో పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ వస్త్రాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా గత ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా చేనేతలను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ చేనేతలకు ఆధునిక మగ్గాలు అందించాలని కోరారు.

'ఆపరేషన్ కగార్'కు అమాయక ఆదివాసీల బలి

- తెలంగాణ పౌరహక్కుల సంఘం

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న 'ఆపరేషన్ కగార్'లో భాగంగా 30కి పైగా ఎన్ కౌంటర్లలో 130 మందిని హత్య చేశారని.. ఇందులో సగంకన్నా ఎక్కువ ఆదివాసీలే ఉన్నారని పౌరహక్కుల సంఘం పేర్కొంది. ప్రభుత్వాలు కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌కు ఆదివాసీలు బలవుతున్నారని తెలంగాణ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు జి.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈనెల12న ములుగుజిల్లా వెంకటాపురం మండలం తడపాల వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు నిరాయుధులైన మావోయిస్టు దళ సభ్యులు రీతా, మోతీ, ఇద్మాల్‌తోపాటు పనులరీత్యా అడవికి వెళ్తున్న మరో ముగ్గురిని మార్గమధ్యలో పట్టుకొని ఎన్‌కౌంటర్ పేరుతో వారిని చంపే యత్నం చేస్తున్నట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. అరెస్టు చేసిన వారిని 24 గంటల్లో కోర్టులో హాజరు పర్చాలని వారిపై ఎటువంటి కేసులు లేని పక్షంలో వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రిజిస్ట్రేషన్‌కు డబ్బులు వసూలు చేసిన ఆపరేటర్

- బాధితుడికి తిరిగి ఇప్పించిన మాజీ ఎమ్మెల్యే

గజ్వేల్, జూన్ 13: గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయంలో ఓ ఆపరేటర్ రిజిస్ట్రేషన్ చేసేందుకు తీసుకున్న డబ్బులను మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి తిరిగి బాధితుడికి ఇప్పించారు. గజ్వేల్‌లోని సంగుపల్లికి చెందిన రాములుగౌడ్ వద్ద తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ రిజిస్ట్రేషన్ విషయంలో రూ.4500 వసూలు చేశాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కార్యాలయానికి వెళ్లి ఆపరేటర్‌ను నిలదీశారు. తహసీల్దార్‌కు విషయం చెప్పారు. దీంతో తహసీల్దార్ ఆపరేటర్‌ను పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని ఆదేశించారు. దీంతో సదరు ఆపరేటర్ బాధితుడికి డబ్బులు తిరిగి ఇచ్చేశాడు. ఆపరేటర్‌ను సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ముస్లింలపై పెరుగుతున్న దాడులు: అసదుద్దీన్

లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలోని పలు ప్రాంతాల్లో ముస్లింలపై దాడులు పెరుగుతున్నాయని మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఇద్దరు మౌలానాలను హత్య చేశారని పేర్కొన్నారు. అక్బర్‌నగర్‌లో ముస్లింల ఇళ్లను బుల్‌డోజర్‌తో కూల్చివేశారని, ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు ముస్లింలను కొట్టి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇది ముస్లింలపై సంఘ్ పరివార్ తీర్చుకుంటున్న ప్రతీకారమా?" అని అసదుద్దీన్ ఒవైసీ గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

బీమా సొమ్ముకు కక్కుర్తి పడిన ఎస్సైపై వేటు

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వాహన బీమా సొమ్ము క్లయిమ్ కోసం కేసు దర్యాప్తులో అవకతవకలకు పాల్పడిన నిర్మల్ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. చంద్రమోహన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఫిబ్రవరి 2న ద్విచక్ర వాహనం-కారు ఢీకొని ప్రమాదం జరగగా ఫిబ్రవరి 6న ప్రమాదం జరిగినట్టు, 13న కేసు నమోదు చేసి కారు యజమానికి ప్రయోజనం కలిగే విధంగా తప్పుడు సెక్షన్లు నమోదు చేసినట్టు దర్యాప్తులో తేలడంతో చంద్రమోహన్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ 1 ఐ జి రంగనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రమోహన్ గతంలో సారంగాపూర్ పరిధిలో పనిచేసినప్పుడు జూద గృహాలను ప్రోత్సహించినట్లుగా ఆరోపణలున్నాయి.

ఒలింపియాడ్‌లో నారాయణ విజయదుందుభి

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో తమ సంస్థ విద్యార్థులు విజయదుందుభిని మోగించారని నారాయణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శరణి తెలిపారు. ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంపుకు తమ విద్యార్థులు 45 మంది ఎంపికయ్యారని ఆమె గుర్తు చేశారు. ఆ 45 మందిలో 10 మంది జూనియర్ సైన్స్ ఒలింపియాడ్, ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్, ఏషియన్ ఫిజిక్స్ ఒలింపియాడ్, జూనియర్ ఆస్ట్రానమీ ఒలింపియాడ్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ విషయంలో నారాయణ సంస్థ మొదటి స్థానంలో ఉందని శరణి అన్నారు.

బొగ్గు ఉత్పత్తిని పెంచుతాం

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- ఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : దేశంలో బొగ్గు ఉత్పత్తిని పెంచుతామని, ఖనిజాలను వెలికి తీసేందుకు కృషి చేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో గురువారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశంలో పదేళ్ల క్రితం విద్యుత్ కొరత ఉండేదని, గడిచిన పదేళ్లలో ప్రధాని మోదీ ఆ సమస్యకు చెక్ పెట్టారని తెలిపారు. దీనికి ప్రధాన కారణం బొగ్గు ఉత్పత్తి పెరగడమేనని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎంతో నమ్మకంతో రెండు శాఖలు అప్పగించారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, సతీశ్ చంద్ర దూబే, బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రాజాసింగ్ పాల్గొన్నారు.

కేంద్రం హోంశాఖ సహాయ మంత్రిగా
బండి సంజయ్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సంజయ్‌కు విద్యారణ్య భారతి స్వామిజీ ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో సహచర కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యేలు రాజాసింగ్, వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్ రెడ్డి, సంకినేని వేంకటేశ్వర రావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు బండి సంజయ్‌ను సత్కరించారు.

సివిల్ ఏవియేషన్‌లో మోడల్ స్టేట్‌గా ఏపీ

- పౌరవిమానయాన మంత్రిగా రామ్మోహన్ బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పౌర విమానయాన రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శ రాష్ట్రం(మోడల్ స్టేట్)గా తీర్చిదిద్దుతానని పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. రాష్ట్రంలోని భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం ఐదేళ్లుగా కుంటుపడిందని, తక్షణమే దాన్ని రికార్డు స్థాయిలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గురువారం పౌర విమానయాన మంత్రిగా రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారత విమానయాన రంగాన్ని ప్రపంచస్థాయిలో అగ్రస్థాన నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. 2030 వరకు ఆ దిశగా ముందుకెళ్లేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తెలంగాణలోని ఎయిర్‌పోర్టులపై ఆ రాష్ట్రప్రభుత్వంతో చర్చించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. విజయవాడ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

కూలీల మధ్యన పిడుగు

పత్తి విత్తనాలు వేస్తుండగా ఘటన.. వికారాబాద్ జిల్లాలో యువతి మృతి.. ఖమ్మం జిల్లా బోనకల్‌లో గీత కార్మికుడు

- రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో భారీ వర్షం
- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో 7.45 సెం.మీ వర్షపాతం
- నేడు, రేపు కొన్ని ప్రాంతాల్లో వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్‌బజార్‌లో వరద నీరు

ఆడుతూపాడుతూ కూలీ పనులు చేస్తున్న ఆ పదిమంది మధ్య అనూహ్యంగా పిడుగు పడింది. ఊహించని పరిణామం నుంచి తేరుకుని చూసేసరికి ఓ యువతి కుప్పకూలి కనిపించింది. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్‌కోట్‌లో గురువారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన మహేష్ భార్య మధులత (22) పలువురితో కలిసి గురువారం కూలీకి వెళ్లింది. విత్తనాలు విత్తుతుండగా భారీ వర్షం వచ్చి కూలీల మధ్యన పిడుగుపడింది. మధులతను తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని వైద్యులు తెలిపారు. మరో కూలీ దస్తమ్మకు గాయాలయ్యాయి. మధులతకు ఏడాది కింటటే వివాహమైంది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం మోటమర్రిలో కల్లు తీసేందుకు వెళ్తున్న గీత కార్మికుడు చిట్టిమోదు విష్ణు పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. కాగా, రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని వివరించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఈదురుగాలులతో వర్షం పడింది. హైదరాబాద్ నగరంలో అరగంట పాటు వాన కురిసింది. సైదాబాద్ మండలం కుర్మగూడలో అత్యధికంగా 4.1 సెంటీమీటర్లు, చార్మినార్ మండలం డబీర్‌పురాలో 4.0 సెంటీమీటర్లు నమోదైంది.

ఖమ్మం జిల్లాలో ఉదయం నుంచి తీవ్రమైన ఎండ కాసినా.. సాయంత్రం మబ్బులుపట్టి వాన కుమ్మేసింది. 5 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. గాలి దుమారంతో విద్యుత్తు నిలిచిపోయింది. ఖమ్మంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఖమ్మం రూరల్, మధిర, చింతకాని, రఘునాథపాలెం, తల్లాడ, ముదిగొండ, కామేపల్లి, వైరాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డివిజన్ మంగల్‌పల్లిలో 7.45 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. కొన్నిచోట్ల గాలులకు చెట్లకొమ్మలు విరిగాయి. కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో అధికారులు సెల్‌ఫోన్ వెలుతురులో విధులు నిర్వహించారు. విద్యుత్‌కు అంతరాయం కలగడంతో ఇబ్బంది ఎదుర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో 1.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యాదగిరిగుట్ట కొండపై మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కురిసిన వర్షానికి భక్తులు తడిసి ముద్దయ్యారు. ఉత్తర దిశలో భారీ షెడ్డు వేసినప్పటికీ నీటితో నిండిపోయింది. భక్తులు నిల్చొనే ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ సమీపంలో ఇచ్చోడకు వెళ్లే రోడ్డుపై విద్యుత్ స్తంభం పడిపోగా, కొండాపూర్‌లో నియంత్రికలు కిందపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్ గ్రామంలో గురువారం గాలివాన బీభత్సంతో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి.





పిడుగుపాటుకు గురై మృతిచెందిన విష్ణు, మధులత (ఫైల్)

'కొడంగల్'లో విద్యాసంస్థల నిర్మాణానికి రూ.73 కోట్లు

- కొడంగల్, బురాన్‌పల్లిలో గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్మాణం
- ఉత్తర్వులు జారీ చేసిన బీసీ సంక్షేమ శాఖ

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్మాణానికి ప్రభుత్వం రూ.73.45 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ గురుకుల జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.25కోట్లు, బీసీ గురుకుల పాఠశాల కోసం రూ.23.45 కోట్లు, అదేవిధంగా బొమ్మరాసిపేట మండలం బురాన్‌పేటలో బీసీ గురుకుల పాఠశాల, కళాశాల నిర్మాణానికి మరో రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఇవన్నీ కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ(కడా) పరిధిలోనే ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.



సీఎం రేవంత్‌ను కలిసిన జపాన్ రాయబారి సుజుకి హిరోషి

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జపాన్ రాయబారి సుజుకి హిరోషి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్య రంగాలు, ఉపాధి కల్పన తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. వీరితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా ఉన్నారు.

ఆటోను ఢీకొట్టి.. ఆపబోయిన వ్యక్తినీ ఢీకొట్టి..

- మద్యం మత్తులో కారుతో బీభత్సం సృష్టించిన ముగ్గురు యువకులు
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి.. చావు బతుకుల్లో ఆటోడ్రైవర్

మంగళ్‌హాట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పీకలదాకా మద్యం తాగి, ఆ మత్తులో కారును మితిమీరిన వేగంతో దూకించి ఆటోను ఢీకొట్టారు ముగ్గురు యువకులు! ఈ దారుణాన్ని చూసి.. కారుకు ఎదురెళ్లి ఆపేందుకు యత్నించిన యువకుడ్నీ నిర్దాక్షిణ్యంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కారును ఆపబోయిన వ్యక్తి తీవ్రగాయాలతో ప్రాణాలొదిలితే, ఆటో డ్రైవర్ చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. హైదరాబాద్ నాంపల్లిలో ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన వివరాలను నాంపల్లి పోలీసులు గురువారం వెల్లడించారు. ఏపీ ప్రకాశం జిల్లా అంబవరం గ్రామానికి చెందిన రాజశేఖర్, శ్రీకాంత్, మధు స్నేహితులు. ఈ ముగ్గురూ కూకట్‌పల్లిలోని ఓ హాస్టల్లో ఉంటూ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నారు. వీరితో పాటు ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు అనే యువకుడు ఉంటున్నాడు. ఈనెల 9న రాజశేఖర్ పుట్టినరోజు కావడంతో వేడుకగా జరుపుకొనేందుకు అంతా కలిసి చార్మినార్ వెళ్లాలనుకున్నారు. ఆంజనేయులు తన కారులో రాజశేఖర్, శ్రీకాంత్‌ను ఎక్కించుకొని అర్ధరాత్రి 12గంటలకు చార్మినార్ వెళ్లాడు. దారిలోనే ఓ వైన్‌షాపులో ఎనిమిది బీర్లు కొనుక్కొని ముగ్గురూ కారులోనే తాగారు. చార్మినార్ వద్ద రాజశేఖర్ కేక్ కట్ చేశాడు. తిరుగు ప్రయాణంలో అఫ్జల్‌గంజ్ వద్ద మరో మూడు బీర్లు కొని తాగారు. తర్వాత కూకట్‌పల్లి హాస్టల్‌కు కారులో మితిమీరిన వేగంతో వెళుతూ నాంపల్లి మెట్రో స్టేషన్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదం దాటికి ఆటో పల్టీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారును నడుపుతున్న ఆంజనేయులు వాహనాన్ని ఆపకపోగా మరింత వేగంతో ముందుకు దూకించాడు. అదే సమయంలో.. కోఠిలోని ఓ హోటల్లో డిన్నర్ చేసిన నేరేడ్‌మెట్ వాస్తవ్యుడు అజయ్ (36) అనే యువకుడు అతడి స్నేహితులు, నాంపల్లి దగ్గర టీ తాగేందుకు ఆగారు. ఆటోను కారు ఢీకొట్టడాన్ని చూసిన అజయ్, వేగంగా దూసుకొస్తున్న కారును ఆపేందుకు ఆ వాహనానికి ఎదురెళ్లాడు. ఇది చూసి.. కారు లోపల ఉన్న రాజశేఖర్, శ్రీకాంత్.. వాహనం స్పీడును మరింతగా పెంచి, అతడ్ని ఢీకొట్టాలని ఆంజనేయులును ప్రోత్సహించారు. మద్యం మత్తులో ఉన్న ఆంజనేయులు కారుతో అజయ్‌ను ఢీకొట్టాడు. దీంతో అతడికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. తర్వాతా ఆంజనేయులు కారు ఆపకుండా మాసబ్ ట్యాంక్ వైపు కారును తిప్పాడు. ప్రమాదాన్ని చూసిన అజయ్ స్నేహితులు బైక్‌తో కారును వెంబడించి మాసబ్‌ట్యాంక్ పై ఓవర్‌పైన అడ్డుకున్నారు. అక్కడ కారును ఆపిన ముగ్గురూ అందులోంచి దిగి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను, ఆటోడ్రైవర్‌ను నిమ్స్‌లో చేర్పించారు. వారిలో అజయ్ గురువారం మృతి చెందాడు. ఆటోడ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన మర్నాడే నిందితులు ఆంజనేయులు, రాజశేఖర్, శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

అగ్నిమాపక శాఖ బలోపేతానికి రంగం సిద్ధం

రూ.190 కోట్లతో కొత్త వాహనాలు, భవనాలు.. కేంద్రంతో కుదిరిన అవగాహన ఒప్పందం

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలంలో ఎదురవుతున్న సవాళ్లకు అనుగుణంగా అగ్నిమాపక శాఖను బలోపేతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. బహుళ అంతస్తుల భవనాలు, పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో తక్షణం స్పందించడంతోపాటు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సహాయక చర్యలు చేపట్టేందుకు అధునాతన పరికరాలు ఉపయోగించాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత విభాగాలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి కేంద్ర హోంశాఖ అధికారులతో సంప్రదింపులు జరిపారు. రాష్ట్రంలో రూ.190.14 కోట్లతో ఈ శాఖ బలోపేతానికి చర్యలు చేపట్టేందుకు కేంద్ర హోంశాఖ, రాష్ట్ర అగ్నిమాపక శాఖ అధికారుల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మొత్తం ప్రతిపాదిత నిధుల్లో కేంద్రం రూ.142.61 కోట్లు ఇవ్వనుందని, రాష్ట్రం వాటా కింద రూ.47.53 కోట్లు త్వరలోనే విడుదల కానున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఈ నిధులను వినియోగించి 2026 నాటికి అన్ని పనులు పూర్తిచేసి ఆధునాతన సాంకేతిక పరికరాల ద్వారా అగ్నిమాపక సేవలు అందించనున్నారు. 100 నుంచి 200 మీటర్ల పైబడి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్న హైదరాబాద్ సహా.. 10 ఉమ్మడి జిల్లాలకు ప్రయోజనం కలిగించేలా అధునాతన పరికరాలు అందుబాటులోకి తెచ్చేలా అగ్నిమాపక శాఖ కసరత్తు చేస్తోంది.

అత్యాధునిక వాహనాలు

అత్యాధునిక పరికరాలతో కూడిన వాహనాలు కొనుగోలు చేసేందుకు రూ.87.57 కోట్లతో సంబంధిత విభాగాలు ప్రతిపాదనలు రూపొందించాయి. ఇందులో 104 మీటర్ల పొడవైన హైడ్రాలిక్ ప్లాట్‌ఫాం, 68 మీటర్ల పొడవైన టర్న్‌టేబుల్ నిచ్చెన, 32 మీటర్ల పొడవైన హైడ్రాలిక్ ప్లాట్‌ఫాం, మంటలను ఆర్పే రోబోలు, అధిక పీడనం కల పంపులతో కూడిన 18 అగ్నిమాపకశాఖ వాహనాలు కొనుగోలు చేయనున్నారు. అలాగే ప్రమాద స్థలానికి తక్షణం చేరుకునేందుకు వీలుగా రూ.57.04 కోట్లతో 18 అగ్నిమాపక శాఖ కార్యాలయాలను ఆధునీకరించడం, వాహనాలు, అగ్నిమాపక పరికరాలు కొనుగోలు చేయనున్నారు. రెండు వాహనాలున్న మేడ్చల్-మల్కాజిగిరి, చాంద్రాయణగుట్ట, ఎల్బీ నగర్, జూబ్లీహిల్స్ అంబర్‌పేట, రాజేంద్రనగర్, షాద్‌నగర్ అగ్నిమాపక కార్యాలయాలతోపాటు ఒకే వాహనమున్న అలంపూర్, మక్తల్, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సాపూర్, హుస్నాబాద్, డోర్నకల్, కల్వకుర్తి, పినపాక, బాల్కొండ, ధర్మపురి, నందిపేట కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించనున్నారు. ప్రమాద సమయంలో తక్షణ సమాచారం చేరవేసేందుకు అధునాతన కమాండ్ కంట్రోల్ రూం, ఇతరాల కోసం రూ.9.50 కోట్లు వెచ్చించనున్నారు. సమాచార వ్యవస్థ, వనరుల నిర్వహణ వంటివి ఈ నిధుల ద్వారా ఏర్పాటు చేయనున్నారు. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయాలతో పాటు చెన్నూర్, నిజామాబాద్ రూరల్, పాలకుర్తి, భూపాలపల్లి, వైరా, కొత్తకోట, మక్తల్, కొడంగల్, ఆలేరు, ఖానాపూర్, మోత్కూరు, జడ్చర్లలో కొత్త అగ్నిమాపక శాఖ భవనాలు నిర్మించేందుకు ఆ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

లాసెట్‌లో 72.66% ఉత్తీర్ణత

- మూడేళ్ల కోర్సులో టాపర్ అంబేద్కర్
- ఐదేళ్ల కోర్సులో టాపర్ శ్రీరామ్
- ఉత్తీర్ణులైన నలుగురు ట్రాన్స్‌జెండర్లు
- కౌన్సెలింగ్ షెడ్యూల్‌పై త్వరలో ప్రకటన

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయవిద్యకు సంబంధించి రాష్ట్రంలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్, పీజీఎల్‌సెట్ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. లాసెట్-2024లో 72.66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో మూడేళ్ల లా కోర్సులో 73.27 శాతం, ఐదేళ్ల లా కోర్సులో 65.12 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే, పీజీఎల్‌సెట్‌లో 84.65 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి గురువారం ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ , ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ వి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. మూడేళ్ల లా కోర్సు పరీక్షకు 27,993 మంది అభ్యర్థులు హాజరవ్వగా వారిలో 20,510 మంది ఉత్తీర్ణత సాధించారు. ఐదేళ్ల కోర్సుకు 8,412 మంది హాజరు కాగా 5,478 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక, పీజీఎల్‌సెట్‌కు 3,863 మంది హాజరవ్వగా 3,270 మంది ఉత్తీర్ణత సాధించారు. లాసెట్-2024కు ఐదుగురు ట్రాన్స్ జెండర్లు దరఖాస్తు చేసుకోగా వారిలో పరీక్షకు హాజరైన నలుగురు ఉత్తీర్ణత సాధించారు. కాగా, లాసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు చెప్పారు.

టాపర్ హైదరాబాదీ అంబేద్కర్

లాసెట్-2024లో మూడేళ్ల లా కోర్సు ప్రవేశ పరీక్షలో హైదరాబాద్‌కు చెందిన అంబేద్కర్ 97.49 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. గచ్చిబౌలికి చెందిన ప్రత్యూష్ 96.65 మార్కులతో రెండో ర్యాంకు, ఖమ్మం జిల్లా సింగరేణికి చెందిన తల్లూరి నరేష్ 95.74 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. ఇక, ఐదేళ్ల లా కోర్సులో హైదరాబాద్, మియాపూర్‌కు చెందిన బొడ్డు శ్రీరామ్ 87 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. కామారెడ్డికి చెందిన పిప్పిరి శెట్టి దినేష్ 87 మార్కులతో రెండో ర్యాంకు, మల్కాజ్‌గిరికి చెందిన విజయనందిని 84 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. అలాగే, పీజీఎల్‌సెట్-2024లో సికింద్రాబాద్‌కు చెందిన పెరి బాలసాయి విష్ణువర్ధన్ 76 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు.

ఏసీబీ వలకు చిక్కిన సీసీఎస్ సీఐ

- మూడు లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులను చూసి పరుగు
- వెంబడించి పట్టుకున్న వైనం

హిమాయత్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రూ.3లక్షలు లంచం తీసుకుంటూ సీసీఎస్ సీఐ చామకూరి సుధాకర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. హైదరాబాద్ సీసీఎస్ ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) టీమ్-7 సీఐగా సుధాకర్ పని చేస్తున్నాడు. ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన మణిరంగస్వామి అనే వ్యక్తి సుధాకర్‌ను కలిసి తన మీద సీసీఎస్‌లో నమోదైన కేసు మూసివేతకు సహకరించాలని కోరాడు. ఇందుకోసం రూ.15 లక్షలు ఇచ్చేందుకు మణిరంగస్వామి అంగీకరించాడు. అనుకున్న ప్రకారం సీఐ సుధాకర్‌కు రూ.5 లక్షలను గతంలోనే చెల్లించాడు. రెండో విడతగా మరో మూడు లక్షలు ఇవ్వాల్సి ఉంది. దీనిపై రంగస్వామి ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలోని సీసీఎస్ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలంలో రంగస్వామి నుంచి డబ్బు ఉన్న బ్యాగ్‌ను సుధాకర్ తీసుకున్నాడు. ఈ క్రమంలో అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులను గుర్తించిన సుధాకర్ బ్యాగ్‌ను వదిలేసి అక్కడి నుంచి పరుగు తీశాడు. అతన్ని వెంబడించిన ఏసీబీ అధికారులు కొద్ది దూరంలోనే సుధాకర్‌ను పట్టుకుని అదుపులోకి తీసుకుని నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 14 జూన్ 2024

సివిల్స్ ప్రిలిమ్స్

GS Mock Questions

నిన్నటి తరువాయి

71. Consider the following statements regarding Loss and Damage (L&D) Fund:
1. It was first announced in COP26(Glasgow).
2. Warsaw International Mechanism (WIM) for L&D was established at COP 19 in 2013.
3. It will focus upon mitigation of losses caused due to climate change.
Select the correct answer using the code given below:
a. 1 and 3 b. 2 only
c. 2 and 3 only d. 1, 2 and 3

72. Consider the following statements Regarding Global Renewables and Energy Efficiency pledge initiative recently launched in COP 28, which of the following statements is/are correct?
1. Double the global energy efficiency improvement rate to more than 4% by 2030.
2. Triple the global installed renewable energy capacity by 2030.
3. India is a signatory.
Select the correct answer using the code below:
a. 1 and 2 only b. 3 only
c. 2 and 3 d. 1, 2 and 3

73. Consider the following statements regarding India's Panchamrit commitments declared in COP26 held at Glasgow:
1. Meet 40% of its energy requirements from renewable energy by 2030.
2. Reach 500GW non-fossil energy capacity by 2045.
3. Reduction of the carbon intensity of the economy by 45% by 2030,over 2005 levels.
4. Reduction of total projected carbon emissions by three billion tonnes from now to 2030.
5. Achieving the target of net zero emissions by 2070.
How many of the statements given above are correct?
a. Only two b. Only three
c. Only four d. All five

74. Global Greenhouse Gas Watch (GGGW) is an initiative launched by
a. The UNEP Secretariat
b.The Intergovernmental panel on Climate change
c. The UNFCCC secretariat
d. The World Meteorological Congress

75. Methylotuvimicrobium Buryatense 5GB1C a methane eating microorganism, recently in news, is a
a. Bacteria b. Virus
c. Fungi d. Protozoa

76. How many of the following pollutants are used to measure the Air Quality Index (AQI)?
1. Lead 2. Ammonia
3. Ozone 4. Carbon Monoxide
Select the correct answer using the code given below:
a. 1 and 2 only b. 1, 2 and 4 only
c. 2,3 and 4 only d. All four

77. Consider the following statements regarding "BAD OZONE":
1. It is ground level ozone formed in the Troposphere.
2. It is formed when two primary pollutants(sulphur oxides and volatile organic compounds) react in sunlight and stagnant air.
3. It damages vegetation.
Which of the statements given above is /are correct?
a. Only 1 b. 2 and 3 Only
c. 1 and 3 Only d. 1, 2 and 3

78. Consider the following statements regarding Minamata Convention on Mercury:
1. It is a global legally binding treaty to protect human health and environment from adverse effects of mercury.
2. India ratified it in 2017 with flexibility for continued use of mercury-based products and processes involving mercury compounds up to 2030.
3. It requires that party nations to reduce and eliminate use and release of mercury from Artisanal and small scale Gold mining.
Which of the statements given is correct?
A. Only 1 b. 1 and 3 only
c. 2 and 3 only d. 1, 2 and 3

79. Consider the following pairs:

S. No	Reports seen in news	Published by
1.	Emission Gap report	UNEP
2.	Global stocktake (GST) technical synthesis report	World Economic Forum
3.	Paris Agreement Synthesis report	UNFCCC
4.	Adaptation gap report	IPCC

How many of the above pairs are correctly matched?
a. Only one b. Only two
c. Only three d. All four


80. Consider the following statements about the Kunming-Montreal Global Biodiversity Framework (KMGBF):
1. It was adopted at COP 28 to the United Nations Framework Con vention on climate change (UNFCCC).
2. It replaced the Aichi Biodiversity Targets that expired in 2020.
3. It is not an international treaty and is therefore not legally binding on Parties.
4. It establishes four goals to achieve by 2050 and 23 targets to meet by 2030.
How many of the statements given above are not correct?
a. Only one b. Only two
c.Only three d. All Four

81. Consider the following statements regarding AUKUS:
1. It is a three way strategic defense alliance between Australia, UK and US which,was signed in 2020.
2. It involves supporting Australia in acquiring nuclear armed submarines.
Which of the statements given above are correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

82. Consider the following pairs:

S.no	Exercises	Countries
1.	Shinyuu Maitri	India and Japan
2.	DUSTLIK-2023	India and Kazakhstan
3.	Bold Kurukshetra	India and France

Which of the following a pairs given above correctly matched?
a. 1, 2 Only b. 1 and 3
c. 1 only d. 2 and 3 only



83. 'The Skyes -Picot Agreement' which was recently seen in news is related to:
1. **Statement-I:** It is secret treaty between drawn up in 1916 between Russia and Great Britain.
2. **Statement-II:** The major issue of the treaty divided up the Arab lands of the ottoman Empire into British and French zones of control following the end of world war I.
Select the correct statements from the given above:
a. Both Statement-I and Statement -II are correct and statement -II is the correct explanation for statement-I
b. Both Statement I and Statement-II are correct and Statement -II is not the correct explanation for Statement-I
statement _I is correct but Statement-II is incorrect.
statement -I is incorrect but Statement-II is correct

84. Consider the following statements regarding the Five Eyes Intelligence Alliance:
1. It is an intelligence alliance comprising the US, UK, Australia, Canada, and New Zealand.
2. It originated from the 1946 UK-USA agreement for sharing signals intelligence.
Which of the statements given above is correct?
a. Only 1 2. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

85. Consider the following statements regarding the International Criminal Court (ICC):
1. It was established by the Rome Statute in 1998.
2. It investigates individuals accused of serious international crimes.
3. The Court has fifteen judges, each from a different country, elec ted to nonrenewable nine-year terms.
4. India is not a member of the ICC.
How many statements given above are correct?
a. Only One b. Only two
c. Only three d. All four

86. How many of the above-mentioned countries are part of the Indian ocean Rim Association?
1. India 2. Iran
3. Mauritius 4. Somalia 5. Yemen
a. Only two b. Only three
c. Only four d. All five

87. Consider the following statements regarding the Indo-Pacific Economic Framework for Prosperity (IPEF):
1. India has joined all four pillars of IPEF.
2. It was jointly launched by the India and USA.
3. All the partner countries represent 40% of world GDP.
4. The US trade Representative (USTR) is lead agency for the trade pillar, while the Indian Ministry of Commerce is leading the other three pillars.
How many statements given above are correct?
a. Only one b. Only two
c. Only three d. All four

88. Which of the following statements is not correct about the Voice of Global South Summit (VOGSS)?
a. It focused on ways to sustain the momentum generated toward a more inclusive, representative, and progressive world order.
b. India previously hosted the first VOGSS, where 125 Global South countries came together with the theme "Unity of Voice, Unity of Purpose."
c. The term "Global South "refers to various countries often described as "developing "," less developed "or "underdeveloped."
d. South Africa hosted the second Voice of Global South Summit.

89. Consider the following statements regarding the Genocide Convention:
1. It was the first human rights treaty adopted by the UN General Assembly.
2. According to the convention, genocide is a crime that can take place only in time of war.
3. India has signed the treaty.
How many of the above statements are correct?
a. Only one b. Only two
c. All three d. None

90. Consider the following statements regarding Kampala declaration:
1. It was adopted at the recent summit of the Non-Aligned Movement (NAM).
2. It strongly condemned the Russian aggression against Ukraine.
Which of the statements given above are correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

91. Consider the following statements with reference to GM crops:
1. Bt. Mustard (DMH 11) and Bt. cotton are only two crops that have been approved for commercial cultivation.
2. Bt Cotton has shown strong resistance to pink Bollworm attack in recent times.
Which of the statements given above is correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

92. Consider the following statements regarding the recently adopted Bletchley Declaration recently seen in news:
1. It aims to regulate Artificial intelligence through international collaboration.
2. It includes all the member countries of the United Nations.
Which of the statements given above is correct?
a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

93. Consider the following statements with reference to Chandrayaan 3 payloads:
1. The propulsion module has Spectro-polarimetry of Habitable Planet Earth (SHAPE) payload to measure the thermal conductivity and temperature.
2. The Lander module has Chandra's Surface Thermophysical Experiment (ChaSTE) to study the spectral and Polari metric measurements of Earth from the lunar orbit.
3. The Rover payloads are Alpha Particle X-ray Spectrometer (APXS) and Laser Induced Breakdown Spectroscope (LIBS) for deriving the elemental composition in the vicinity of landing site.
How many of the statements given above is correct?
a. Only one b. Only two
c. All three d. None

94. Consider the following statements regarding the AIRAWAT supercomputer recently seen in news:
1. It is India's largest and fastest AI supercomputing system.
2. It is installed at IIT Bombay under the National program on Artificial intelligence.
3. It is top 50 in the top 500 Global supercomputing list.
How many statements given above are correct?
a. Only one b. Only two
c. All three d. None

95. With reference to satellite communications technology,'Nabhmitra' is:
a. Navigation tool for private airlines
b. Meteorological data collection unit
c. Laser technology used in the tourism industry.
d. Satellite communication service for fisherman

96. Consider the following statements:
Statement-I: August 23 is declared as the National Space Day.
Statement-II: August 23 is the birthday of Vikram Sarabhai, an eminent space scientist regarded as the father of space program in India.
Which one of the following is correct in respect of the above statements?
a. Both Statements-I and Statement-II are correct, and Statement-II is the correct explanation for Statement-I
b. Both statements-I and Statement-II are correct and Statement -II is not the correct explanation for Statement-I
c. Statement-I is correct, but Statement-II is incorrect.
d. Statement-I is incorrect but Statement -II is correct.

97. Consider the following pairs:

S.No.	Moon mission	Country
1.	Danuri	South Korea
2.	Hakuto -R	Japan
3.	Luna 25	France
4.	Beresheet 2	UAE

How many pairs given above are correctly matches?
a. Only one b. Only two
c. Only three d. All four

98. Consider the following statements regarding a Black Hole:
1. It is a place in space where gravity pulls so much that even light cannot get out.
2. Most black holes are formed from the remnants of a large star dies in a supernova explosion.
3. It cannot be directly observed as it does not emit or radiate light.
How many statements given above are correct?
a. Only one b. Only two
c. All three d. None

99. Research found the presence of tantalum in the Sutlej River sand. In this context consider the following properties of the tantalum:
1. Grey, heavy, ductile metal.
2. Very hard metal.
3. Possess high corrosion resistance.
4. Immune to chemical attacks at any range of temperature.
5. Extremely high melting point.
How many of the above are properties of tantalum?
a. Only two b. Only three
c. Only four d. All five

100. ISRO's Project NETRA aims to
a. Explore planets outside the solar system.
b. Aid detection and mapping of ocean bed resources.
c. Provide early warning system in space to detect debris and other hazards to Indian satellites.
d. Ease navigation in metropolitan cities.

ANSWERS

71. b			93. a
72. a	79. b	86. d	94. a
73. c	80. c	87. b	95. d
74. d	81. b	88. d	96. c
75. a	82. c	89. b	97. b
76. d	83. d	90. d	98. c
77. c	84. c	91. d	99. c
78. b	85. b	92. a	100. c

Prepared by : CSB Academy, Hyderabad



తెలివైన దుప్పి

అనగనగా ఒక అడవిలో అందమైన,తెలివైన దుప్పి ఉండేది. ఒక రోజు అది ఒక గుహ దగ్గర ఆహారం కోసం వెతుక్కుంటూ ఉండగా దూరాన ఒక పులి దానికి కనిపించింది. వెంటనే దుప్పి గుహలోనికి దూరిపోయింది కానీ పులి కూడా అదే గుహలోకిరావచ్చేమో అని భయపడింది. పులి ఆ గుహ దగ్గరికి రాగానే లోపల ఉన్న దుప్పి గంభీరంగా గొంతు మార్చి,' గత కొన్ని రోజులుగా పులి గుండెకాయ తినలేదు కదా మనం, ఇవాళ ఏదైనా పులి కంటబడితే చూద్దాం' అన్నది. ఆ మాటలు విన్న పులి గుహ లోపల ఏదో తనకంటే భయంకరమైన పెద్ద జ.ంతువు ఉందనుకోని భయపడింది. ఇంతలో అక్కడికి ఒక తోడేలు వచ్చి ఏమైంది నువ్వు భయపడ్డట్టు కనబడుతున్నావు? అని అడిగింది. పులి తాను విన్న మాటలు తోడేలుతో చెప్పింది. ఈలోగా గుహ నుండి బయటకు రాబోయిన దుప్పికి.. పులి, తోడేలు రెండూ కనబడ్డాయి. వెంటనే తప్పుకుని లోపలికి వెళ్లి, పులి కనబడక పోతే ఈ రోజుకి ఏదైనా తోడేలును వేటాడి, దాని గుండెకాయ తిందాంలే అన్నది. ఆ మాటలు బయటనుండి విన్న పులీ తోడేలు రెండూ ఆ ప్రాంతాన్ని వదిలి అక్కడినుండి దూరంగా వెళ్లిపోయాయి. అలా దుప్పి తన ప్రాణాలను కాపాడుకుంది.



సరైన నీడ ఏది?



ఎన్ని కుక్కలు, పిల్లులు ఉన్నాయి?



7 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 332

6		8		2				7
	4	2					5	
	9				8			1
4			9				3	
			7		2			
	6				3			9
3			5				7	
	7					5	1	
5				1		9		4

సుడోకు - 331 సమాధానం

8	7	6	2	1	9	3	4	5
5	3	9	6	7	4	1	8	2
4	1	2	5	8	3	6	9	7
7	6	5	1	4	8	2	3	9
9	8	3	7	2	6	5	1	4
1	2	4	3	9	5	8	7	6
2	5	1	4	3	7	9	6	8
6	4	8	9	5	1	7	2	3
3	9	7	8	6	2	4	5	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.